Dwaraka

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

సంపుటి 11 | సంచిక 81a

ఆదివారం | 14 జనవరి 2018 | హైదరాబాద్ | పేజీలు 12+12+16 | వెల: రూ. 6.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్య మాసం, బహళ పక్ష తిథి : త్రయోదశి తె.2.44, జ్యేష్ఠ మ.2.12, వర్జ్యం లేదు
రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు; దుర్ముహూర్తం: సా.4.25 నుంచి 5.13 వరకు, సూర్యోదయం : ఉ.6.53 గం; సూర్యాస్తమయం: సా. 5.57 గం.



పట్నం ఊరెళ్లింది!

- బోసిపోయిన నగర రోడ్లు
- టోల్‌గేట్లవద్ద కిలో మీటర్ల మేర ట్రాఫిక్
- ఊరెళ్లే ప్రయాణికులతో రైళ్లు, బస్సులు కిటకిట
- ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్లన్నీ బుకింగ్
- రైళ్లలో రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు పూర్తి
- సొంత ఊరుకు వెళ్లడమెలా అని ప్రయాణికుల ఆందోళన
- సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ
- హైదరాబాద్ విజయవాడ హైవేపై కిలో మీటర్ల మేర వాహనాల బారులు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : పట్నం ఊరెళ్లింది. సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలోని ప్రజలు స్వంత గ్రామాలకు వెళ్లడంతో నగర రహదార్లు బోసిపోయాయి. నిత్యం ట్రాఫిక్ రద్దీతో..వాహనాల జాంలతో సతమతమయ్యే ప్రజలు శనివారంనాడు హాయిగా రోడ్లపై హాయిగా వెళ్లగలిగారు. సంక్రాంతి పండుగకు ప్రజలు స్వంత ఊర్లకు వెళుతుండడంతో హైదరాబాద్ నుంచి ఆంధ్రా, అలాగే ఇతర మిగతా 6లో



సూర్య పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటన కర్తలకు శ్రేయోభిలాషులకు భోగి శుభాకాంక్షలు
-సూర్య యాజమాన్యం

ముందస్తుకు మేం రెడీ

కేంద్రానికి ఆ ధైర్యం ఉందా : మంత్రి కేటీఆర్

- మేం కష్టాల్లో ఉన్నప్పుడు ఏపీ ఇవ్వలేదు
- నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని ఆశిస్తున్నాం
- జైలులో చిప్పకూడు తిన్నోడు అవినీతి గురించి మాట్లాడటమా?
- అక్రమాలు జరిగితే కోర్టుకెళ్లొచ్చుగా : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకు మేం రెడీ. అయితే వెళ్లేంత ధైర్యం కేంద్రానికి ఉందా? అని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు వ్యాఖ్యానించారు. తమది పనిచేసే ప్రభుత్వం అని, ఎన్నికలెప్పుడు వచ్చినా తాము సిద్ధమని స్పష్టం చేశారు. విభజన చట్టం ప్రకారం నియోజకవర్గాల పుర్విభజన ఉంటుందని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. శనివారం మంత్రి కేటీఆర్ సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. కేంద్రంపై ప్రజల్లో కొంతమేర అసంతృప్తి కనిపిస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం ముందస్తు ఎన్నికలకు వెళ్లకపోవచ్చునని మిగతా 6లో

కొత్త పాస్‌పుస్తకాల పంపిణీ

- మార్చి 11న రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు అందజేత
- రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోడీకి ఆహ్వానం
- దేశానికే ఆదర్శంగా భూ రికార్డుల ప్రక్షాళన
- కోర్ బ్యాంక్ తరహాలో ల్యాండ్ వెబ్‌సైట్
- 'ధరణి' పేరుతో ల్యాండ్ వెబ్‌సైట్
- అవినీతికి ఆస్కారం లేకుండా కొత్త రిజిస్ట్రేషన్ విధానం
- మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఇక రిజిస్ట్రేషన్లు
- ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః మార్చి 11న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఒకే రోజు కొత్త పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. కొత్త పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి దేశ రాష్ట్రపతి లేదా ప్రధాన మంత్రిని ఆహ్వానించనున్నట్లు సిఎం వెల్లడించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా స్వతంత్ర భారతదేశ చరిత్రలో కేవలం తెలంగాణలో మాత్రమే సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టామని సిఎం వెల్లడించారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ కార్యక్రమం తర్వాత భూమి వివరాలు ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని, ఈ వివరాలతో కూడిన పాస్ పుస్తకాలు కొత్తగా ప్రింట్ చేస్తున్నట్లు సిఎం వెల్లడించారు. ఇవే వివరాలను ప్రభుత్వ వెబ్ సైట్ లో పెడతామన్నారు. కోర్ బ్యాంకింగ్ తరహాలో ల్యాండ్ వెబ్ సైట్ నిర్వహిస్తామని, దీనికి ధరణి అనే పేరును ఖరారు చేసినట్టు సిఎం వెల్లడించారు. అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేని పారదర్శకమైన కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని తీసుకొస్తున్నామని మిగతా 6లో

జడ్జీల వివాదంలో బార్ కౌన్సిల్ మధ్యవర్తిత్వం

- సుప్రీం కోర్టు బార్ కౌన్సిల్ సమావేశంలో కీలక చర్చలు
- న్యాయవ్యవస్థ అంతర్గత వ్యవహారమన్న కేంద్రం
- స్వాగతించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్
- న్యాయవ్యవస్థపై మాట్లాడే అవకాశాన్ని న్యాయవ్యవస్థే కల్పించింది
- మరోసారి మీడియా ముందుకు వెళ్లవద్దని జడ్జీలను కోరిన మిశ్రా

6లో



కార్తీ చిదంబరం కార్యాలయాలపై ఈడీ దాడులు

- ఎయిర్‌సెల్-మాక్సిస్ మనీ లాండరింగ్ కేసులో భాగంగా
- ఢిల్లీ, చెన్నైల్లోని కార్తీ కార్యాలయాలపై అధికారుల దాడులు
- గత నెలలో ఇదే విధంగా చిదంబరం బంధువుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు
- కేసు విచారణలో భాగంగా ఈడీ ఎదుట హాజరుకావాల్సిందిగా కార్తీ చిదంబరానికి సమన్లు జారీ
- సమన్లు జారీ చేసిన రెండో రోజే చర్యలు
- ఐఎన్‌ఎక్స్ మీడియా సంస్థలో విదేశీ పెట్టుబడులకు అక్రమ అనుమతులు

6లో



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

చంద్రగిరిని మరచిన బాబు

- చంద్రబాబు చంద్రగిరికి చేసింది ఏమీ లేదు
- ప్రజా సంకల్ప యాత్రలో చంద్ర బాబుపై నిప్పులు చెరిగిన జగన్
- బాగుపడ్డ ప్రతి ఒక్కరూ సొంత గడ్డకు ఏదైనా చేయాలని తపిస్తారు
- కానీ చంద్రబాబు సీఎం అయినా చంద్రగిరికి చేసిందేమీ లేదు



(రామచంద్రపురం నుంచి సూర్య పొలిటికల్‌బ్యూరో ప్రత్యేకప్రతినిధి) సొంతగడ్డ చంద్రగిరి నియోజకవర్గానికి చంద్రబాబు నాయుడు ఏం చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం ప్రజాసంకల్పయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రపురంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "చంద్రగిరి నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టింది ఈ నియోజకవర్గంలోనే. ఆశ్చర్యం ఏంటో తెలుసా. 1978లో ఇదే చంద్రబాబు ఇక్కడి నుంచి పోటీ చేశారు. 2 వేల ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికయ్యాడు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో ఉన్న వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చలవతో మంత్రి కూడా అయ్యాడు. మంత్రి అయి ఐదేళ్లు పరిపాలన చేశాడు. మళ్లీ 1983లో ఎన్నికలు జరిగాయి. మంత్రి స్థాయిలో మిగతా 6లో

అంతే ఇంతే!



ట్రంప్ తక్షణమే క్షమాపణలు చెప్పాలి

- ముక్తకంఠంతో ఆఫ్రికన్ దేశాల డిమాండ్
- ఆఫ్రికా వంటి చెత్తదేశాల నుండి వచ్చే ఇమ్మిగ్రేషన్స్ అక్కర్లేదన్న ట్రంప్
- ట్రంప్ వ్యాఖ్యలపై 54 ఆఫ్రికన్ దేశాలు అత్యవసర సమావేశం
- జాతివివక్ష వ్యాఖ్యలు సరికావని తీర్మానం



ఎంపీటీసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయకేతనం

మూడు స్థానాల్లో కాంగ్రెస్ విజయం

హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో జరిగిన ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ జయకేతనం ఎగురవేసింది. జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 16 స్థానాలకు ఎన్నికలు జరగగా, ఇందులో టీఆరెస్ 11 స్థానాలను గెల్చుకుని మరోసారి తన సత్తా చాటుకుంది. ఇక కాంగ్రెస్, బీజేపీలు చెరి రెండు స్థానాలు గెలుచుకుని సంతృప్తి చెందాయి. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం లింగంపల్లి ఎంపీటీసీ ఉపఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి లింగమ్మ విజయం సాధించింది. లింగమ్మ తన సమీప ప్రత్యర్థిపై 451 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలంలోని జన్వాడ ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి మల్లేశ్ గౌడ్ 561 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి నాగేందర్‌పై గెలిచారు. ఇక నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కిష్టాపురం , నిడమనూరు మండలం ఎర్రబెల్లి ఎంపీటీసీ స్థానాల్లో అధికార పార్టీ టీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. కిష్టాపురంలో టీఆర్ఎస్ అభ్యర్థి కదెరె లింగయ్య 508 ఓట్ల ఆధిక్యంతో తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి మునుకుంట్ల గోపాల్ గౌడ్‌పై విజయం సాధించారు. ఎర్రబెల్లి ఎంపీటీసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి మన్నెం వెంకన్న యాదవ్ 1331 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి సిద్దనూరు వెంకటేశ్వర్లు 768 ఓట్లు దక్కించుకున్నారు. దీంతో 563 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి సిద్దనూరు వెంకటేశ్వర్లుపై టీఆర్ఎస్ అభ్యర్థి మన్నెం వెంకన్న యాదవ్ ఘన విజయం సాధించారు. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలంలోని కన్మనూర్ ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గోవిందమ్మ 382 ఓట్ల తేడాతో తన సమీప ప్రత్యర్థిపై విజయం సాధించింది. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటల మండల ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి పసునూరి స్వప్న 450 ఓట్ల మెజారిటీతో గెలిచింది. వనపర్తి జిల్లా గోపాల్ దిన్నె ఎంపీటీసీ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థిపై 491 ఓట్ల తేడాతో విజయం సాధించారు. భద్రాచలం ఎంపీటీసీ ఏడో స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో టీఆర్ఎస్ విజయం సాధించింది. సీపీఎం అభ్యర్థిపై 74 ఓట్ల తేడాతో టీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు.

ఫిబ్రవరిలో విదేశీ భవన్‌కు శంకుస్థాపన

- ఈ-మైగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకోకపోతే అంతే
- అక్రమ ఏజెంట్లకు ప్రభుత్వం హెచ్చరిక
- విదేశాల్లో ఉపాధికి టామ్ కాం సహకారం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఫిబ్రవరి రెండో వారంలో విదేశీ భవన్‌కు శంకుస్థాపన జరగనుందని విదేశీవ్యవహారాలు, ఐటి, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు తారకరామారావు పేర్కొన్నారు. శనివారం హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డితో కలిసి ఎన్ఆర్ఐ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. అక్రమ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఏజెంట్లు నెల రోజుల్లో రిజిస్టర్ చేసుకోవాలని, లేదంటే అక్రమ ఏజెంట్లుగా గుర్తించి కేసులు పెడతామన్నారు. అంతేగాక పదేపదే అక్రమాలకు పాల్పడుతున్న ఏజెంట్లపై పీడీ యాక్ట్ పెడతామని మంత్రి పేర్కొన్నారు. కాగా... గల్ఫ్‌కు మహిళల అక్రమ రవాణాపై పోలీస్‌శాఖ మరింత కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. విదేశాలకు పంపిస్తామని చెప్పి అమాయకుల్ని మోసం చేసే అక్రమ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు మంత్రులు కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. ఈ-మైగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకునేందుకు ఏజెంట్లకు నెల రోజుల సమయం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ లోగా నమోదు చేసుకోకపోతే వారందరిని అక్రమ ఏజెంట్లుగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో విదేశీ భవన్‌కు ఫిబ్రవరి రెండో వారంతో శంకుస్థాపన చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని అధికారులతో అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నారైలు వలస కార్మికుల కోసం చేపడుతున్న చర్యలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలన్నారు. గల్ఫ్‌కు మహిళల అక్రమ రవాణాపైన మరింత కఠినంగా వ్యవహరించాలని పోలీసు శాఖను అదేశించారు. ఈ విషయంలో మైనార్టీ సంక్షేమ, కార్మిక, ఎన్నారై, పోలీసు శాఖలు ఉమ్మడి బృందాల ఏర్పాటు చేయాలని మంత్రులు ఆదేశించారు. సచివాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పోలీస్, హోం, ఎన్నారై శాఖల అధికారులు పాల్గొన్నారు. గత వారంలో డిల్లీలో విదేశాంగ వ్యవహారాల శాఖ మంత్రి అధ్యర్యంలో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను, రాష్ట్ర స్థాయిలో అమలు చేసేందుకు ఈ సమావేశం నిర్వహించారు. బతుకు దెరువుకోసం వీదేశాలకు వెళ్లేవారిని మోసం చేస్తున్న నకిలీ గల్ఫ్ ఏజెంట్ల పైన కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సమావేశంలో పాల్గొన్న డిజిపి ఈ నకిలీ ఏజెంట్లపైన చర్యలు తీసుకుటుంటామని, ఇందుకు సంభదించి త్వరలోనే మార్గదర్మకాలు జారీ చేస్తామని తెలిపారు. అక్రమ ఎజెంట్ల పైన చర్యలు తీసుకునే విషయంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని మంత్రులు విజప్తి చేశారు.

సురక్షితంగా వెళ్లండి, సుశిక్షితులై వెళ్లండి

అనే కేంద్ర ప్రభుత్వ విదేశాంగ శాఖ నినాదానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వ టామ్ కాం కంపెనీ ద్వారా చట్టపరంగా విదేశాలకు వెళ్లాలన్నారు. దీంతోపాటు రాష్ట్రంలో ఉన్న రిజిస్టర్డ్ ఎజెంట్ల ద్వారానే వెళ్లాలని మంత్రులు కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నారైలకు, వసల కార్మికులకోసం చేపడుతున్న చర్యలను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని మంత్రి కెటి రామారావు తెలిపారు. గల్ఫ్ దేశాలకు జరుగుతున్న మహిళల అక్రమరవాణా, మోసపూరిత వివాహాలపైన మరింత కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర పోలీసు శాఖ గతకొంత కాలంగా తీసుకుంటున్న చర్యలను మంత్రి అభినందించారు. ఇలాంటి మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో మైనార్టీ సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ఎన్నారై శాఖ, పోలీస్ శాఖలు ఉమ్మడి సంయుక్త సమన్వయ బృందాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇక్కడ పోలీసుల చర్యలతో ముంబాయి, కలకత్తా వంటి ప్రాంతాల నుంచి ఈ ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో అయా రాష్ట్రాల అధికారుల సహాకారం తీసుకోవాలని సూచించారు. ఈ మానవ అక్రమ రవాణకు పాల్పడుతున్న ఏజెంట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఈ మేరకు పాస్ పోర్టు కార్యాలయ అధికారుల సహాకారం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిజిపి మహేందర్ రెడ్డి, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది, ఎన్నారై, పోలీసు శాఖాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో చెన్నారెడ్డిది కీలక పాత్ర: నాయిని



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ ఉద్యమంలో చెన్నారెడ్డి కీలక పాత్ర పోషించారని తెలంగాణ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. చెన్నారెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, మాజీ గవర్నర్ రోశయ్య, పాండిచ్చేరి సీఎం నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చెన్నారెడ్డి పాత్ర చాలా గొప్పదన్నారు. స్వరాష్ట్ర ఉద్యమాన్ని చెన్నారెడ్డి పతాక స్థాయికి తీసుకెళ్ళారని, ఉద్యమాన్ని బలహీన పరచలేదన్నారు. చెన్నారెడ్డి స్ఫూర్తితోనే కేసీఆర్ మలిదశలో ఉద్యమించారని చెప్పారు. సోనియా హామీ మేరకు తెలంగాణ ఇచ్చారన్నారు. చెన్నారెడ్డి స్ఫూర్తితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్ళాలన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం చెన్నారెడ్డి చేసిన కృషి ఎనలేనిదని రోశయ్య పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి నాంది పలికింది చెన్నారెడ్డి అని పాండిచ్చేరి సీఎం నారాయణ స్వామి అన్నారు. రాజకీయ జీవితానికి చెన్నారెడ్డి మంచి సలహాలిచ్చారని, ఆయన ఇచ్చిన సలహాలను ఇప్పటికీ పాటిస్తున్నానని నారాయణస్వామి చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం : డాక్టర్ సి.లక్ష్మారెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగు పర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని నిలోఫర్ ఆసుపత్రిలో వసతి గృహాన్ని కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ, మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి ఆయన మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేరు గాంచిన పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌కు రోజుకు వందలాది మంది రోగులు వస్తున్నారని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో వసతి గృహం లేకపోవడంతో రోగుల సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొనే ఈ నూతన వసతి గృహాన్ని ప్రారంభించినట్టు పేర్కొన్నారు. కాగా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల బంధువుల కోసం జీహెచ్‌ఎంసీ మరిన్ని నైట్ షెల్టర్లను ఏర్పాటు చేసింది. ఇప్పటికే 12 ఉండగా మరో మూడింటిని కొత్తగా ఏర్పాటు చేశారు. నిలోఫర్‌తో పాటు మహవీర్, కోఠి ప్రసూతి ఆస్పత్రుల్లో రూ.4.8 కోట్లతో వీటిని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న తమ వారి కోసం వచ్చే అటెండెంట్లు రాత్రవేళ బస చేసేందుకు సరైన నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నైట్ షెల్టర్లు వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి.



సంక్రాంతిపండుగ సందర్భంగా ముఖ్యమంత్రిక్యాంపు కార్యాలయం ప్రగతిభవన్ లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు.

సీఎం తప్పుల వల్ల అధికారులు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి

కాంగ్రెస్‌నేత, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: విద్యుత్ కొనుగోళ్ల విషయంలో జరుగుతున్న కుంభకోణాలు తాను ప్రశ్నిస్తే టీఆర్ఎస్ ఎంపీ బాల్క సుమన్ మాత్రం వివరణ ఇవ్వకుండా తిట్లదండకం మొదలుపెట్టారని కాంగ్రెస్ పార్టీ నేత, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. బాల్క సుమన్ నన్ను రవ్వంత అన్నాడు. టీఆర్ఎస్ పార్టీ అవినీతి కొంపను తగులబెట్టేందుకు ఆ రవ్వే చాలని ఆయన అన్నారు . మతితప్పిన వాడి శృతి మించిన మాటలు ఎలా ఉంటాయో బాల్క సుమన్ మాటలు చూస్తే ఇట్టే తెలిసిపోతుందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుచేశారని, ఆ కారణంగానే ప్రభుత్వ అధికారులు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని స్వయంగా బాల్క సుమనే చెప్పినందుకు తాను అభినందిస్తున్నానని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ భద్రాద్రి పవర్ ప్రాజెక్టు విషయంలో నిబంధనలు ఉల్లంఘించి కేసీఆర్ తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వల్ల 23మంది అధికారులు జైలుకు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు సదరు అధికారుల్ని శిక్షించాలని చెప్పిందని గుర్తు చేశారు. ఈ విషయాన్నే నేను చెప్పానని పేర్కొన్నారు. దీనిపై బాల్క సుమన్ వచ్చి కొండను తవ్వి ఎలుకనన్నా పడతడేమంటే కనీసం తొండను కూడా పట్టలేకపోయారని అపహాస్యం చేశారు. 23మందిని కాదు ఇద్దరినే శిక్షించాలని కోర్టు చెప్పిందని కోర్టు కాపీ కూడా మీడియాకు ఇచ్చారన్న రేవంత్, బుద్ధి లేనోడా నేను చెప్పేది కూడా అదే అని ఎద్దేవా చేశారు. మీ ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని మీరు ఒప్పుకున్నట్లే కదా అని ప్రశ్నించారు. జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం క్రమంగా తగ్గించి, రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యుత్ కొనుగోలు చేస్తోందని రేవంత్ అన్నారు. ప్రైవేట్ విద్యుత్ సంస్థలకు చెందిన ఇచ్చే లంచాలు, కమిషన్‌లకు కక్కుర్తిపడి ప్రైవేట్ విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో 84శాతం ఉన్న ప్రభుత్వ విద్యుత్ సంస్థల వాటా 60శాతానికి పడిపోయిందన్నారు. తెలంగాణలో 24గంటల విద్యుత్ తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని రేవంత్ అన్నారు. 2008లో జీవో 53 ద్వారా 8, 9శాతం విద్యుత్ కేటాయింపులు మాత్రమే జరిగాయని బాల్క సుమన్ అంటున్నారని, 2008లో రాష్ట్రంలో కేంద్రంలో అధికారంలో ఉంది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. 2008లో జంటనగరాల్లో 24గంటల నిరంతర విద్యుత్ ఇవ్వాలని, రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఉద్దేశంతో ఆనాడు ఆంధ్ర ప్రాంతానికి 53.89శాతం తెలంగాణకు 46.11శాతం విద్యుత్ వినియోగం కేటాయించారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత జనాభా ప్రాతిపదికన తెలంగాణకు 43శాతం వాటా మాత్రమే వస్తుందని అలా జరిగితే తెలంగాణ చీకటి మయం అవుతుందని భావించి, 2008లో ఎలాంటి కేటాయింపులు చేశారో అదే కేటాయింపులు ఉండాలని సోనియాగాంధీ చెప్పారు. దాన్నే విభజన సమయంలో పేర్కొన్నారు. తెలంగాణకు పూర్తి స్థాయిలో విద్యుత్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చెప్పకుండా మీరే నిరంతర విద్యుత్ ఇస్తున్నట్లుగా ఎందుకు చెప్పుకుంటున్నారని రేవంత్ ప్రశ్నించారు.

సీఎం కేసీఆర్‌తో విద్యుత్ అవినీతిపై చర్చకు సిద్ధం

మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకువస్తే విద్యుత్ అవినీతిపై చర్చకు తాను సిద్ధమేనని మండలి విపక్షనేత షబ్బీర్‌అలీ సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్‌తో బహిరంగ చర్చకు సిద్ధమన్నా, టీఆర్ఎస్ నాయకత్వం ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు మంత్రివర్గంలో , రాజకీయాల్లో, కేసీఆర్ కంటే తానే సీనియర్‌నని ఆయన చెప్పుకొచ్చారు. శనివారం అసెంబ్లీ మీడియా హాల్ షబ్బీర్‌అలీ విలేకర్లతో మాట్లాడుతూ టీఆర్ఎస్ ఏదైనా రాజకీయ లబ్ధి కోసమే చేస్తుందని విమర్శించారు. గ్రామ సర్పంచ్‌ను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకునే విధానాన్ని తప్పించి, పరోక్ష పద్ధతిలో ఎన్నుకునే విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట సవరణ చేయబోతుందన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. పంచాయితీరాజ్ బిల్లు చట్ట సవరణపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెక్టులు ఏమయ్యాయని షబ్బీర్ అలీ ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై ఏర్పాటైన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ ఫాల్స్ కమిటీ అని ఆయన ఆరోపించారు. ఇప్పటికే అన్ని స్కూళ్లలో అడ్మిషన్లు పూర్తయ్యాయని, ఇక తిరుమలరావు కమిటీ నివేదిక వల్ల ప్రయోజనమేమిటనీ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఇచ్చిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్న షబ్బీర్‌అలీ, మంత్రి తుమ్మలపై విరుచుకుపడ్డారు. తుమ్మల జాగ్రత్తగా మాట్లాడాలని లేకపోతే ఆయన చరిత్ర తవ్వి తీయాల్సివస్తుందని హెచ్చరించారు.

మంత్రుల ఎదుటే ఏడ్చేసిన కొండా సురేఖ కూతురు!



వరంగల్ : ఎమ్మెల్యే కొండా సురేఖ కూతురు భావోద్వేగానికి గురయ్యారు. మంత్రుల ఎదుటే కన్నీరు పెట్టుకున్నారు. శనివారం గీసుకొండ మండలం వంచనగిరిలో రూ. 9.5 కోట్ల అభివృాఎద్ధి పనులకు మంత్రులు హరీశ్ రావు, తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, కొండా దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వేదికపై కొండా దంపతుల కుమార్తె, వంచనగిరి పీఏసీఎస్ చైర్మన్ సుస్మితాపటేల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా తన తండ్రి కొండా మురళిపై కాల్పులు జరిగిన ఘటనను గుర్తు చేసుకున్నారు. వంచనగిరి ప్రజల ఆశీర్వాదంతోనే తన తండ్రిని కాపాడుకోగలిగామంటూ భావోద్వేగానికి గురయ్యారు. పక్కనే ఉన్న కొండా దంపతులు ఆమెను ఓదార్చారు.

ఆ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవద్దు

- ఉద్యమ పార్టీకి రాజకీయ పార్టీకి తేడా ఉంటుంది
- నల్గొండ ఎంపీ గుత్తా

నల్లగొండ, మేజర్‌న్యూస్: తెలంగాణ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, టీజీవో గౌరవాధ్యక్షుడు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఆయన శనివారమిక్కడ మాట్లాడుతూ.. ఉద్యమ పార్టీ, రాజకీయ పార్టీకి తేడా ఉంటుందన్నారు. తెలంగాణలో టీడీపీ కనుమరుగు అయ్యే పరిస్థితుల్లో అందులోని బలమైన నాయకులను టీఆర్ఎస్‌లోకి తీసుకురావడం ద్వారా సుస్థిరమైన పభ్రుత్వం నడపాలనే తీసుకునే నిర్ణయంలో ఇలాంటివి సహజమన్నారు. స్థానిక పరిస్థితులు, జిల్లా రాజకీయాలు దృష్టిలో పెట్టుకుని కూడా ఇలాంటి నిర్ణయాలు ఉంటాయని గుత్తా వ్యాఖ్యానించారు. కాగా తెలంగాణ ఉద్యమ కారులను తిట్టినోళ్లు, కొట్టినోళ్లు ఇప్పుడు ముఖ్యమంత్రి వద్ద ఉన్నారని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అయితే అనంతరం ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాను వ్యాఖ్యలు చేసినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని చెప్పుకొచ్చారు. ప్రభుత్వంలో ఉద్యమకారులకు అన్యాయం జరుగుతుందని తాను అన్నట్లు మీడియాలో వచ్చిన వార్తలను శ్రీనివాస్ గౌడ్ ఖండించారు.మరోవైపు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి కూడా రెండురోజుల క్రితం ఇదే తరహాలో వ్యాఖ్యలు చేశారు. నాడు కేసీఆర్‌ను బండబూతులు తిట్టిన వారే నేడు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా, రాష్ట్ర కేబినెట్‌లో మంత్రులుగా కొనసాగుతున్నారని తనదైన శైలిలో విరుచుకుపడిన విషయం విదితమే. అయితే తెలంగాణలో టీడీపీని కూకటివేళ్లతో పెకలించేందుకే ఆ పార్టీ నేతలను టీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నామని అన్నారు.

ప్రధాని కార్యాలయం నుంచే అవినీతి

సీపీఐ జాతీయ నేత కె.నారాయణ



విజయవాడ, మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వం అవినీతి రాజకీయాలకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. ప్రధాని కార్యాలయం నుంచే ఈ అవినీతి నడుస్తోందని ఆయన అన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో శనివారం నారాయణ మీడియా సమావేశంలో మాట్లాడారు. చట్టాలను తమకు అనుకూలంగా మార్చేందుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీజేపీని వ్యతిరేకించేవారిపై సీబీఐతో దాడులు చేయిస్తున్నారన్నారు. ప్రధాని కార్యాలయానికి ముడుపులు ఇవ్వలేక అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని నారాయణ విమర్శించారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌లపై ఒత్తిడి తీసుకురావడం అప్రజాస్వామికం అన్నారు. సీబీఐ స్పెషల్ జడ్జి లోయా మరణంపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. మెడికల్ కుంభకోణంపై ప్రధానమంత్రి స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.


సర్పంచ్‌లు ఇక పవర్ ఫుల్

- నూతన పంచాయితీ చట్టం రెడీ
- పంచాయతీ రాజ్ చట్టంపై కేబినెట్ సబ్ కమిటీ భారీ కసరత్తు
- రెండు నెలల పాటు కసరత్తు చేసి ముసాయిదా రూపొందించిన నిపుణుల కమిటీ
- నాలుగు రోజులుగా ముసాయిదాపై మంత్రుల సబ్ కమిటీ చర్చ
- న్యాయ నిపుణులు, ఇతర అధికారులతో సమావేశాలు
- సీఎంకు నివేదిక అందజేత



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: గాంధీకలలుకన్న గ్రామ స్వరాజ్యస్థాపనే లక్ష్యంగా నూతన పంచాయితీ చట్టం రూపొందిస్తున్నారు. ఇంత వరకు స్థానిక స్వపరిపాలనకు, స్థానిక ప్రజాప్రతినిధులకు విధులు, నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్న నేతలకు తెలంగాణ సర్కార్ విధులు, నిధులతో బాటు బాధ్యతలు సైతం అప్పగిస్తోంది. రాష్ట్రంలో గ్రామసీమల అభివృద్ధి కోసం పంచాయితీరాజ్ చట్టాన్ని సవరించాలని, గ్రామాల అభివృద్ధి, సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే విధంగా కొత్త పంచాయితీరాజ్ చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశించిన విషయం తెలిసిందే. గత రెండు మాసాలుగా పంచాయితీరాజ్‌శాఖ అధికారులు పంచాయితీరాజ్ చట్టంపై నిపుణులతో భారీ ఎత్తున కసరత్తు చేశారు. కొత్త చట్టంలో పొందుపరచాల్సిన బాధ్యతలు, నిధులు,విధులపై ముసాయిదా రూపొందించారు. అయితే ముసాయిదా చట్టాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించి, గ్రామాల అభివృద్ధికి పౌరులకు మెరుగైన వసతుల కల్పనకు వీలుగా చట్ట ముసాయిదాను రూపొందించాలని సీఎం గత వారం క్రితం కేబినెట్ సబ్ కమిటీని నియమించిన విషయం విదితమే!. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి అధ్యక్షతన ఏర్పడ్డ కేబినెట్‌సబ్ కమిటీ వరుసగా నాలుగురోజులపాటు కొత్త చట్టంపై పొద్దస్థానం సమీక్షించింది. శనివారం నాడు కొత్త చట్టానికి కేబినెట్ సబ్ కమిటీ తుదిరూపు ఇచ్చింది. కేబినెట్ సబ్‌కమిటీ రూపొందించిన ముసాయిదా చట్టాన్ని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కుసమర్పించారు. కొత్త చట్టంలో గ్రామ పంచాయితీ సర్పంచ్‌కు పవర్‌ఫుల్ అధికారాలతో పాటు బాధ్యతలను కూడా కట్టబెట్టనున్నట్లు సమాచారం. దీనితో పాటు ఇప్పటి వరకు మొక్కుబడిగా కొనసాగుతున్న గ్రామ పంచాయితీ కార్యవర్గ సమావేశం ఇకపై రెండు నెలలకోమారు తప్పకుండా నిర్వహించి, గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను చర్చించి నిర్ణయిస్తారు. అలాగే గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు విధివిధానాలు రూపొందించి అమలు చేసే బాధ్యత సైతం పంచాయితీలకు కట్టబెడుతున్నారు. అలాగే గ్రామంలోని పౌరులు చట్టానికి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాలు చేసినా వారికి జరిమానా విధించే బాధ్యత సైతం పంచాయితీ కార్యవర్గానికి కల్పించనున్నారు. పంచాయితీ సర్పంచ్ తన విధులు సక్రమంగా నిర్వహించకుంటే మెజారిటీ సభ్యుల ఆమోదంతో సర్పంచ్‌ను తొలగించే వీలు సైతం కల్పిస్తున్నట్లు సమాచారం. పంచాయితీ ఎన్నికలను పార్టీ రహితంగా నిర్వహించేందుకు కేబినెట్ సబ్‌కమిటీలోని సభ్యులు దాదాపు మొగ్గచూపినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం పంచాయితీ సర్పంచ్ నేరుగా ప్రజలచే ఎన్నుకొనే విధానం...పరోక్ష ఎన్నికల అంశంపై తుది నిర్ణయం ముఖ్యమంత్రికే వదిలేసినట్లు సమాచారం. ఈనెలలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి పంచాయితీ నూతన చట్టాన్ని ఆమోదింపచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ నూతన చట్టాన్ని కేబినెట్ సబ్‌కమిటీ అధ్యక్షుడు మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షత మంత్రులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కేటీఆర్, తుమ్మల నాగేశ్వరరావు, ఈటెల రాజేందర్, హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డిపై విస్తృతస్థాయిలో చర్చించి ఆమోదం తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు : డాక్టర్ కె.లక్ష్మణ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రజలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సంక్రాంతి పండుగ ప్రజలందరికీ మంచి జరిగేలా నవకాంతుల్ని తేవాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇతరుల క్షేమం కోరుతూ ఒకరినొకరు సోదర భావంతో జీవించాలని, అప్పుడే మనకు కూడా ఇతరులు మంచి చేసేలా ఆలోచిస్తారని డా.లక్ష్మణ్ ఆకాంక్షించారు.

సూర్య
హైదరాబాద్
ఆదివారం
14 జనవరి 2018
3

సారూప్యత కోసం ఏపీపీఎస్సీ సంస్కరణ

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) : సారూప్యత కోసం ఏపీపీఎస్సీ సంస్కరణ శ్రీకారం చుడుతోంది. గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ ప్రశ్నపత్రాల మూల్యాంకనంలో ఏపీపీఎస్సీ కీలక సంస్కరణకు మొదలుపెట్టింది. ప్రశ్నల వారీగా మూల్యాంకనం చేసే సరికొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనం నుంచే ఈ పద్ధతిని ఆచరణలోకి తీసుకురానుంది. జవాబు పత్రాల మూల్యాంకనంలో సారూప్యతను సాధించేందుకు ఈ ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం గోవాలో ప్రారంభమైన 2 రోజుల పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్‌సీ) చైర్మన్ల సమావేశంలో ఏపీపీఎస్సీ చైర్మన్ పిన్నమనేని ఉదయ భాస్కర్ ఈ విషయాన్ని వివరించారు. ఇప్పటివరకు మెయిన్స్ రాసిన అభ్యర్థుల జవాబుపత్రాల సంఖ్యను బట్టి కొంత మంది ఎగ్జామినర్లను నియమించి వారికి కొన్ని పేపర్లు ఇచ్చి మూల్యాంకనం చేయిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ తరహా మూల్యాంకనంతో అభ్యర్థుల్లో కొన్ని అనుమానాలు తలెత్తుతున్నాయని సమావేశంలో చెప్పినట్లు సమాచారం. ఏదైనా ప్రశ్నకు సంబంధించి పరీక్ష రాసిన అభ్యర్థులందరి జవాబులను ఒకే ఎగ్జామినర్ మూల్యాంకనం చేయడంవల్ల సారూప్యత లభిస్తుందన్న ఉద్దేశంతో ఈ విధమైన సంస్కరణను ప్రస్తుతం గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ నుంచే అమల్లోకి తెస్తున్నట్లు ఆయన వివరించినట్లు తెలుస్తోంది.

ఇంటర్వ్యూ బోర్డులో 18 మంది ఆఫీసర్లు...

గ్రూప్-1(2011) సర్వీసెస్ ఇంటర్వ్యూ బోర్డులోకి 18 మంది ఆఫీసర్లను ప్రభుత్వం నామినేట్ చేసింది. ఇందులో 10 మంది ఐఏఎస్, 8 మంది ఐపీఎస్ అధికారులు ఉన్నారు. సింగిల్ బోర్డు ద్వారానే గ్రూప్-1 సర్వీసెస్ ఇంటర్వ్యూలను నిర్వహించాలని ఏపీపీఎస్సీ భావిస్తోంది. 18 మంది ఆఫీసర్లలో ప్రతి రోజు ఒకరు ఇంటర్వ్యూ బోర్డులో ఉంటారు. మొత్తం 152 పోస్టుల భర్తీ కోసం 294 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కానున్నారు.

ప్రారంభమైన వరల్డ్ స్వీట్ ఫెస్టివల్

- మూడు రోజుల పాటు తీపి పండుగ
- లోకల్ మేడ్
- మినీ ఇండియా



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః భిన్న సంస్కృతుల సమ్మేళనం మన భాగ్య నగరం. వేర్వేరు ప్రాంతాల ప్రజలు నివసించే నగరంలో విభిన్న సంస్కృతులు తారసపడతాయి. కళలు, సంప్రదాయాలే కాదు.. ఆహారపు అలవాట్లు కూడా సంస్కృతిలో భాగమే. ఒక్కో ప్రాంతానిది ఒక్కో ప్రత్యేకత. అలాంటి విభిన్న ప్రత్యేకతలను ఒకే వేదిక

మీదకు చేర్చుతున్నది తెలంగాణ ప్రభుత్వం. సంక్రాంతి సందర్భంగా నగరవాసులను తియ్యని వేడుకతో పలకరిస్తోంది. కైట్ ఫెస్టివల్‌తో పాటు మూడురోజుల పాటు వరల్డ్ స్వీట్ ఫెస్టివల్‌ని నిర్వహించనుంది ప్రభుత్వం. వేర్వేరు రాష్ట్రాల, దేశాల తీపి రుచులను నగరవాసులకు పరిచయం చేసింది.

పండుగ అనగానే పిండి వంటలు గుర్తుకు వస్తాయి. తీపి రుచులు నోరూరిస్తాయి. సంతోషపు క్షణాలకు తీయని రుచులు తోడవుతాయి. అందుకే.. ఈ సంక్రాంతిని మరింత తియ్యగా మార్చేందుకు వరల్డ్ స్వీట్ ఫెస్టివల్‌తో ముందుకు వస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఇరవై రాష్ట్రాలు, పది దేశాలకు చెందిన స్వీట్లను నగరవాసులకు పరిచయం చేసింది. ఈ రోజు నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కైట్ ఫెస్టివల్‌కి సమాంతరంగా వరల్డ్ స్వీట్ ఫెస్టివల్ జరుగుతుందని రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడించారు.

పలు జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు, సదస్సులతో హైదరాబాద్ నగరం ఇప్పటికే అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారింది. ఏటా లక్షల సంఖ్యలో దేశ, విదేశీ పర్యాటకులు నగరాన్ని సందర్శిస్తుండడం గమనార్హం. ఇప్పుడు వరల్డ్ స్వీట్ ఫెస్టివల్ అలాంటి మరో ప్రతిష్టాత్మక వేడుకగా అలరిస్తోంది. మునుపెన్నడూ దేశంలో ఎక్కడా ఇలాంటి వేడుకలు జరిగిన దాఖలాలు లేవు. కానీ తెలంగాణ ప్రభుత్వం వేర్వేరు ప్రాంతాల ప్రజల ఆహారపు అలవాట్లు ప్రతిబింబించేలా ఈ ఫెస్టివల్‌ని డిజైన్ చేసింది. నగరంలో నివసించే వేరు వేరు ప్రాంతాలకు చెందిన సంస్థల సహకారంతో ప్రభుత్వం ఈ ఫెస్టివల్‌ని నిర్వహిస్తున్నది. హోటళ్లు, క్యాటరర్స్ తయారు చేసినవి కాకుండా కేవలం స్థానిక నివసించే సాధారణ ప్రజలు తయారు చేసిన స్వీట్లను ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శిస్తుండడం గమనార్హం.

25 రాష్ట్రాలు, 10 దేశాలకు చెందిన తీపి వంటకాలను ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శిస్తున్నారు. . ఏకంగా వెయ్యికి పైగా రుచులు ఫెస్టివల్‌లో కొలువుదీరాయి. ఖుర్బానీ కా మీఠా - తెలంగాణ, పూతరేకులు - ఆంధ్రప్రదేశ్, ఖాప్సే- అరుణాచల్ ప్రదేశ్, నారికోల్ - అసోం, రసగుల్ల - బెంగాల్, మైసూర్ పాక్ - కేరళ, పొంగల్ - తమిళనాడు, బాసుంది - గుజరాత్, గేవర్ - రాజస్థాన్, మోదక్ - మహారాష్ట్ర, బలుషాహి - ఉత్తర ప్రదేశ్, ఖాజా - బీహార్, షష్ట - జమ్మూ కాశ్మీర్, అనర్స - జార్ఖండ్, గోండ్ కే లడ్డు - హర్యానా, మావ బటి - మధ్యప్రదేశ్, బబ్రూ - హిమాచల్ ప్రదేశ్, పిన్ని - పంజాబ్ వంటి ప్రత్యేకమైన స్వీట్లు నగరవాసులకు నోరూరిస్తున్నాయి. మొత్తంగా అన్ని ప్రాంతాల రుచులతో నగరంలోనే మినీ ఇండియాను చూడవచ్చని అధికారులు అంటున్నారు. ఇప్పటికే తెలంగాణ పర్యాటక శాఖ www.internationalsweetfestival.com పేరుతో వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ని విడుదల చేసింది కూడా. మరీ మీరూ తీపి వేడుకలో భాగంకండి మరి.

చంద్రబాబుకు అసెంబ్లీ సీట్లే ముఖ్యమా

వైసీపీ ఎమ్మెల్యే రోజా



చిత్తూరు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా ప్రత్యేక హోదా కావాలని కోరుకుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాత్రం అసెంబ్లీ సీట్లు కావాల్సి వచ్చిందని వైసీపీ ఎమ్మెల్యే రోజా ధ్వజమెత్తారు. నరేంద్రమోదీ, చంద్రబాబుతో ఏపీకి ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. చంద్రబాబు తన కేసుల నుంచి తప్పించుకునేందుకు అసెంబ్లీ సీట్లు పెంచుకోవడానికే ప్రాధాన్యమిచ్చారని రోజా విమర్శించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్న చంద్రబాబుకు అసెంబ్లీ సీట్ల పెంపు ఒక్కటే సమస్యగా కనిపిస్తుందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ముఖ్యమా, అసెంబ్లీ సీట్లు ముఖ్యమా అని ఆమె చంద్రబాబును ప్రశ్నించారు. ప్రధానితో భేటీ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంచాల్సిందిగా మోదీని కోరినట్లు చంద్రబాబు పేర్కొన్న విషయం విదితమే.

చంద్రబాబు ఏం సాధించారు

వైసీపీ నేత బొత్స



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ అంశాలు చర్చించారో ప్రజలకు వెల్లడించాలని వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 20 అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని చంద్రబాబు అన్నారు. "గతంలో ప్రధానితో చెప్పిన అంశాలను సీఎం మళ్లీ చెబుతున్నారు. చంద్రబాబు తీరు పాడిందే పాట అన్నట్లు ఉంది. పోలవరం ప్రాజెక్ట్ నిధుల గురించి ఏమైనా హామీ తెచ్చారా, విభజన చట్టంలోని ఏ ఒక్క అంశానికి హామీ తెచ్చినట్లు చెప్పలేకపోతున్నారు. చంద్రబాబు నాలుగేళ్లలో రాష్ట్రానికి ఏం సాధించారో చెప్పాలి. రూ.లక్షా 20వేల కోట్ల అప్పులు తీసుకొచ్చి రూ.16వేల కోట్లు ఇరిగేషన్ మీద ఖర్చు పెట్టారు. మిగిలిన నిధులకు ఎందుకు లెక్కలు చూపించడం లేదు. రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలి. చంద్రబాబు తన స్వలాభం కోసం హోదాను తాకట్టు పెట్టారు. దుగరాజుపట్నం పోర్టు నిర్మాణం విభజన చట్టంలో ఉంది. ఒకవేళ పోర్టు ఇవ్వకపోతే రెండు ఎకనమిక్ జోన్స్ ఇవ్వాలని అడుగుతున్నారు. పోర్టుతో పాటు ఎకనమిక్ జోన్స్ అడిగితే బాగుంటుంది. పోర్టు ఇవ్వకపోయినా ఫర్వాలేదని చంద్రబాబు అనడం దారుణం. దుగరాజుపట్నం పోర్టును ఎందుకు తాకట్టు పెడుతున్నారు. ప్రత్యేక హోదా కోరి ప్యాకేజీ కావాలన్నారు. ఇప్పుడు ప్యాకేజీ కింద కూడా ఏం రాలేదంటున్నారు. చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారు." అని బొత్స వ్యాఖ్యానించారు

ఏపీకి కేంద్రం ఏం చేసిందో బాబు చెప్పాలి

సీపీఐ నేత రామకృష్ణ డిమాండ్



విజయవాడ, మేజర్‌న్యూస్: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏమి ఇస్తుందో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు వివరించాలని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏపీపై కేంద్రం చిన్నచూపు చూస్తోందన్న ఆయన పోలవరం ప్రాజెక్ట్‌కు ఇచ్చే నిధులపై స్పష్టత ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక ప్యాకేజీ నిధులు ఎంతవరకూ సాధించారని రామకృష్ణ ప్రశ్నించారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు ఇప్పిస్తామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టేందుకు భవిష్యత్‌లో ఉద్యమాలు చేస్తామన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో మొదలైన ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్

- మూడు రోజులపాటు జరుగనున్న పతంగుల పండగ
- పోటీలో పాల్గొంటున్న పది దేశాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 40 బృందాలు
- అట్టహాసంగా ప్రారంభించిన మంత్రులు మహమూద్ అలీ, చందూలాల్

హైదరాబాద్, మేజర్‌న్యూస్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. శనివారం ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రి చందూలాల్, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. కాగా.. రంగు రంగుల పతంగులు.. రక రకాల ఆకృతులు నింగీ నేలను కలుపుతూ రివ్వున ఎగిరే అంతర్జాతీయ పతంగుల పండుగ ప్రారంభమైంది. శనివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమైన ఈ వేడుక సరికొత్త శోభను తెచ్చిపెట్టింది. దేశ విదేశాల నుంచి వచ్చిన పతంగుల పోటీదారులతో పరేడ్ మైదానమంతా కోలాహలంగా మారింది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరికీ ఆహ్లాదాన్ని పంచుతోంది. భారీ గాలిపటాల సందడితో అంతర్జాతీయ పతంగుల ఉత్సవం వైభంగా కొనసాగుతోంది. పదపదవే వయ్యారి గాలి పటమా అంటూ అలనాటి సినిమాల సందడి మొదలు.. నిన్నటి చంద్రముఖిలో గాలిపటమా పద పద పదా..హంస లాగా పదపద అంటూ సాగిన పాటల్లో గాలిపటం విశిష్టతను తెలిపేవి ఎన్నో ఎన్నెన్నో. తోక ఊపుకొంటూ వయ్యారంగా నింగిని తాకే గాలిపటాల సొగసుచూడాలని ప్రతి ఒక్కరు ఆసక్తి చూపుతుంటారు. అలాంటిది వందలాది గాలి పటాలను ఒక్కచోట చూడటం నిజంగా ఓ అద్భుతమే. మూడు రోజులపాటు సాగే ఈ అద్భుత ఘట్టం మూడు రోజులపాటు జరుగనుంది. అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవాన్ని నిర్వహించటం ఇది మూడో సారి కాగా.. ఈ ఏడాది సింగపూర్, థాయిలాండ్, కొరియా, జపాన్ , చైనా సహా మొత్తం పది దేశాల నుంచి వచ్చిన బృందాలు, భారత్‌లోని వివిధ రాష్ట్రాల నుంచి 40 బృందాలు పాల్గొనటం విశేషం. ఈ నేపథ్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.

ఉద్యోగాల భర్తీ ద్వారనే
సమర్థవంతమైన పాలన

- 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చేవరకు పోరాటమే
- ఉద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం ప్రకటించాలి
- యూనివర్సిటీ-నిరుద్యోగ సంఘాల ఉన్నత స్థాయి సమావేశం హెచ్చరిక



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఖాళీగా ఉన్న మొత్తం ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినపుడే సమర్థులైన యువ అధికారులు ప్రభుత్వ యంత్రాంగంతో చేరి ప్రజల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా చేయగలుగుతారు. యువ అధికారులు ప్రభుత్వ యంత్రాంగంలో చేరినపుడే అవినీతికి-అక్రమాలకు తావులేని ప్రభుత్వాన్ని నడిపించగలుగుతారు. అందుకే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసే వరకు -ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలని-ఇచ్చేవరకు పోరాటం చేయాలని జాతీయ బి.సి సంక్షేమ సంఘం అద్యక్షులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. శనివారం బిసి భవన్ లో రాష్ట్ర నిరుద్యోగ జాక్ అద్వర్యంలో జరిగిన నిరుద్యోగ ఉద్యమపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు, తెలంగాణా జాక్, నిరుద్యోగ సంఘర్షణ సమితి, రాష్ట్ర బి.సి. యువజన సంఘం, నిరుద్యోగ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు. నిరుద్యోగ సమస్యపై గత మూడు సంవత్సరాలుగా జరిగిన ఉద్యమం-భవిష్యత్తులో చేయవలసిన ఉద్యమంపై సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ఇకముందు జరిగే ఉద్యమాలన్నీ జాయింట్ ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు గడిచినా.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా 14 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ఒక లక్షా 12 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించడం కొత్త కాదు. గత ఎన్నికల వాగ్దానం ఇంటికొక ఉద్యోగం ఇచ్చేవరకు మళ్లి ఎన్నికలకు ఏలా వస్తారని నిరుద్యోగులు నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం గత 3 సంవత్సరాల 8 నెలలుగా వివిధ సాకులతో ఉద్యోగాలు భర్తీ చేయకుండా జాప్యం చేశారు.

కొత్తగా 31 జిల్లాలు, 125 మండలాలు ఏర్పాటు చేసి ఒక సంవత్సరం గడిచింది. కొత్త జిల్లాలలో అదనంగా 30 వేల ఉద్యోగాలు వచ్చాయి. ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదు. ప్రభుత్వ ఆఫీసులన్ని ఖాళీ కుర్చీలతో వేల వేల బోతున్నాయని విమర్శించారు. ఈ రెండు లక్షల ఖాళీలు రిటైర్మెంట్ వలన ఏర్పడ్డ ఖాళీలు వీటిని భర్తీ చేయడానికి గల అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర నిరుద్యోగ జాక్ అధ్యక్షులు నీల వెంకటేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ(జాతీయ ఉపాధ్యక్షులు, బి.సి. సంక్షేమ సంఘం), డాక్టర్ ర్యాగ అరుణ్(జాతీయ కో-ఆర్డినేటర్, బి.సి. విద్యార్థి సంఘం), మన్నే వెంకటేష్, జి.రమేష్, సి.రాజేందర్, భిక్షపతి, జి.రామకృష్ణ ముదిరాజ్, సిలిముల అశోక్, గంగనబోయిన రాంబాబు, యం.మహేందర్ గౌడ్, జి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెలకోసారి సమావేశం కండి

- చిన్న పరిశ్రమలను ఆదుకోండి
- కలెక్టర్లకు మంత్రి కేటీఆర్ వినతి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: చిన్న పరిశ్రమలను అదుకునేందుకు ప్రతి నెలకొకసారి జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమావేశం నిర్వహించాలని, ఈ సమావేశంలో చిన్న పరిశ్రమలు ఖాయిలా పడకుండా వాటికున్న సమస్యలను పరిష్కారించాలపి జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, మున్సిపల్, మైనింగ్‌శాఖ మంత్రి కె.తారకరామారావు కోరు. జిల్లా స్థాయిలోనే బ్యాంకర్లతో సమావేశాలు ఎర్పాటు చేయాలని,తద్వారా చెల్లింపుల్లో కొంత అలస్యానికే ఖాయిలా(సిక్) యూనిట్ గా మారకుండా చూడాలన్నారు. ఈ అర్థిక సంత్సరాంతానికి కనీసం రెండుసార్లు ముద్రా లోన్ల మేళాలు నిర్వహించాలని కలెక్టర్లకు మంత్రి అదేశాలు జారీ చేశారు.

ఇటీవల గనుల శాఖపై సమీక్ష నిర్వహించిన మంత్రి, శనివారంనాడు కలెక్టర్లకు పలు అదేశాలు జారీ చేశారు. అక్రమ మైనింగ్, అక్రమ ఇసుక రవాణాపైన కలెక్టర్లు దృష్టి సారించి , కఠినంగా వ్యవహారించాలన్నారు. ప్రభుత్వ విధానాలతో గత దశాబ్దకాలంగా పాత ప్రభుత్వాల్లో వచ్చిన రెవెన్యూ కన్నా అనేక రేట్లు ధనం ప్రభుత్వ ఖజానాకు చేరుతుందని మంత్రి తెలిపారు. ఇదే సమయంలో సాదారణ ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం తాజాగా ఈ సేవ సెంటర్ల ద్వారా ఇసుక బుక్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వానికి అదాయం, ప్రజలకు అందుబాటులో ఇసుక అనే రెండు ప్రధానమైన అంశాల మీద ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇప్పటికే గద్వాల, పెద్దపల్లి, మహబూబ్ నగర్ వంటి జిల్లాల్లో ఇసుక రవాణాలో అయా జిల్లాల కలెక్టర్లు పలు అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టారని, వాటిని ఇతర జిల్లాల కలెక్టర్లు సైతం అమలు చేయాన్నారు. ఇసుక అక్రమ రవాణ అరికట్టేందుకు డిజిపి ప్రత్యేకంగా మరోసారి సమావేశం అవుతారని మంత్రి తెలిపారు. దీంతోపాటు ప్రతి జిల్లాలోని డిస్ట్రిక్ట్ మినరల్ పౌండేషన్ గవర్నింగ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు అదేశాలు జారీ చేశారు. డియంయఫ్ కు అందుబాటులో ఉన్న నిధులను ఖర్చు చేసేందుకు ప్రభుత్వం త్వరలోనే మార్గదర్శకాలను విడుదల చేస్తుందని, ఈ పనుల ద్వారా మైనింగ్ జరిగే ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చున్నారు.

టార్గెట్ రేవంత్ వ్యక్తిగత విమర్శలతో విరుచుకుపడుతున్న టీఆర్ఎస్ నేతలు

- రేవంత్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేలా టీఆర్ఎస్ పథక రచన
- అధికార పార్టీ నేతల విమర్శల్ని తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్న రేవంత్
- రేవంత్‌కు దన్నుగా కాంగ్రెస్ నాయకత్వం నిలిచేనా?





హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభమైన నాటి నుంచి అధికార టీఆర్ఎస్, ప్రధానప్రతిపక్షం కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. విద్యుత్ కొనుగోళ్లు, ఒప్పందాల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందంటూ కాంగ్రెస్ నేత, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తొలుత తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్ విమర్శలపై టీఆర్ఎస్ ఎంపీ బాల్కసుమన్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భానుప్రసాద్‌లు ఘాటుగా స్పందించిన విషయం తెలిసిందే. రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వారు వ్యక్తిగత విమర్శలకు దిగడంతో అసలు విషయం పక్కదారి పట్టినట్లయింది. రేవంత్ విశ్వసనీయతను ప్రశ్నించిన టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగంటూ విరుచుకుపడ్డారు. సుమన్ తరహాలోనే రాష్ట్ర పురపాలక, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ సైతం రేవంత్‌ను టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలే చేశారు. అవినీతి నాయకుడి సవాళ్లకు తాము స్పందించాల్సిన అవసరం లేదన్న ఆయన , జైల్లో చిప్పకూడు తిన్నవారి ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం అంతకన్నా లేదంటూ కొట్టిపారేశారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ విజయవంతమవడంతో కాంగ్రెస్ నేతల కడుపుమండుతోందని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ స్థిరపడితే ఎప్పటికీ అధికారంలోకి రాలేమన్న భయం కాంగ్రెస్ నాయకులకు పట్టుకుందని, ఈ నేపథ్యంలోనే ఆ పార్టీ నేతలు ఇష్టారీతిన ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. కరెంట్ కొనుగోలు ఆరోపణలపై ఆధారాలుంటే కోర్టుకు వెళ్లొచ్చని మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ నేతలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వంపై రేవంత్‌రెడ్డి పలు ఆరోపణల్ని సుమన్ మరోమారు తిప్పికొట్టే ప్రయత్నాన్ని చేశారు. అమరవీరు ల స్థూపం సాక్షిగా అబద్ధాలు చెప్పి వారి త్యాగాలను కించ పరచారని సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం రెండు కన్నా ఎక్కువ విద్యుత్ ఒప్పందాలు కుదుర్చుకుంటే రేవంత్ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. బీహెచ్‌ఈఎల్ ఝార్ఖండ్‌లో నిర్మిస్తున్న విద్యుత్ ప్రాజెక్టు వ్యయం కంటే రాష్ట్ర ప్రాజెక్టులను తక్కువ ఖర్చుతో నిర్మిస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వం తక్కువ ధరకు విద్యుత్ ఇస్తామని తెలంగాణకు లేఖ రాసిందని రేవంత్ చెబుతున్నదంతా అబద్ధమన్నారు. విభజన చట్టంతో తెలంగాణకు 53 శాతం విద్యుత్ వాటా దక్కడం కాంగ్రెస్ గొప్పతనం కాదని, 2008లోనే విద్యుత్ కేటాయింపు లు జరిగాయన్న సంగతి రేవంత్ గుర్తుంచుకోవాలన్నారు.

రేవంత్ చెప్పినవన్నీ అబద్ధాలని డాక్యుమెంట్లతో సహా నిరూపించామని, ఆయన తన వాదనను నిరూపించే ఒక్క డాక్యుమెంట్ కూడా చూపెట్టలేదన్నారు. ఛత్తీస్‌గడ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నందుకు బీజేపీ ఎంత కమీషన్ ఇచ్చిందో రేవంత్ చెప్పాలని, కాంగ్రెస్ నేత సుబ్బరామిరెడ్డికి చెందిన సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నందుకు ఎంతిచ్చారో ఆయనతో చెప్పించాలని సవాలు చేశారు. 24గంటల కరెంట్ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్‌రెడ్డి బఫూన్‌లా ముందుకొచ్చారని విమర్శించారు. అయితే విద్యుత్ ప్రాజెక్టు ఒప్పందాలు, కొనుగోళ్లలో చోటు చేసుకున్న అవినీతిపై సీబీఐ లేదా సీవీసీ విచారణ జరిపించాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చశారు. విద్యుత్ ప్రాజెక్టు టెండర్ల కాంట్రాక్టుల్లో ముఖ్యంత్రి కేసీఆర్‌కు భారీగా ముడుపులు ముట్టాయని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని తాను నిరూపించకపోతే హైదరాబాద్ అబిడ్స్ చౌరాస్తాలో ముక్కు నేలకు రాస్తానని రేవంత్ మరోసారి సవాల్ విసిరారు. అయితే రేవంత్ ఎన్ని ఆరోపణలు, విమర్శలు చేస్తున్న అధికారపార్టీ నేతలు మాత్రం ఆయన్ని వ్యక్తిగతంగా టార్గెట్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గతంలో విద్యుత్‌పై అసెంబ్లీ వేదికగా తన వాదనలు వినిపించే క్రమంలో తప్పుడు డ్యాక్‌మెంట్లతో సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని, ఓటుకు నోటు కేసులో దొరికిపోయాన వ్యక్తంటూ, విశ్వసనీయతలేని నాయకుడని ప్రచారం చేయడం ద్వారా ఆత్మరక్షణలోకి నెట్టే ప్రయత్నాన్ని చేస్తున్నారు. అధికారపార్టీ నేతలు చేస్తున్న వ్యక్తిగత విమర్శలను అంతేస్థాయిలో తిప్పికొట్టేందుకు రేవంత్ చేస్తున్న ప్రయత్నాలకు కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం ఎంతవరకూ దన్నుగా నిలుస్తుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సూర్య
హైదరాబాద్
ఆదివారం
14 జనవరి 2018
4

సంపాదకీయం

editpage@suryaa.com

“ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఐక్యరాజ్యసమితిలో క్షమాపణలు చెప్పాలని ఆఫ్రికన్ దేశాలు ఏకగ్రీవంగా డిమాండు చేశాయి. శుక్రవారం ట్రంప్ హైతీ, ఆఫ్రికా వంటి చెత్తదేశాల నుండి వచ్చే ఇమ్మిగ్రేషన్స్ అమెరికాకు అవసరంలేదని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేప ,థ్యంలో ఆఫ్రికన్ దేశాలకు చెందిన యుఎన్ రాయబారి అమెరికా సంయుక్త రాష్ట్రా ల అధ్యక్షుడు ట్రంప్ చేసిన జాత్యాంహంకార, జెనోఫోబిక్ వ్యాఖ్యలను మీడియా నివేదించిందని, వాటిని ఖండిస్తున్నామని, ఐక్యరాజ్యసమితి సాక్షిగా ట్రంప్ క్షమాపణలు చెప్పాలని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై 54 ఆఫ్రికన్ దేశాలు అత్యవసర సమావేశం నిర్వహించిన అనంతరం వారు ఆఫ్రికన్ దేశాలపై, జాతివివక్ష వ్యాఖ్యలు సరికావని, ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన వారికి కృతజ్ఞతలు కూడా తెలిపారు. సుమారు నాలుగు గంటల చర్చ అనంతరం సమావేశం ఏకగ్రీవంగా ముగిసినట్లు తెలుస్తుంది. హైతీ, ఆఫ్రికాలాంటి దేశాల వాళ్లను అసలు అమెరికాలో ఎందుకు అడుగు పెట్టనివ్వాలి అంటూ ట్రంప్ ప్రశ్నించారు. ఈ సం దర్భంగా ఆయన వాటిని 'షిట్‌హోల్ కంట్రీస్' అంటూ వ్యాఖ్యానించడం దుమా రా నికి కారణమైంది. అధ్యక్షుడు ఇలాంటి భాష వాడటం నీచమైనద ని మరో రిపబ్లికన్ ప్రతినిధి ఇలియానా రోస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రంప్ వ్యాఖ్యలు జాతి వివక్షే అవుతాయని డెమొక్ర టిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతాల్ విమర్శించారు. అయితే వీళ్ల విమర్శలను శ్వేతసౌధం తిప్పి కొట్టిం ది. వీళ్లంతా బయటి దేశాల వ్యక్తుల గురించి ఆలోచిస్తుంటే.. అధ్యక్షుడు ట్రంప్ మాత్రం కేవలం అమెరికా ప్రజల గురించి మాత్రమే ఆలోచిస్తున్నారని శ్వేతసౌధం ప్రతినిధి రాజ్ షా అన్నారు. ”

ట్రంప్ క్షమాపణలు చెప్పాల్సిందే

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఐక్యరాజ్యసమితిలో క్షమాపణలు చెప్పాలని ఆఫ్రికన్ దేశాలు ఏకగ్రీవంగా డిమాండు చేశాయి. శుక్రవారం ట్రంప్ హైతీ, ఆఫ్రికా వంటి చెత్తదేశాల నుండి వచ్చే ఇమ్మిగ్రేషన్స్ అమెరికాకు అవసరంలేదని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేప ,ద్యంలో ఆఫ్రికన్ దేశాలకు చెందిన యుఎన్ రాయబారి అమెరికా సంయుక్త రాష్ట్రా ల అధ్యక్షుడు ట్రంప్ చేసిన జాత్యాంహంకార, జెనోఫోబిక్ వ్యాఖ్యలను మీడియా నివేదించిందని, వాటిని ఖండిస్తున్నామని, ఐక్యరాజ్యసమితి సాక్షిగా ట్రంప్ క్షమాపణలు చెప్పాలని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై 54 ఆఫ్రికన్ దేశాలు అత్యవసర సమావేశం నిర్వహించిన అనంతరం వారు ఆఫ్రికన్ దేశాలపై, జాతివివక్ష వ్యాఖ్యలు సరికావని, ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన వారికి కృతజ్ఞతలు కూడా తెలిపారు. సుమారు నాలుగు గంటల చర్చ అనంతరం సమావేశం ఏకగ్రీవంగా ముగిసినట్లు తెలుస్తుంది. హైతీ, ఆఫ్రికాలాంటి దేశాల వాళ్లను అసలు అమెరికాలో ఎందుకు అడుగు పెట్టనివ్వాలి అంటూ ట్రంప్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన వాటిని 'షిట్‌హోల్ కంట్రీస్' అంటూ వ్యాఖ్యానించడం దుమా రానికి కారణమైంది. శ్వేతసౌధంలో డెమొక్రటిక్ పార్టీ సెనేటర్ డిక్ డర్బిన్, రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం కొత్తగా రూపొందించిన ఇమ్మిగ్రేషన్ విధానంపై వివరిస్తున్న సమయంలో ట్రంప్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఆఫ్రికా ప్రజలందరికీ ఇక్కడ ఆశ్రయం కల్పించడం ఎందుకు? అవి షిట్‌హోల్ కంట్రీస్. నార్వేలాంటి దేశాల నుంచి ఎక్కువ మంది రావాలి అని ట్రంప్ అన్నారు. హైతీ నుంచి కూడా వలసదారుల రావడాన్ని ట్రంప్ ప్రశ్నించారు. నైపుణ్యం లేని ఇలాంటి వాళ్లను అనుమతివ్వడం కంటే.. మంచి నైపుణ్యం ఉన్న దేశాల నుంచి నిపుణులకు అనుమతివ్వడం మేలు అని ట్రంప్ అభిప్రాయపడ్డారు. అయితే ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై సొంత పార్టీ చట్ట ప్రతినిధులతోపాటు డెమొక్రటిక్ పార్టీకి చెందినవాళ్లు సైతం తీవ్రంగా మండిపడ్డారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన ప్రతినిధి మియా లవ్ దీనిపై స్పందిస్తూ, ఈ వ్యాఖ్యలు చాలా దయలేనివిగా, సమాజాన్ని విభజించేవిగా ఉన్నాయని, మన దేశ విలువలకు ఇవి విరుద్ధమని అన్నారు. మియా లవ్ హైతీ నుంచి అమెరికాకు వలస వచ్చిన కుటుంబానికి చెందిన వ్యక్తి. ఈ వ్యాఖ్యలపై ఆయన క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు ఇలాంటి భాష వాడటం నీచమైనద ని మరో రిపబ్లికన్ ప్రతినిధి ఇలియానా రోస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈమె క్యూబానుంచి అమెరికావలస వచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలు జాతి వివక్షే అవుతాయని డెమొక్ర టిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతాల్ విమర్శించారు. అయితే వీళ్ల విమర్శలను శ్వేతసౌధం తిప్పి కొట్టిం ది. వీళ్లంతా బయటి దేశాల వ్యక్తుల గురించి ఆలోచిస్తుంటే.. అధ్యక్షుడు ట్రంప్ మాత్రం కేవలం అమెరికా ప్రజల గురించి మాత్రమే ఆలోచిస్తున్నారని శ్వేతసౌధం ప్రతినిధి రాజ్ షా అన్నారు. ఇదిలావుండగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూకే పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలుస్తుంది. వచ్చే నెలలో అధ్యక్షుడు ట్రంప్ లండన్‌లో నూతన ఎంబసీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించ డానికి వెళ్ళాల్సి ఉండగా, ఇప్పుడు ఆ పర్యటన రద్దు అయినట్లు సమాచారం. ట్రంప్ లండన్ వస్తే పెద్ద ఎత్తున నిరసన చేపట్టేందుకు ఆయన వ్యతిరేకులు సన్నా హాలు చేస్తున్నారని తెలుస్తోంది. బ్రిటీష్ గ్రూప్స్‌కు సంబంధించిన ఫార్-రైట్ పై ట్రంప్ రీట్వీట్ చేయడంతో వాటిని తొలగించమని లండన్ చట్టసభ సభ్యులు డిమాండు చేశారు. అలాగే గతేడాది లండన్ మేయర్ సాదిక్ ఖాన్‌పై ఉగ్రవాదుల దాడిని విమర్శించారు. దీంతో భయపడి లండన్ పర్యటనను రద్దు చేసుకున్నారని అంటున్నారు. అయితే మరోపక్క ట్రంప్ మాత్రం ఒబామా లండన్ ఎంబసీని పల్లీలకు అమ్మేశారని, ఇది చాలా చెత్త డీల్ అంటూ ఆయన ట్వీట్ చేశారు. ఒబామా ప్రభుత్వం సెంట్రల్ లండన్‌లో ఉన్న అమెరికా ఎంబసీ కార్యాలయాన్ని దూరంగా వేరే చోటుకు తరలించడంపై ఈ సందర్భంగా ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒబామా హయాంలో ఎంబసీని లండన్‌లోని గ్రోస్‌వెనార్ స్క్వేర్ నుంచి థేమ్స్ నది తీరంలోని నైన్ ఎల్మ్ ప్రాంతానికి తరలించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లండన్ పర్యటన రద్దు చేసుకోవడానికి కారణం.. లండన్‌లో మంచి ప్రాంతంలో ఉన్న ఎంబసీని పల్లీలకు అమ్మేసిన ఒబామా అడ్మినిస్ట్రేషన్‌కు నేనే మీ అభిమానిని కాదు, దూర ప్రాంతంలో భవనం కట్టడానికి కేవలం 1.2 బిలియన్ డాలర్లకు అమ్మేశారు. చెత్త డీల్. నన్ను వచ్చి రిబ్బన్ కట్ చేయమన్నారు..నో అని ట్రంప్ ట్వీట్ చేశారు. లండన్‌లో జనవరి 16న కొత్త కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి యూఎస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ రెక్స్ టిల్లర్‌సన్ వెళ్లనున్నారు. లండన్ పర్యటనలో ట్రంప్ బ్రిటన్ ప్రధాని థెరిసా మేతో కూడా సమావేశం కావాల్సి ఉంది.కాగా, ఆయన పర్యటన రద్దు చేసుకోవడంతో ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం పడే అవకాశం ఉందని కొందరు అభిప్రాయ పడ్డారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శృంగార లీలల్లోని మరో అంకం గురించి వాల్ స్ట్రీట్ జర్నల్ ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలోని అంశం అంటూ.. తాజాగా ఆ పత్రిక ట్రంప్‌పై ఈ కథనాన్ని ప్రచురించింది. దీని సారాంశం ఏమిటంటే.. ఒక పోర్న్ స్టార్‌తో ట్రంప్‌కు అక్రమసంబంధం ఉండేదని... ఆమెతో లైంగిక సంబంధాన్ని నెరిపిన ట్రంప్ ఆ విషయాన్ని వెలుగులోకి రాకుండా చూసుకునేందుకు భారీ మొత్తంలో డబ్బు ఇచ్చి సెటిల్ చేసుకున్నాడు అని. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ ఈ వ్యవహారాన్ని సెటిల్ చేసుకున్నాడని.. దీనికి గానూ ట్రంప్ లక్షా ముప్పై వేల డాలర్ల మొత్తాన్ని సదరు పోర్న్ స్టార్‌కు ముట్టజెప్పాడని వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ఆ పోర్న్ స్టార్ పేరు స్టీఫానీ క్లిఫోర్డ్. 2006 సమయంలో ట్రంప్ ఆమెతో అక్రమ సంబంధాన్ని పెట్టుకున్నాడు. అదే సమయంలో మూడో పెళ్లి చేసుకున్న ట్రంప్ పోర్న్ స్టార్‌తో కూడా సంబంధాన్ని కొనసాగించాడు. ఆ తర్వాత ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో సదరు పోర్న్ స్టార్ నోరు విప్పుతుందని ట్రంప్ భయపడ్డాడు. దీంతో ఆమె నోరు మూయించడానికి 82 లక్షల రూపాయల మొత్తాన్ని ఇచ్చాడు. ఈ వ్యవహారంలో ఒక లాయర్ మధ్యవర్తిత్వం వహించాడని ఆ పత్రిక పేర్కొంది. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం చాలా బాగుందని ఉందని ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైట్‌హౌజ్ డాక్టర్ రోనీ జాక్సన్ స్పష్టం చేశారు. అధ్యక్షుడిగా ట్రంప్ ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో డాక్టర్ రోనీ జాక్సన్ నేతృత్వంలో కొన్ని గంటల పాటు ఈ పరీక్షలు జరిగాయి. బీపీ, కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్, గుండె స్పందన, బరువు వంటి పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం డాక్టర్ రోనీ జాక్సన్ డొనాల్డ్ ట్రంప్ చక్కగా ఆరోగ్యంగా ఉన్నారని రోనీ స్పష్టం చేశారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని అన్నారు. ట్రంప్ ఆరోగ్యస్థితిపై పూర్తి నివేదికను జనవరి 16న మీడియాకు వెల్లడించనున్నారు. గత మూడు ప్రభుత్వాల సమయంలోనూ డాక్టర్ రోనీనే అధ్యక్షుడికి ఫిజీషియన్‌గా ఉన్నారు. సాధారణంగా ప్రతి అధ్యక్షుడికి రొటీన్ హెల్త్ పరీక్షలు నిర్వహిస్తుంటారు.

దేశం, కమలాల మధ్య 'మాణిక్య' చిచ్చు

ఎం. రామ్ గోపాల్-సెంట్రల్ డస్క్,
హైదరాబాద్ 9032340123

- తగిన ప్రాధాన్యం ఇవ్వటం లేదంటున్న బిజెపి
- అన్నింటా అవమానాలు జరుగుతున్నాయన్న మంత్రి
- దేశం స్నేహానికి గుడ్‌బై చెప్పాలంటూ అధిష్ఠానం దృష్టికి
- అభివృద్ధిలో పోటీ పడాలి తప్ప ఈ లొల్లేమిటన్న దేశం
- ఇదే కొనసాగితే రాష్ట్రాన్ని కట్ చేస్తానన్న మాణిక్యం



అవకాశం వచ్చినప్పుడల్లా టీడీపీ సర్కారుపై విరుచుకుపడుతున్న సోము వీర్రాజు ఇటీవల కాలంతో తన స్పీడ్ మరింత పెంచుతున్నారంటే ఆతనికి కేంద్ర నాయకత్వం నుంచి పెద్ద ఎత్తున మద్దతు ఉండనే ఉందన్న వాదనలు తాజాగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆయన ఏ జిల్లాకు వెళ్లినా ప్రభుత్వం అవినీతినే ఎత్తిచూపుతున్నారు. పోలవరం, అమరావతిల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాల మీదే మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతుండటంతో విపక్ష జగన్‌కి అసరాగా ఉన్నట్లుందన్నది తెలుగుదేశం వర్గాలు లోలోన బాధ పడుతున్నాయి. చంద్రబాబు రాజధాని నిర్మాణం కోసం కృషి చేస్తున్నారంటూనే చురకలంటేలా అవినీతి మరకలు విసరటంపైనే గుర్రు గా ఉన్నారంతా, జిల్లా, మండల స్థాయిలో అడుగడుగునా తమకు అవ మానం జరుగుతోందని రగిలిపోతున్న బీజేపీ నేతలను.. కేంద్రంపై టీడీపీ చేస్తున్న ప్రచారం మరింతగా రెచ్చగొట్టింది. పోలవరంతో పాటు పలు ప్రాజెక్టుల విషయంలో కేంద్రం.. రాష్ట్రానికి నిధులివ్వడం లేదని, ప్రధాని మోదీ కక్షసాధిస్తున్నారని దేశం ఎంపీలు, ఎమ్మెల్యేలు బహిరంగంగానే విమర్శలకు దిగడంతో పరిస్థితులు మరింత దిగజారాయి. సోము వీర్రాజుపై టీడీపీ ఎమ్మెల్సీ వైబీ రాజేంద్రప్రసాద్ చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినా, మంత్రి మాణిక్యాలరావుపై సవాళ్లు విసురుతున్న పశ్చిమ గోదావరి జిల్లా దేశం నేతలకు క్లాస్ తీసుకొన్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు. బిజెపి నేతలపై ఎలాంటి విమర్శలు చేయవద్దంటూ అధినేత చంద్రబాబు ఆదేశాలలో కొంత సంయమనం పాటిస్తున్నా అడపా దడపా ఇరు పార్టీల మధ్య విభేదాలు భగ్గమంటునే ఉన్నాయి.

అయితే వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా రాజ్యాంగ పదవిలోకి వెళ్లిపోగానే మిత్రపక్షమైన తమకు దక్కాల్సిన గౌరవం ఏమాత్రం దక్కడం లేదంటున్న బీజేపీ నేతల జాబితా రోజు రోజుకూ పెరుగుతోంది. ఇటీవల కాలంలో సౌమ్యుడుగా ఉన్న మంత్రి మాణిక్యాల రావు విషయంలోనూ ఇది ఒక్కసారిగా కట్టలు తెంచుకొంది. ఇంతకుముందు నేతల ఆగ్రహావేశాలకు ఆయన కాస్త కళ్లెం వేసేవారు. ఇప్పుడు ఆపేవారు లేకపోవడంతో ఫిర్యాదులు, ఆరోపణల జోరు పెరిగింది. జన్మభూమి కమిటీల్లో బీజేపీ తరఫున కూడా ఒకరిని నియమించాలనే డిమాండును తెలుగుదేశం పట్టించుకోలేదన్న వాదనలని తెరపైకి తీసుకువచ్చింది బిజెపి. దీంతో రాష్ట్రంలో పలుచోట్ల జన్మభూమి సభల్లో బీజేపీ కార్యకర్తలు సైతం ప్రభుత్వాన్ని నిలదీశారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణంలో వందల కోట్ల అవినీతి జరిగిందంటూ నెల్లూరు, ప్రకాశం జిల్లాల బీజేపీ నేతలు బహిరంగ విమర్శలకు దిగడం అరెస్టుల వరకూ వెళ్లింది. తెలుగుదేశం ప్రభుత్వంలో మిత్ర పక్షానికి చెందిన బీజేపీ నేతలను అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. చివరికి ఈ ఆరెస్టులు నువ్వా నేనా అనేంత వరకు వెళ్లింది.

రాష్ట్రంలో బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలున్నారు. బీజేఎల్పీ నేత, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు నియోజకవర్గంలో మినహా మిగిలిన మూడు చోట్ల టీడీపీ ఇన్‌చార్జిలను నియమించి నియోజకవర్గాల్లో సమాంతర పాలన నడుపుతోంది. దీన్ని గట్టిగా ప్రతిఘటించడంతో మంత్రి మాణిక్యాల రావు టార్గెట్ అవుతున్నారు. మరో మంత్రి కామినేని శ్రీనివాస్ బీజేపీ కంటే టీడీపీకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో ఆయనకు ఎటువంటి సమస్యలు ఎదురు కావడం లేదన్నది వాస్తవం.

గత కొంత కాలంగా దేవాదాయ మంత్రి మాణిక్యాల రావుపై ముఖ్యమంత్రి అసహనంగా ఉన్నారన్న వార్తలు వచ్చాయి. దీనికి తోడు విజయవాడ కనకదుర్గ దేవాలయంలో అర్ధరాత్రి వేళలలో జరిగిన పూజల తతంగం రాష్ట్రప్రభుత్వంకి కొత్త తలనొప్పులు తెచ్చి పెట్టింది. దీనికి తోడు గజల్ శ్రీనివాస్‌పై లైంగిక వేధింపుల వ్యవహారంలో ఆతనికి మద్దతుగా మాట్లాడి మాణిక్యాలరావు అనేక విమర్శలకు గురయ్యారు. ఈ క్రమంలో ఆయన తన తప్పు సరిదిద్దుకున్నట్లు ప్రకటించుకున్నా సామాజిక మీడియాలో మాత్రం ఆయన వ్యవహారం మాత్రం తలనొప్పిగానే మారింది. అయితే ఇటీవల జరిగిన జన్మభూమి సభలో మాట్లాడిన మంత్రి ఈ మూడున్నరేళ్లలో ఏ ప్రారంభోత్సవానికైనా నన్ను పిలిచారా? ఎందుకింత శతృత్వ ధోరణి? నేనేమైనా వైసీపీ నుంచి వచ్చానా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. నియోజకవర్గంలో తనను అంటరాని వాడుగా చుస్తున్నారని, అదే పరిస్థితి ఇంకా కొనసాగితే ప్రభుత్వాన్నే నిలదీస్తా నని, నియోజక వర్గంలో తనను కట్ చేయాలని చూస్తే రాష్ట్రాన్నే కట్ చేస్తానని తీవ్రంగా హెచ్చరించడం చూస్తుంటే ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని బహిరం గంగానే వెల్లడించినట్లు కనిపిస్తోంది.

నేను శత్రువునా.. ఈ రాష్ట్రంలో నిరంతరం ప్రతి క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి పక్కన కూర్చునే వ్యక్తిని. కేంద్రంలో, రాష్ట్రంలో కలిసి పనిచేస్తున్నాం.. ఇదా నాకు ఎదురయ్యేది.. అంటూ మాణిక్యాల రావు మండిపడ్డారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని కూడా కేంద్రం నిధులతోనే చేస్తున్నారని ఆయన అన్నారు.పక్కనే మహిళా తహసీల్దార్, సభలో మహిళలు ఉన్నారని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో మంత్రి రెచ్చిపోయారు. జెడ్పీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. నన్ను నిలదీసే పరిస్థితి వస్తే.. మగాడిగా రెచ్చిపోతా అంటూ ధ్వజమెత్తారు.

ఈ క్రమంలోనే రెండు పార్టీల మధ్య అంతరం కొనసాగుతోంది. అయితే మంత్రి మాణిక్యాలరావు అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేయడం ప్రాధాన్యతను సంతరించుకొంది. అయితే ఈ రెండు పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. మాణిక్యాలరావు గెలుపు కోసం కృషి చేసిన టిడిపి కార్యకర్తలను మంత్రి మాణిక్యాలరావు దూరం పెట్టారని జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్ళ పూడి బాపిరాజు విమర్శలు గుప్పించడంతో ఈ అసంతృప్తి పరాకాష్టకు చేరింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో టిడిపి, బిజెపి నేతల మధ్య దూరం పెరుగుతోంది. టిడిపి, బిజెపి నేతల మధ్య దూరం పెరుగుతోంది. అంతేకాదు వైసీపీ నేతలకు ప్రాధాన్యతను ఇస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రాన్ని కట్ చేస్తా అంటూ మంత్రి దేశం శ్రేణుల ఆగ్రహానికి కారణమైంది. మంత్రిగారు నోరు జారడం, తరువాత వెనక్కి తీసుకోవడం మాణిక్యాలరావుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శలు ఎదుర్కొనాల్సి వస్తోందాయన.

నిజానికి 2014 ఎన్నికల్లో బాపిరాజుకు తాడేపల్లి గూడెం స్థానంలో టిక్కెట్టు దక్కలేదు. అంతేకాదు ఎన్నికల సమయంలోనే మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ కూడ కాంగ్రెస్ నుండి టిడిపిలో చేరారు. బిజెపికి ఈ సీటును కేటాయించడంతో బాపిరాజుకు జడ్పీ చైర్మెన్ పదవి దక్కింది.అయితే వచ్చే ఎన్నికల కోసం బాపిరాజు ప్లాన్ చేసుకొంటున్నారని ఆయన వర్గీయులు చెబుతున్నారు. దీంతోనే రెండు పార్టీల మధ్య వివాదాలు సాగుతున్నాయన్నది ఇరు పార్టీల నేతలు వాపోతున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఏపీలో జరిగే ఎన్నికలలో 50-60 మంది సిట్టింగ్‌లను పక్కన పెట్టేస్తామ్మి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో మిత్ర పక్షం నుంచి ఈ సీటు తీసుకోవాలన్న డిమాండ్ బాబు ముందుకు తీసుకువెళ్లేందుకు తెలుగుదేశం నేతలంతా సిద్ధమయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో తెలుగుదేశం, కమలనాధుల మధ్య రేగిన చిచ్చుకు ఆజ్యం పోసేందుకు మరికొందరు బిజెపి నేతలు సిద్ధమవుతున్నారని తెలియవస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల ప్రధానిని ముఖ్యమంత్రి కలిసిన విషయంపైనా సొంత బాణీలో బిజెపిలు విమర్శలకు సిద్ధమవతుండటం ఇరు పార్టీల పయనం ఎలా? ఉండబోతోందన్నది చూడాలి. ●

నిధుల లేమితో ఉన్నత విద్య కకలా వికలం



మోటె చిరంజీవి, సెల్ : 9949194327

- అవసరాలకు అనుగుణంగా కోర్సులు ఉండాలి
- విద్యా విధానాన్ని భ్రష్టు పట్టిస్తున్న ప్రయివేటు సంస్థలు
- విద్యావసరాలకు తగిన నిధులు ఇవ్వని యుజిసి
- దాని చూపు ఎప్పుడూ కేంద్రీయ విద్యాలయాలపైనే
- రాష్ట్రాల విద్యాలయాలకు నిధుల అరకొరే ఎప్పుడూ



దేశంలో ఉన్నత విద్యారంగాన్ని కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుంది. దీనికి తోడుగా జాతీయ విద్యావిధానం ప్రకటించడంతో పాటు ఉన్నత విద్యా సంస్థలకు ఆర్థిక సహకారం అందించేలా 'హెఫా'ను ఏర్పాటు చేసింది. విశ్వ విద్యాలయ నిధుల సంఘం ద్వారా విడుదల కావలసిన ప్రణాళిక సంబంధ నిధుల విషయంలో నిరాశ కలిగిస్తుంది. ఉన్నత విద్యారంగాన్ని ఆర్థికంగా శక్తివంతం చేసే కృషిలో భాగంగా 1952లోనే కేంద్రం ఓ సంస్థను ప్రారంభించదలచింది. అందుకు అనుగుణంగా 1953 డిసెంబర్ 28న విశ్వవిద్యాలయ నిధుల సంఘం స్థాపితం అయినది. దానికి 1956 లో చట్టభద్రత కల్పించారు. నిధుల పంపిణీ ఒక్కటే కాకుండా ఉన్నత విద్యాప్రమాణాల పరిరక్షణ బాధ్యతను ఈ సంస్థకు అప్పగించారు. అప్పటి నుండి కొన్ని విశ్వవిద్యాలయాలతో పాటు డీమ్డ్ విద్యాసంస్థలకు కళాశాలలకు నిధులు సమకూరుస్తుంది. నిధులను ఉన్నత విద్యాసంస్థలకు అందజేయడానికి వీలుగా ప్రతి ప్రణాళికా కాలానికి కొన్ని నిపుణుల సంఘాలను నియమిస్తున్నారు.

సంస్థల ఆర్థిక అవస రాలను గుర్తించి వాటి సామర్థ్యాన్ని బట్టి నిధులను నిర్ణయిస్తాయి. ఎక్కువ ఆదా యం సమకూరే సంస్థలకు తక్కువ నిధులను తక్కువ ఆదాయం సమకూర్చే సంస్థలకు ఎక్కువ నిధులను అందజేయడానికి అంతరనిధి విధానాన్ని అనుసరి స్తున్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కోర్సుల రూపకల్పన జరగాల నేది విశ్వ విద్యాలయం నిధుల సంఘం అభిమతం. వాటిని ఆయా సంస్థలలో స్వయం ఆర్థికత పద్ధతిన ప్రారంభించాలని అది సూచిస్తుంది. అటువంటి వాటి కి యుజిసి నుండి ఆర్థిక సహాయం అందదు. ఎయిడెడ్ కళాశాలలకు, ఎయిడెడ్ విశ్వవిద్యాలయాలకు, వాటిలో ప్రారంభించిన ఎయిడ్డ్ కోర్సులకు యుజిసి నిధులు అందుతాయి. నిజానికి అనేక రాష్ట్రాలలో ఉన్నత విద్య వ్యవస్థ అంతా ప్రైవేటు రంగం చేతుల్లో ఉంది. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయడం అనే ప్రక్రి య గతంలోనే ఆగిపోయింది. దాదాపు మూడు దశాబ్దాలుగా రాష్ట్రాలలో ఎయి డెడ్ ఊసే లేదు.

విద్యారంగ అవసరాలతో పోలిస్తే యుజిసి మంజూరు చేసే నిధుల పరిమాణం అత్యల్పం.సమాచారం ప్రకారం దేశం మొత్తం మీద 759 విశ్వవిద్యాలయాలు, 37000 కళాశాలలు ఉన్నాయి. ప్రణాళిక నిధులు నాలుగు సంవత్సరాలకే పరిమితమయ్యాయి. వినిసం మంజూరు చేసిన మొత్తంలో అగ్రభాగం కేంద్రీయ విశ్వ విద్యాలయాలకు దక్కింది. దేశంలో ఉన్న 40 కొత్త వాటితో కలిపి కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు రూ. 6406 కోట్లు (అంటే 85 శాతం) మంజూరు చేశారు. మిగిలిన మొత్తంలో రూ. 911 కోట్లు (కేవలం 12.1 శాతం) రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు లభించాయి. అలాగే రూ. 186 కోట్లు ఇతర ఉన్నత విద్యాసంస్థలకు ఇచ్చారు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు స్థాపించిన 350 పై చిలుకు విశ్వవిద్యాలయాలకు గాను, వినిసం నిధులు పొందడానికి అర్హత సాధించినవి కేవలం 159, దాదావు 50 శాతంపైగా రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు వినిసం వల్ల ఉపయోగం కలగలేదు. నూతనంగా ప్రారంభించిన కొన్ని రాష్ట్ర స్థాయి విశ్వ విద్యాలయాలకు 11వ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఏకకాల గ్రాంటుగా రూ. 5 కోట్ల వరకు మంజూరు చేశారు. అది మినహా నూతన విశ్వవిద్యాలయాలకు సంఘం నిధులు పొందే అర్హత లేదు. ఉమ్మడి రాష్ట్రంలోనూ 2008 తరువాత ప్రారంభమైన అయిదు నూతన విశ్వవిద్యాలయాలు ఇంతవరకు ఆ అర్హత సాధించలేకపోయాయి.

కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల మధ్య నిధుల విషయంలో విచక్షణ కనిపిస్తోంది. వినిసం గణాంక వివరాల ప్రకారమే 40 కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో మొత్తం 28 వరకు సంస్థలు రూ. వందకోట్ల కంటే ఎక్కువగా నిధులు పొందుతున్నాయి. మొత్తంగా చూస్తే ఈ సంస్థలు రూ. 5,574 కోట్లు పొందగా, ఇందిరా గాంధీ గిరిజన విశ్వవిద్యాలయం వర్గంలో జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయానికి దక్కింది కేవలం రూ. 35 కోట్లు, రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాల్లో రూ. 20 కోట్లు, ఆపైన నిధులు మంజూరైన సంస్థలు పదమూడే దీనిని బట్టి రెండు రకాల విద్యాసంస్థల మధ్యన అంతరం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితిలో గుణాత్మకమైన మార్పు రాకపోతే ఉన్నత విద్యారగంగంలో ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా, అవి సత్ఫలితాన్నిచే అవకాశమే లేదు. నిపుణుల సంఘాల ఏర్పాటు అసలే లేదు. నిజానికి ఈ సంఘాలే విద్యాసంస్థల అవసరాల్ని మదింపుచేసి వినిసంకు సూచనలిస్తాయి. ఈ ప్రక్రియ మొత్తాన్ని రద్దు చేశారు. ఆపై విశ్వవిద్యాలయాలన్నింటికి పన్నెండో ప్రణాళిక కాలానికి నిధుల మంజూరులో ఒక అడుగు ముందుకు పడింది.

పలు రాష్ట్రా స్థాయి విశ్వవిద్యాలయాలు తమకు మంజూరైన మొత్తంలో కనీసం సగమైనా పొందలేకపోయాయి. అసలే మంజూరయ్యే మొత్తం తక్కువ. కొన్ని విశ్వవిద్యాలయాలైతే ఆ నిధులను ఖర్చు పెట్టకపోవడం విడ్డూరంగా 12వ పంచవర్ష ప్రణాళిక (201217) కింద తెలగాణలోని ఏడు రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు రూ. 95.90 కోట్లు కేటాయించినప్పటికి, ఆ నిధుల వినియోగంలో అవి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. (తాజాగా వచ్చిన) వార్తే ఇందుకు నిదర్శనం. వినిసం కేటాయించిన నిధుల్లో నాటికి అందింది సగమే. ఈ విశ్వవిద్యాలయాలు ఎనిమిది నెలల కాలంలో అందులో సగాన్నే ఖర్చు చేశాయి. విరసం నిధులు, బాధ్యతలకు సంబంధించినది నిధుల విడుదల అనేది ఆ సంఘ బాద్యతలో ఒకటి. ఉన్నత విద్యారంగంలో ప్రమాణాలు నెలకొల్పడానికి వాటిని స్థిరీకరించడానికి, మెరుగుపరచడానికి సంఘమే కృషి చేయాలి. అందుకు అనుగుణంగా చట్టపరంగా కొన్ని అధికారాలను సంఘానికి దాఖలు పరిచారు. ఈ విషయంలో విలీనం పనితీరు ఏమ్రాం ఆశాజనకంగా లేదు. దేవంలోని విద్యాసంస్థల్లో ఉన్నతస్థాయి ప్రమాణాలు సాధించినవి బహు తక్కువ, డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల క్రమ బద్ధీకరణ విషయంలో వినిసం నిబద్ధత న్యాయస్థానాల దృష్టిలో ప్రశ్నార్థకంగా మారింది. దూర విద్యా సంబంధ నియంత్రణ దానికి పెను సవాలుగా మిగిలింది. ప్రముఖ సంస్థల్లో ఒకటైన వినిసం ఏనాడు లబ్దిదారులతో సమావేశాలు, సంప్రదింపులు జరపలేదు. ఉపకులపతుల సమావేశం జరిగినా, సమస్యలు చెప్పుకునే అవకాశం వారికి లభించలేదు. నిపుణుల ద్వారానే పథక రచన జరుగుతున్నప్పటికి, క్షేత్ర స్థాయిలో వాటిని అమలు చేసే యంత్రాంగం అభిప్రాయాలకు విలువనవ్వడం వినిసం కనీస బాధ్యత. అందుకే వినిసం తదితర కేంద్ర విద్యానియంత్రణ సంస్థల పరితీరును మదింపు చేసిన జాతీయ విజ్ఞాన సంఘం (నేషనల్ నాలెడ్జ కమీషన్) వినిసం లక్ష్యాలను ప్రభుత్వం తిరిగి నిర్వచించాలని అభిప్రాయపడింది. విశ్వవిద్యాలయ నిధుల సంఘం తన పనితీరుపై ఇప్పటికైనా స్వీయ విశ్లేషణ చేసుకోవడం ఉత్తమం. అప్పుడే విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యకు ఆటంకం ఏర్పడకుండా అభివృద్ధి దశలో పయనిస్తాయి. అలాగే భవిష్యత్తులో జరగాలని ఆశిద్దాం.

చరిత్రలో ఈరోజు

జనవరి 14

జననాలు

1856: న్యాపతి సుబ్బారావు, స్వాతంత్ర్య సమరయోధుడు,
1896: సి.డి.దేశ్‌ముఖ్, భారత ఆర్థికవేత్త, దుర్గాబాయి దేశ్‌ముఖ్‌భర్త.
1912: టిల్లీ అల్సెన్, అమెరికన్ రచయిత
1926: కె.బి. తిలక్, స్వాతంత్ర్య సమరయోధుడు, దర్శకుడు,
1926: మహా శ్వేతాదేవి, సుప్రసిద్ధ నవలా రచయిత
1937: రావు గోపాలరావు, ప్రముఖ తెలుగు సినిమా నటుడు.
1937: శోభన్ బాబు, ప్రముఖ తెలుగు కథానాయకుడు.
1938: ఇందిరా నాథ్, సుప్రసిద్ధ భారతీయ మహిళా శాస్త్రవేత్త
1951: జంధ్యాల, సుప్రసిద్ధ తెలుగు సినిమా దర్శకుడు
1956: నాగభైరవ జయప్రకాశ్ నారాయణ్, లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు
1977: నారాయణ్ కార్తికేయన్, భారతదేశానికి చెందిన మొదటి ఫార్ములా వన్ మోటార్ రేసింగ్ డ్రైవరు.

న్యాపతి సుబ్బారావు


ఆంధ్రభీష్మగా పేరొందిన న్యాపతి సుబ్బారావు పంతులు (జనవరి 14, 1856-జనవరి 15, 1941) స్వాతంత్ర్య సమరయోధుడు, సంస్కరణ వాది, సాహిత్యవేత్త, పాత్రికేయుడు, రాజకీయ నాయకునిగా రాణించిన బహుముఖ ప్రజ్ఞాశీలి. 1898 నుంచి 1917 వరకూ భారత జాతీయ కాంగ్రెస్‌లో ఆయన కీలకమైన భూమికను పోషించాడు. 1907లో వందే మాతర ఉద్యమసందర్భంగా బిపిన్ చంద్రపాల్‌ను రాజమండ్రి ఆహ్వానించి అక్కడ ఉపన్యాసాలు ఇప్పించాడు. విజయ వాడలో 1914 ఏప్రిల్ 11వ తేదీన జరిగిన రెండవ ఆంధ్ర మహాసభకు ఆయన అధ్యక్షత వహించాడు. 1918 జనవరి 1వ తేదీన సుబ్బారావు పంతులు డిమాండ్ మేరకు ఆంధ్రప్రాంతానికి ప్రత్యేక ప్రాంతీయ కాంగ్రెస్ కౌన్సిల్‌ను అధిష్టానం ఏర్పాటు చేసింది. ఈ మండలికి సుబ్బారావు పంతులు అధ్యక్షుడు.

ఇందిరానాథ్



ఇందిరానాథ్ (జ. 14 జనవరి, 1938) సుప్రసిద్ధ భారతీయ శాస్త్రవేత్త. గుంటూరు జిల్లాకు చెందిన వెంకటరావు, నాగరత్నమ్మ తల్లిదండ్రులు. వ్యక్తులలో తీవ్ర ఆరోగ్య నష్టాలకు దారితీసే క్లిష్టమైన సమస్యలను కనుగొనడంలో, సునాయాసంగా, ముదస్తుగా కుష్టువ్యాధిని గుర్తించేందుకు రెండు ఎంలెప్రాయ్ ప్రోటీను అన్వేషించి కనుగొన డంలో ఈమె పరిశోధనలు ఎంతో మార్గదర్శకం వహించాయి. మూడు నుంచి ఆరు వారాల లోవుగానే లెప్రాబాలిల్లి (శరీరమంతా వ్యాపించిన లెప్రోమా కంతులు)ని సూక్ష్మదర్శిని ద్వారా కనుగొనడాన్ని వివరించారు. వంశ పారంపర్యంగా తలెత్తు శోష రస కణముల అసాధారణ అభివృద్ధిని, వాటి పనితీరును తన పరిశోధనల ఫలితాల ద్వారా వెల్లడించారు. ఉత్తమ స్థాయి ఔషధాల ద్వారా కూడా సాధించలేని వ్యాధి నివారణకు మూలములను కనుగొన్నారు.

సిడి దేశ్‌ముఖ్




సి.డి.దేశ్‌ముఖ్ (జనవరి 14, 1896 - అక్టోబరు 2, 1982) పూర్తి పేరు చింతామణి ద్వారకానాథ్ దేశ్‌ముఖ్. వీరు భారతీయ రిజర్వ్ బాంక్ మూడవ గవర్నర్ మరియు స్వతంత్ర భారత దేశవు తొలి రిజర్వ్ బాంక్ గవర్నర్. ఇతడు 1943, ఆగష్టు 11 నుంచి 1949, జూన్ 30 వరకు ఈ పదవిని నిర్వహించాడు. ఆ తర్వాత దేశ్‌మూఖ్ భారత దేశానికి ఆర్థిక మంత్రిగా నియమితులైనాడు. 1920లో రోసినా ఆర్థర్ విల్కాక్స్ అనే ఆంగ్ల వనితను వివాహమాడాడు. 1949లో తొలి భార్య మరణించింది. వీరి కుమార్తె ప్రిమ్‌రోజ్ ఇంగ్లాండులో నివసిస్తుంది. ఆ తరువాత 1953లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలైన దుర్గాబాయి దేశ్‌ముఖ్ వివాహం చేసుకున్నాడు. ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యుడైన దేశ్‌ముఖ్‌కు 1939 నుంచే రిజర్వ్ బ్యాంక్‌కు సంబంధం ఉంది. 1941లో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటి గవర్నర్‌గా నియమించబడ్డాడు. ఆ తర్వాత జేమ్స్ టేలర్ నుంచి 3వ గవర్నర్‌గా బాధ్యతలు పొందినాడు. దేశ్‌ముఖ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక పరిణామాలు సంభవించాయి. జూలై 1944లో జరిగిన బ్రెట్టన్ వుడ్స్ సమావేశంలో అతడు కూడా భారత దేశం తరవునన పాల్గొన్నాడు.

ఆఫర్ ప్రకటించేసిన గో ఎయిర్

న్యూఢిల్లీ : ప్రయాణికులను ఆకట్టుకునేందుకు విమానయాన సంస్థలు ఆఫర్ల బాట పట్టాయి. మొన్న ఇండిగో, నిన్న ఎయిర్ ఏషియా ఆఫర్లు ప్రకటించగా తాజాగా గో ఎయిర్ ఎయిర్‌లైన్స్ ఆఫర్ ప్రకటించింది. ఎంపిక చేసిన రూట్లలో సంస్థ రూ. 1,157 ప్రారంభ ధరతో టిక్కెట్లు ఆఫర్ చేసింది. లక్నో- ఢిల్లీ (రూ. 1,485), ఢిల్లీ- లక్నో (రూ. 1,588), బెంగళూరు- కోచి (రూ. 1,703), పుణె- బెంగళూరు (రూ. 2,196), గువాహటి- కోల్‌కతా (రూ. 2,244), పుణె- అహ్మదాబాద్ (రూ. 2,405), ఢిల్లీ- పాట్నా (రూ. 3,104) రూట్లలో టిక్కెట్లపై ఆఫర్‌ను గో ఎయిర్ ప్రకటించింది. జమ్ము- లేహ్ రూట్‌లో రూ. 1,157కే టిక్కెట్లు అందిస్తున్నట్లు సంస్థ తెలియజేసింది. ఈ నెల 22తో టిక్కెట్ల బుకింగ్, ఆఫర్ ముగుస్తుందని గో ఎయిర్ తెలిపింది. గో ఎయిర్ యాప్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకున్న వారికి అదనంగా 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు సంస్థ తెలియజేసింది. బుక్ చేసుకున్న టిక్కెట్లపై ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 15 మధ్య ప్రయాణించవలసి ఉంటుంది.

వరుసగా మూడవ రోజు
పెరిగిన బంగారం ధర!
రూ. 100 పెరిగిన బంగారం ధర



న్యూఢిల్లీ : డాలర్ విలువ పడిపోవడం, వ్యాపారుల నుంచి డిమాండ్ పెరుగుతుండడంతో బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పైపైకి ఎగుస్తున్నాయి. వరుసగా మూడవ రోజు పసిడి ధరలు పెరిగాయి. శనివారం 10 గ్రాముల బంగారం ధర రూ. 100 పెరిగి 30,750 రూపాయలుగా నమోదైంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పెరగడంతో వెండి కూడా పసిడి బాటలోనే పయనిస్తూ ధర రూ. 100 పెరిగి, కిలో వెండి 39,900 రూపాయలుగా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ఔన్స్ 1.17 శాతం పెరిగి 1,337.40 డాలర్లుగా నమోదైంది.

భారత్‌కు నేపాల్ ఝలక్



న్యూఢిల్లీ : చైనాతో నేపాల్ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతోంది. దశాబ్దాల నుంచి సైబర్ కనెక్టివిటీని అందజేస్తున్న భారతదేశానికి నేపాల్ చెక్ పెట్టింది. భారతీ ఎయిర్‌టెల్, టాటా కమ్యూనికేషన్ వంటి భారతీయ టెలికమ్ సంస్థలు నేపాల్‌కు దశాబ్దాల నుంచి ఇంటర్నెట్ సేవలను అందజేస్తున్నాయి. నేపాల్ టెలికమ్, చైనా టెలికమ్ గ్లోబల్ కలసి ఇంటర్నెట్ సేవలను నేపాల్‌లో ప్రారంభించాయి. నేపాల్ రాజధాని ఖాట్మండుకు ఉత్తర దిశలో ఉన్న రసువగడి నుంచి చైనాలోని కెరంగ్ వరకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్‌ను వేశారు. నేపాల్ టెలికమ్ శాఖ అధికార ప్రతినిధి ప్రతిభ వైద్య మాట్లాడుతూ, సైబర్ కనెక్టివిటీ కోసం భారతదేశానికి ప్రత్యామ్నాయంగా చైనా సేవలు ఉపయోగపడతాయని అన్నారు. దీనితో తమకు నిరంతరాయ ఇంటర్నెట్ కనెక్టివిటీ లభిస్తుందని ఆయన అన్నారు. వినియోగదారులకు ఇకపై విశ్వసనీయ సేవలు అందుతాయని వైద్య సూచించారు.

వన్‌ప్లస్ 5టి లావా రెడ్ వేరియెంట్



న్యూఢిల్లీ : చైనాకు చెందిన మొబైల్స్ తయారీదారు వన్‌ప్లస్ తన వన్‌ప్లస్ 5టి స్మార్ట్ ఫోన్‌కు గాను లావా రెడ్ ఎడిషన్ వేరియెంట్‌ను తాజాగా విడుదల చేసింది. ముందు భాగంలో నలుపు రంగును ఈ ఫోన్ కలిగి ఉంది. వెనుక భాగంలో ఎరుపు రంగు ఫినిషింగ్ ఇచ్చారు. ఇటీవలే వన్‌ప్లస్ 5టి స్టార్ వార్స్ ఎడిషన్ భారత్‌లో విడుదల కాగా ఇప్పుడు ఈ వేరియెంట్‌ను వన్‌ప్లస్ విడుదల చేసింది. 8 జిబి ర్యామ్, 128 జిబి స్టోరేజ్ వెర్షన్‌లో వన్‌ప్లస్ 5టి లావా రెడ్ వేరియెంట్ ఈ నెల 20 నుంచి అమెజాన్ సైట్‌లో రూ. 37,999 ధరకు యూజర్లకు ప్రత్యేకంగా లభ్యం కానున్నది. ఇక ఈ ఫోన్‌లో ఫీచర్లన్నీ గతంలో వచ్చిన వన్‌ప్లస్ 5టిలో మాదిరిగానే ఉన్నాయి. వాటిలో ఎటువంటి మార్పూ లేదు.

ఫేస్‌బుక్‌లో రానున్న మరో కొత్త ఫీచర్

కాలిఫోర్నియా : ప్రముఖ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఫేస్‌బుక్ తన యూజర్ల కోసం త్వరలో ఒక కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టనున్నది. 'టుడే ఇన్' పేరిట రానున్న ఈ ఫీచర్ ద్వారా యూజర్లు ఫేస్‌బుక్‌లో తమ లోకేషన్‌ను బట్టి అక్కడి లోకల్ వార్తలు, విశేషాలను న్యూస్ ఫీడ్‌లో, ట్రెండింగ్ టాపిక్స్‌లో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఫేస్‌బుక్ దీనిని అంతర్గతంగా పరిశీలిస్తున్నది. న్యూయార్క్ సహా పలు ప్రాంతాల్లో ఎంపిక చేసిన కొద్ది మంది యూజర్ల ద్వారా ఫేస్‌బుక్ దీనిపై ప్రయోగాలు చేస్తున్నది. త్వరలోనే ఈ ఫీచర్ పూర్తి స్థాయిలో యూజర్లు అందరికీ అందుబాటులోకి వస్తుందని ఫేస్‌బుక్ ప్రతినిధి ఒకరు చెప్పారు.

అదిరిపోయే ఫీచర్లతో
విడుదలైన స్మార్ట్రన్ టి.ఫోన్ పి



న్యూఢిల్లీ : స్మార్ట్రన్ సంస్థ తన కొత్త స్మార్ట్ ఫోన్ 'టి.ఫోన్ పి'ని తాజాగా విడుదల చేసింది. రూ. 7,999 ధరకు ఈ ఫోన్ వినియోగదారులకు ఈ నెల 17 నుంచి ఫ్లిప్‌కార్ట్ సైట్‌లో ప్రత్యేకంగా లభ్యం కానున్నది.స్మార్ట్రన్ టి.ఫోన్ పి ఫీచర్లు: 5.2 అంగుళాల హెచ్‌డి 2.5డి కర్వ్‌డ్ గ్లాస్ డిస్‌ప్లే, 12870' 720 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్, 1.4 గిగాహెర్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 435 ప్రాసెసర్, 3 జిబి ర్యామ్, 32 జిబి స్టోరేజ్, 128 జిబిఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 7.1 నూగట్, హైబ్రిడ్ డ్యుయల్ సిమ్, 13 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా, 5 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జి వీవోఎల్‌టిఇ, బ్లూటూత్ 4.1, 5000 ఎంఎహెచ్ బ్యాటరీ.

భారీ స్క్రీన్, డ్యుయల్
సెల్ఫీ కెమెరా స్మార్ట్‌ఫోన్



న్యూఢిల్లీ : ప్రముఖ మొబైల్ సంస్థ హెచ్‌టిసి 2018లో తొలి స్మార్ట్ ఫోన్‌ను త్వరలోనే మార్కెట్‌లోకి ప్రవేశపెట్టనున్నది. తాజా నివేదికల ప్రకారం, 'ఐ' బ్రాండ్‌లో హెచ్‌టిసియు11ఐ పేరుతో సోమవారం (15న) విడుదల చేయనున్నది. అమెరికా మార్కెట్‌తో పాటు ఇతర మార్కెట్లలో కూడా ఒకేసారి ప్రవేశపెడుతుందా? లేదా అనే విషయమై ఇంకా స్పష్టత లేదు. భారీ స్క్రీన్, డ్యుయల్ సెల్ఫీ కెమెరాలతో లాంచ్ చేయనున్న ఈ డివైస్‌ను మిడ్ సెగ్మెంట్ బడ్జెట్ ధరలోనే (రూ. 32 వేలు) కస్టమర్లకు అందుబాటులో ఉంచనుందని తెలుస్తోంది. బ్లాక్, రెడ్, సిల్వర్ రంగుల్లో లభ్యం కానున్న ఈ స్మార్ట్ ఫోన్ ఇతర ఫీచర్లపై అంచనాలు ఇలా ఉన్నాయి. హెచ్‌టిసియు11ఐ ఫీచర్లు : 6 అంగుళాల పూర్తి హెచ్‌డి డిస్‌ప్లే, సూపర్ ఎల్‌సిడి3, 1080/2160 పిక్సెల్ రిజల్యూషన్, స్నాప్‌డ్రాగన్ 652 ప్రాసెసర్ ఆండ్రాయిడ్ నౌగట్, 4 జిబి ర్యామ్, 64 జిబి స్టోరేజ్, డ్యూయల్ సెల్ఫీ కెమెరా, 3930 ఎంఎహెచ్ బ్యాటరీ.

2 రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్

నెల్లూరు,సూర్యబ్యూరో: రెండు రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్‌ను అందిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం ఆయన నెల్లూరులో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరును దేశంలోనే బెస్ట్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే 7 లక్షల మందికి మినరల్ వాటర్ అందించే కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కాగా ప్రతిపక్షాలు ప్రతి పనిని విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని నారాయణ విమర్శించారు.

ద్రవ్యోల్బణం జనవరిలో తగ్గవచ్చు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా

న్యూఢిల్లీ : ఆహార పదార్థాలు, కూరగాయలు ప్రియం కావడంతో డిసెంబరు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. గత నెలలో వినియోగ వస్తు ధరల సూచీ (సిపిఐ) 5.21శాతానికి చేరింది. దీనితో వచ్చే సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ద్రవ్యోల్బణంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సానుకూలంగా స్పందించింది. జనవరి నెలలో ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉందని ఎస్‌బిఐ అంచనా వేస్తోంది. ఈ మేరకు ఎస్‌బిఐకి చెందిన ఎకనమిక్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ తయారు చేసిన నివేదికలో పేర్కొంది. 'మా అంచనాలకు తగినట్లే రీటైల్ ద్రవ్యోల్బణం 2017 డిసెంబర్ నెలలో 17 నెలల గరిష్ఠానికి చేరి 5.21 శాతంగా ఉంది. నవంబర్‌లో ఇది 4.88 శాతం మాత్రమే. అయితే, దీని గురించి ఆందోళన పడవలసిన అవసరం లేదు. ఒక విధంగా చెప్పాలంటే ద్రవ్యోల్బణం నెలవారీ పెరుగుదల గతంతో పోలిస్తే తగ్గింది. జనవరిలో కూరగాయల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీనితో ఈ నెలలో రీటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్ కంటే తగ్గే అవకాశం ఉందని అంచనా' అని ఆ నివేదికలో పేర్కొన్నారు. అయితే, జనవరి తరువాత నుంచి జూన్ వరకు మాత్రం కాస్త ఎక్కువగానే ఉండే అవకాశం ఉన్నట్లు ఎస్‌బిఐ అభిప్రాయపడుతోంది. ఈ సమయంలో సగటున ద్రవ్యోల్బణం 5.5 శాతం ఉండనున్నట్లు బ్యాంక్ అంచనా వేస్తోంది. అయితే, జూలై తరువాత నుంచి డిసెంబర్ వరకు మాత్రం మళ్లీ తగ్గుముఖం పట్టి 4 శాతం కిందకు చేరే అవకాశం ఉన్నట్లు ఎస్‌బిఐ సూచించింది. కేంద్ర గణక కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 4.96 శాతం పెరిగింది. డిసెంబర్‌లో ఇది 4.42 శాతం తగ్గింది. గుడ్లు, కూరగాయలు, పండ్లు ధరల్లో పెరుగుదల ఉండగా, పప్పులు, తృణ ధాన్యాల ద్రవ్యోల్బణం రేటు తగ్గింది.

చారిత్రక భవనాల సందర్శకులకు శుభవార్త

• అక్కడ కార్డులు వాడితే డిస్కౌంట్లు • ఎఎస్ఐ ఆఫర్

న్యూఢిల్లీ : ఇకపై దేశంలోని ప్రముఖ కట్టడాలు, వారసత్వ సంపద కలిగిన చారిత్రక భవనాలను సందర్శించే పర్యాటకులకు ప్రవేశ రుసుముపై డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించింది ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా. అయితే, ఈ డిస్కౌంట్ ఆఫర్ అందరికీ కాదు. ఎవరైతే నగదు రహితంగా టిక్కెట్ కొనుగోలు చేస్తారో అంటే కార్డులు లేదా పేమెంట్ గేట్‌వేల ద్వారా ప్రవేశ టిక్కెట్లు కొంటారో వారికే ఈ డిస్కౌంట్ వర్తిస్తుంది. ఈ మేరకు ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా తాజా నోటిఫికేషన్‌లో ఈ విషయం సూచించింది. మరి ఈ డిస్కౌంట్, పర్యాటక ప్రాంతాల వివరాలు ఇలా ఉన్నాయి. దేశవ్యాప్తంగా 116 చారిత్రక కట్టడాలకు ప్రవేశ రుసుము ఉంది. వీటిని కేటగరీ 'ఎ', కేటగరీ 'బి'గా విభజించారు. కేటగరీ 'ఎ'లో ఉన్న కట్టడాలకు రూ. 40, 'బి'లో ఉన్న కట్టడాలకు రూ. 20 ప్రవేశ రుసుము ఉంది. ఒక్క ఢిల్లీలోని ఎర్రకోటకు మాత్రం రూ. 50 ప్రవేశ రుసుము ఉంది. స్వదేశీ పర్యాటకులకు ఈ టిక్కెట్ ధరలు వర్తిస్తాయి. విదేశీయులకైతే ఒక్కొక్క కట్టడానికి రూ. 600 చొప్పున ఉంటుంది. అయితే, నగదుతో ఈ టిక్కెట్లను కొనుగోలు చేస్తే వీటి ధరలు ఇలాగే ఉంటాయి. కానీ డిజిటల్ కొనుగోళ్లు చేస్తే మాత్రం టిక్కెట్లపై డిస్కౌంట్లు ఇవ్వనున్నట్లు అధికారులు తెలియజేశారు. భారత పర్యాటకులకు రూ. 5 చొప్పున, విదేశీయులకు రూ. 50 చొప్పున ధర తగ్గించనున్నామని వానే తెలిపారు.

టికెట్ ధరలు, డిస్కౌంట్లు ఇలా..

కేటగరీ 'ఎ':
నగదు: భారతీయలకు రూ. 40, విదేశీయులకు రూ. 600
నగదురహిత: భారతీయులకు రూ. 35, విదేశీయులకు రూ. 550
కేటగరీ 'బి'
నగదు: భారతీయులకు రూ. 25, విదేశీయులకు రూ. 300
నగదురహిత: భారతీయులకు రూ. 20, విదేశీయులకు రూ. 250
ఎర్రకోట:
నగదు: భారతీయులకు రూ. 50, విదేశీయులకు రూ. 600
నగదురహిత: భారతీయులకు రూ. 35, విదేశీయులకు రూ. 550

కాగా, ఈ డిస్కౌంట్‌పై విశ్లేషకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు డిజిటల్ లావాదేవీలపై అంతగా అవగాహన లేదని, ఇలాంటి డిస్కౌంట్ల వల్ల అధికారులు తమను మోసం చేస్తున్నారని వారు భావించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరెక్టర్ అరెస్ట్



న్యూఢిల్లీ : ఆంధ్రా బ్యాంకు మాజీ డైరెక్టర్ అనూప్ ప్రకాశ్ గార్గ్‌ను శుక్రవారం రాత్రి పొద్దు పోయిన తరువాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసింది. గుజరాత్‌లోని ఫార్మా సంస్థ స్టెర్లింగ్ బయోటెక్‌కు రూ. 5,000 కోట్ల రుణాన్ని మోసపూరితంగా ఇచ్చిన కేసులో ఆయనను అరెస్టు చేశారు. ఈ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఇడి దర్యాప్తు చేస్తున్న సంగతి విదితమే. ఈ కేసులో అరెస్టయినవారిలో అనూప్ ప్రకాశ్ రెండవ వ్యక్తి. గత నవంబర్‌లో ఢిల్లీ వ్యాపారవేత్త గగన్ ధావన్‌ను ఈ కేసులో అరెస్టు చేశారు. అనూప్‌ను ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు˘ఎరుస్తారు. ఆయనపై ఇడితో పాటు సిబిఐ కూడా ఆరోపణలు నమోదు చేసింది. సిబిఐ ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఇడి మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసింది. సందేశారా సోదరులు 2008- 2009 కాలంలో గార్గ్‌కు రూ. 1.52 కోట్లు చెల్లించినట్లు ఆదాయపు పన్ను శాఖకు లభించిన ఒక డైరీ ద్వారా వెల్లడైంది. సిబిఐ కేసులో నిందితుల జాబితాలో స్టెర్లింగ్ బయోటెక్, ఆ సంస్థ డైరెక్టర్లు చేతన్ జయంతిలాల్ సందేశారా, దీప్తి చేతన్ సందేశారా, రాజ్ భూషణ్ ఓమ్ ప్రకాశ్ దీక్షిత్, నితిన్ జయంతిలాల్ సందేశారా, చార్టర్డ్ అకౌంటెంట్ హేమంత్ హాతి, గార్గ్, మరికొందరు ఉన్నారు.

ప్రయాణికులకు మరో శుభవార్త చెప్పిన రైల్వే



విజయవాడ,సూర్యబ్యూరో: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాకినాడ – సికింద్రాబాద్‌కు ఈ నెల 16, 17 తేదీల్లో జనసాధారణ్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు సీపీఆర్వో ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తిగా జనరల్ బోగీలతో నడిచేఈ రైలు కాకినాడ టౌన్‌లో సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30కు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ రైల్వేస్టేషన్‌లలో ఆగుతుంది. రైలుకు 16 జనరల్ బోగీలుంటాయి.

అన్‌క్లెయిమ్‌డ్ బ్యాంకు డిపాజిట్లు
రూ. 8 వేల కోట్లు



• బ్యాంకుల వద్ద లేని 2.63 కోట్ల ఖాతాల వివరాలు
• 2012 నుంచి 2016 వరకు రెట్టింపు
• ఆర్‌బిఐ వెల్లడి

న్యూఢిల్లీ : అన్‌క్లెయిమ్‌డ్ బ్యాంకు డిపాజిట్లు రూ. 8 వేల కోట్లకు చేరుకున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. ఆ బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన వ్యక్తులు లేదా వారసులకు సంబంధించిన వివరాలు ఏవీ అధికారుల దగ్గర లేవు. కానీ బ్యాంకు ఖాతాదారుల డిపాజిట్లు మాత్రం రూ. 8 వేల కోట్లకు చేరినట్లు తేలింది. దీనికి సంబంధించిన తాజా నివేదికను రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా విడుదల చేసింది. మొత్తం 2.63 కోట్ల బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు ఏవీ బ్యాంకు అధికారుల దగ్గర లేవు. కానీ వారి డిపాజిట్లు మాత్రం రూ. 8,864.6కోట్లు ఉన్నాయి. 2012 నుంచి 2016 వరకు ఈ అప్రకటిత బ్యాంకు డిపాజిట్లలోని నగదు రెట్టింపు అయింది. బ్యాంకుల్లో ఏళ్ల తరబడి డిపాజిట్లు చేసి వాటిని తీసుకోవడానికి ఎవరూ రాకపోవడం లేదా ఆ డిపాజిట్‌దారులకు సంబంధించిన పూర్తి సమాచారం లేకపోవడంతో అవి అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లుగా మారిపోతాయి. అప్రకటిత బ్యాంకు ఖాతాల సంఖ్య కూడా 2012లో 1.32 కోట్లు ఉండగా 2016 నాటికి అది రెట్టింపై 2.63 కోట్లగా చేరింది. అదే సమయంలో వారి డిపాజిట్లు కూడా రూ. 3,598 కోట్ల నుంచి రూ. 8,864.6 కోట్లకు చేరాయి. అన్‌క్లెయిమ్‌డ్ బ్యాంకు డిపాజిట్‌దారుల వివరాలను బ్యాంకు అధికారులు తమ తమ అధికారిక వెబ్‌సైట్‌లలో ఉంచాలని ఆర్‌బిఐ సూచించింది.

ఈ జాబితాలో తప్ప కుండా ఆ డిపాజిట్ చేసిన ఖాతా దారుని పూర్తి పేరు, వివరాలు పొందుపరచవలసిందిగా ఆర్‌బిఐ సలహా ఇచ్చింది. అలా చేయడం వల్ల వారి వారసులు వివరాలను తెలుసుకోవడం చాలా సులభమవుతుందని ఆర్‌బిఐ సూచించింది. అన్‌క్లెయిమ్‌డ్ బ్యాంకు డిపాజిట్లు అత్యధికంగా ఉన్న బ్యాంకు జాబితాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తొలి స్థానంలో నిలిచింది. దాదాపు 47 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాల్లో మొత్తం రూ. 1,036 కోట్ల నగదు ఉంది. 47 లక్షల ఇన్‌యాక్టివ్ బ్యాంకు ఖాతాల్లో రూ. 995 కోట్ల నగదు ఉండి కెనరా బ్యాంక్ తరువాతి స్థానంలో ఉంది.

ఇక పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 23 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాలు ఉండగా వాటిలో రూ. 829 కోట్లు మూలుగుతున్నాయి. మరొక వైపు ఈ డిపాజిట్లపై బ్యాంకు ఇచ్చే వడ్డీతో ఆ నగదు మరింత పెరుగుతూ వస్తోంది.

నాణేల తయారీ మళ్లీ మొదలు

కోల్‌కతా : బ్యాంకుల్లో స్థలం లేక నాణేల తయారీని నిలిపివేయవలసిందిగా ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకుంది. నాణేల తయారీ పునరుద్ధరణకు శనివారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పిఎంసిఐఎల్)కు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. కోలకతా, ముంబయి, నోయిడా, హైదరబాద్‌లో ఈ టంకశాలలు (మింట్) ఉన్నాయి. 'శుక్రవారం నుంచి నాణేల తయారీని మళ్లీ ప్రారంభించాం. చలామణీలో ఉన్న అన్ని నాణేలను తయారు చేస్తున్నాం' అని కోలకతా మింట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బిజన్ దేవ్ తెలియజేశారు. అయితే, ఉద్యోగులు రెండు



షిఫ్టులలో కాకుండా ఒకే షిఫ్ట్‌లో పని చేయవలసిందిగా ప్రభుత్వం నోటీసుల్లో సూచించిందని ఆయన తెలిపారు. 7,712 మిలియన్ నాణేలను తయారు చేయవలసిందిగా గతంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) మింట్‌లను ఆదేశించింది. కాగా, ఇప్పటికే కేంద్రాల్లో 5,900 మిలియన్ నాణేలను తయారు చేశారు. ఇక మిగతావి తయారు చేయడానికి రెండున్నర నెలల సమయం పట్టే అవకాశం ఉంది. బ్యాంకుల్లో నాణేలను భద్రపరిచేందుకు స్థలం లేదనే కారణంతో నాణేల తయారీని నిలిపివేయవలసిందిగా ఈ నెల 9న ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన విషయం తెలిసిందే. 2016 నవంబర్‌లో రూ. 500, రూ. 1000 నోట్లను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత భారీగా పాత నోట్లు బ్యాంకుల్లోకి వచ్చి చేరాయి. దీనితో బ్యాంకు వాల్టులన్నీ పాత నోట్లతో నిండిపోయాయి. నాణేలు దాచేందుకు స్థలం లేకపోయింది. ఈ ఏడాది జనవరి 8 వరకు ప్రభుత్వ టంకశాలలో 2,528 మిలియన్ల నాణేలు ఉండిపోయాయి.

ఫ్లిప్‌కార్ట్‌లో యాపిల్ ఉత్పత్తులపై ఆఫర్లే ఆఫర్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ తన సైట్‌లో 'యాపిల్ వీక్' పేరిట ఒక ప్రత్యేక సేల్‌ను నిర్వహిస్తున్నది. ఈ నెల 15 వరకు కొనసాగనున్న ఈ సేల్‌లో యాపిల్‌కు చెందిన పలు ఐఫోన్ మోడల్స్, మాక్ బుక్ ఎయిర్, ఐప్యాడ్, ఐప్యాడ్ ప్రొ, వాచ్ సీరీస్ 1, 2, 3 లకు చెందిన ఐటమ్స్‌పై పలు ఆకర్షణీయమైన ఆఫర్లు, రాయితీలు లభిస్తున్నాయి. ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో ఇఎంఐ పద్ధతిలో కొనుగోలు చేస్తే రూ. 8 వేల వరకు క్యాష్ బ్యాక్‌ను అందిస్తున్నారు. యాపిల్ వీక్ సేల్‌లో భాగంగా ఐఫోన్ 7 ప్లస్ (32జిబి) రూ. 56,999 ధరకు లభిస్తుండగా ఐఫోన్ 6ఎస్ ప్లస్ (32జిబి) రూ. 37,999 ధరకు, ఐఫోన్ 7 (32జిబి) రూ. 42,999కి, ఐఫోన్ 6 (32జిబి) రూ. 25,499కి, ఐఫోన్ ఎస్ఇ (32జిబి) రూ. 18,999కి, ఐఫోన్ 8 (64జిబి) రూ. 54,999కి, ఐఫోన్ 8 ప్లస్ (64జిబి) రూ. 66,499కి లభిస్తున్నాయి. అదే విధంగా ఈ సేల్‌లో ఐఫోన్ 10, 8, 8 ప్లస్‌లపై రూ. 8 వేల క్యాష్ బ్యాక్‌ను అందిస్తున్నారు. ఐఫోన్ 7పై రూ. 5 వేలు, 7 ప్లస్‌పై రూ. 3 వేల క్యాష్‌బ్యాక్, ఐఫోన్ 6ఎస్ ప్లస్, 6ఎస్, 6లపై రూ. 2500 క్యాష్ బ్యాక్‌ను అందిస్తున్నారు. ఐసిఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో ఇఎంఐ పద్ధతిలో కొంటే ఈ క్యాష్ బ్యాక్ వస్తుంది. అలాగే ఐప్యాడ్ 32జిబి (వైఫై ఓన్లీ) రూ. 22,900కు, ఐప్యాడ్ ప్రొ 10.5, 12.9 అంగుళాల మోడల్స్ రూ. 48,900 ధరకు, వాచ్ సీరీస్ 1 రూ. 18,900కు, సీరీస్ 2 రూ. 22,900కు, సీరీస్ 3 రూ. 29,900 ధరకు లభిస్తున్నాయి.

గూగుల్ ప్లే స్టోర్ గేమ్స్‌పై మాల్‌వేర్ అటాక్



శాన్‌ఫ్రాన్సిస్కో : గూగుల్ ప్లే స్టోర్‌లోని గేమ్స్‌పై పోర్నోగ్రాఫిక్ మాల్‌వేర్ అటాక్ చేసింది. ఈ అటాక్ బారితో దాదాపు 60 గేమ్స్‌ను గూగుల్ తమ ప్లే స్టోర్ నుంచి తొలగించింది. తొలగించిన గేమ్స్‌లో ఎక్కువగా చిన్నపిల్లలు ఆడుకునేవే ఉన్నాయి. పోర్నోగ్రాఫిక్ మాల్‌వేర్ గూగుల్ ప్లే స్టోర్‌పై అటాక్ చేసినట్లు ఇజ్రాయిల్‌కు చెందిన సెక్యూరిటీ రీసెర్చ్ సంస్థ చెక్‌పాయింట్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ గుర్తించింది. ఫేక్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్‌ను యూజర్లు డౌన్‌లోడ్ చేసుకోవడం కోసం అడ్వర్‌టైజ్‌మెంట్లు డిజైన్ చేసినట్లు రీసెర్చర్లు రిపోర్టు చేశారు. గేమ్స్ యాప్‌లో పోర్నో యాడ్స్ ద్వారా ఈ మాల్‌వేర్ అటాక్ చేస్తుందని, ఒకవేళ వీటిని క్లిక్ చేస్తే, దానికి తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని రీసెర్చర్లు సూచించారు. ఈ మాల్‌వేర్‌పై అలర్ట్ అయిన గూగుల్ వెంటనే తన ప్లే స్టోర్ నుంచి ఆ యాప్స్‌ను తొలగించింది. ప్లే స్టోర్ నుంచి తాము ఈ యాప్స్‌ను తొలగించామని, డెవలపర్ల అకౌంట్‌ను డిజేబుల్ చేశామని గూగుల్ తెలియజేసింది. వీటిని ఇన్‌స్టాల్ చేసుకునే వారికి తాము గట్టి హెచ్చరిక జారీ చేస్తున్నామని సంస్థ తెలిపింది. యూజర్లను సురక్షితంగా ఉంచేందుకు చెక్ పాయింట్స్ చేసిన ఈ పనిని తాము అభినందిస్తున్నామని సంస్థ తెలిపింది. అయితే, ఈ మాల్‌వేర్ ప్రభావానికి యూజర్ల డివైస్‌లు ప్రభావితం కాలేదని సంస్థ తెలిపింది. మాల్‌వేర్ ప్రభావానికి గురైన యాప్స్ మూడు నుంచి ఏడు మిలియన్ సార్లు డౌన్‌లోడ్ అయ్యాయి. వాటిలో ఫైవ్ నైట్స్ సర్వైవల్ క్రాఫ్ట్, మెక్వీన్ కారు రేసింగ్ గేమ్ ఉన్నాయి.

సూర్య
హైదరాబాదు
ఆదివారం
14 జనవరి 2018
6

కార్తీ చిదంబరం కార్యాలయాలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం కార్యాలయాలపై శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఈడీ) దాడులు నిర్వహించారు. ఎయిర్‌సెల్-మాక్సిస్ మనీలాండరింగ్ కేసులో భాగంగానే ఢిల్లీ, చెన్నై ప్రాంతాల్లోని కార్తీ కార్యాలయాలపై అధికారులు దాడులు చేశారు. గత నెలలో కూడా ఇదే విధంగా చిదంబరం బంధువుల ఇళ్లపై ఏకకాలంలో ఈడీ దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా ఈడీ ఎదుట హాజరుకావాల్సిందిగా కార్తీ చిదంబరానికి సమన్లు జారీ చేసిన రెండో రోజే దాడులు జరగడం గమనార్హం. ఐఎన్‌ఎక్స్ మీడియా సంస్థలో విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇచ్చిన కేసులో ఈనెల 16న విచారణకు హాజరు కావాలని కార్తీ చిదంబరానికి ఈడీ గురువారం సమన్లు పంపిన విషయం తెలిసిందే. 2009 ఆగస్టులో కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న చిదంబరం తన అధికారాలను దుర్వినియోగం చేసి ఐఎన్‌ఎక్స్ మీడియా అనే సంస్థ విదేశీ పెట్టుబడులు పొందేందుకు అనుమతి ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కార్తీ చిదంబరం, ఐఎన్‌ఎక్స్ మీడియా సంచాలకులు పీటర్ ముఖర్జీ, ఇంద్రాణి ముఖర్జీలపై ఈడీ కేసు నమోదు చేసింది.



డబ్బులు బాబోయ్..డబ్బులు...

- ఊరెళ్లేందుకు డబ్బుల్లేవ్
- ఏటీఎంలలో నిండుకున్న క్యాష్
- పండుగ పూట క్యాష్ కోసం ప్రజల కష్టాలు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు డబ్బుల కోసం నానా తంటాలు పడుతున్నారు. పండుగకు ఊరెళ్లేందుకు డబ్బులేక ఆగచాట్లు పడుతున్నారు. ఖాతాలో డబ్బులున్నాయ్...చేతిలో ఏటీఎం కార్డు ఉంది..అయితే ఏటీఎం కార్డు పట్టుకొని ఏటీఎంలకు వెళ్తే డబ్బుల్లేక పోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ పరిస్థితి ఒక్క హైదరాబాద్‌లోనో, విజయవాడలోనో కాదు..తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలు, పట్టణాల్లో చోటుచేసుకుంది. బ్యాంకు బ్యాలెన్స్ ఉంది కానీ పర్సులోకి డబ్బులు చేరవు. తీద్దామంటే నో క్యాష్ అంటూ ఏటీఎంలు దర్శనమిస్తుంటాయి. బ్యాంకుకు వెళ్తే క్యూ కష్టాలు. పోనీ కార్డు స్వైప్ చేద్దామంటే వాయింపుడే వాయింపుడు. దీంతో సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు మళ్లీ క్యాష్ కష్టాలు మొదలయ్యాయి. ఏటీఎం కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. కొన్ని రోజులుగా ఏటీఎంలలో బ్యాంకులు నగదు పెట్టడం లేదు. ఉన్న నిల్వలు కాస్తా నిండుకున్నాయి. 15 రోజుల క్రితం మెల్లి మెల్లిగా మొదలైన ఈ కొరత వారం క్రితం తీవ్ర స్థాయికి చేరింది. ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. దీంతో సంక్రాంతి పండుగకు క్రాంతి మసకబారుతోంది. అటు బ్యాంకుల్లోనూ నగదు కొరత వేధిస్తోంది. కస్టమర్‌ని బట్టి రూ.5వేలు, రూ.10వేలు ఇస్తున్నారు బ్యాంకర్లు. నోట్ల రద్దు దెబ్బతో గతేడాది సంక్రాంతి సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ సారి కూడా పండుగ సమయంలోనే నోట్ల కష్టాలు ప్రారంభమయ్యాయి. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ నాలుగు రోజుల పాటు పిల్లాపాపలతో ఎంజాయ్ చేద్దామనుకుంటే కరెన్సీ కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.కోస్తాంధ్ర, సీమ, తెలంగాణ ఎక్కడ చూసినా కరెన్సీ కష్టాలే కనిపిస్తున్నాయి. ప్రజల ఆవేదన వినిపిస్తోంది. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం,విజయవాడ, విశాఖ నగరాల్లో ఎన్ని ఏటీఎంలు ఉంటే ఏం లాభమన్నట్లు ఉంది పరిస్థితి. ఏదో సమయంలో కొన్ని ఏటీఎంలలో లక్షా, రెండు లక్షలు నింపుతున్నారు. కానీ అవి పట్టుమని పదిహేను నిమిషాలు కూడా ఉండటం లేదు. సంక్రాంతి పండుగ శోభ సంగతి కాస్త పక్కనపెడితే క్రెడిట్ కార్డో, డెబిట్ కార్డ్‌తోనో పని కానిచ్చేద్దామంటే చార్జీలు గుదిబండలా మారాయి. కానీసం రెండుశాతం వడ్డన పడుతోంది. బిల్లుకు వడ్డీమాదిరి భారాన్ని ఎవరు మాత్రం భరించగలరు. ఎమర్జెన్సీలో కార్డు బ్యాలెన్స్ హారతి కర్పూరంలా కరిగిపోతోంది. ఇవన్నీ అటుంచితే అన్నదాత కష్టాలు అన్నీఇన్నీ కాదు. ఎరువులు, పురుగుల మందుల కొనుగోలుకు రోజుల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. రెండు మూడు రోజులు బ్యాంకులకు వెళ్లినా అక్కడ చాంతాడంతో క్యూలు చూసి నిస్సహాయంగా వెనుదిరగాల్సి వస్తోంది. రూ.2వేల' నోట్ల ముద్రణను రిజర్వ్ బ్యాంకు నిలిపివేయడంతోనే కరెన్సీ కష్టాలు తీవ్రమయ్యాయి. గతంలో మార్కెట్లోకి వచ్చిన నోట్లన్నీ సంపన్నుల దగ్గర కుప్పలు తెప్పలుగా మూల్గుతున్నాయి. అవి డిపాజిట్ల రూపంలో కానీ, మరో రూపంలో కానీ బ్యాంకులకు చేరట్లేదు. దీంతో నగదు చెలామణి లేక కొరత ఏర్పడిందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. అన్నింటికీ మించి బ్యాంకింగ్ సెక్టార్‌లో రూల్స్‌మారతాయి. నష్టాలున్న బ్యాంకులు డిపాజిట్లను తిరిగి చెల్లించవనే ప్రచారం ఓ రేంజ్‌లో జరగడం అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. కొత్త డిపాజిట్లు రావడంలేదు. ఉన్న డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే వారు ఎక్కువ కావడంతో నగదు కొరత ఓ రేంజ్‌లో వేధిస్తోంది. రూ.2వేల నోట్లు, రూ.500నోట్లతో గతేడాది చిల్లర కొరత కష్టాలు వేధించాయి. దీంతో



రూ.200, రూ.50 నోట్లను ముద్రించింది ఆర్బీఐ. అవి ఇంకా ప్రజల చెంతకి ఓ మాదిరిగా కూడా చేరలేదు. ఇంకా చెప్పాలంటే చాలా మంది రూ.200, కొత్త రూ.50 నోట్లను చూడలేదు. కొత్త రూ.10 నోట్లను మార్కెట్లోకి తెస్తామని ప్రకటించింది ఆర్బీఐ. కానీ అంతలోనే రూ.2వేల నోట్ల ముద్రణను ఎందుకు ఆపేసినట్లు?.. ఓవైపు చిల్లర కష్టాలు అలా ఉండగానే మొత్తంగా కరెన్సీ కొరత తలెత్తేలా చేయడం వెనుక మతలబు ఏంటి?... డిజిటల్ లావాదేవీలు పెంచడానికిలా చేస్తోందా ప్రభుత్వం?.. లేకపోతే మళ్లీ పెద్ద నోట్లను రద్దు చేస్తారా?. ఇప్పుడివే ప్రశ్నలు భారతీయులను తొలిచేస్తున్నాయి. డిజిటల్ లావాదేవీలకే మొగ్గు చూపుతున్నప్పుడు చార్జీల వడ్డన దేనికని ప్రశ్నిస్తున్న వారు లేకపోలేదు. వేతన జీవుల వెతలు, అన్నదాతల ఆవేదన, పేదల పండుగ కష్టాలు తొలగిపోవాలంటే కరెన్సీ నోట్లు చలామణిలోకి రావాలి. ఇప్పటికిప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో మరికొన్ని రోజులు జనానికి కరెన్సీ కష్టాలు తప్పేలా లేవు.

జడ్జీల వివాదంలో బార్ కౌన్సిల్ మధ్యవర్తిత్వం

- సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ సమావేశంలో కీలక చర్చలు
- న్యాయవ్యవస్థ అంతర్గత వ్యవహారమన్న కేంద్రం
- స్వాగతించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్
- మరోసారి మీడియా ముందుకు వెళ్లవద్దని జడ్జీలను కోరిన మిశ్రా

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు జడ్జీల మధ్య నెలకొన్న వివాదానికి ముగింపు పలికేందుకృషి చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. నలుగురు న్యాయమూర్తులు శుక్రవారం సంయుక్తంగా విలేకర్ల సమావేశంలో వెల్లడించిన అంశాలపై వారితో వ్యక్తిగతంగా చర్చలు జరపాలని నిర్ణయించింది. జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ కురియన్ జోసఫ్, జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ రంజన్ గొగోయ్ శుక్రవారం మీడియా సమావేశంలో భారత ప్రధాన న్యాయమూర్తిపైనా, సుప్రీంకోర్టు పరిపాలనపైనా ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ శనివారం సాయంత్రం 5 గంటలకు సమావేశమై ఈ వివాదంపై చర్చించింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశం న్యాయవ్యవస్థ అంతర్గత వ్యవహారమని, దానిలో జోక్యం చేసుకోమని ప్రధాని, న్యాయశాఖ మంత్రి చెప్పడాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా స్వాగతించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అభినందిస్తున్నామని అన్నారు. న్యాయవ్యవస్థపై మాట్లాడే అవకాశాన్ని రాహుల్ గాంధీ, ఇతర రాజకీయ పార్టీలకు కల్పించింది మనమే. ఆయనకు (రాహుల్), ఇతర రాజకీయ పార్టీలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరఫున నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ అంశాన్ని దయచేసి రాజకీయం చేయవద్దు అని ఆయన అన్నారు. అదే విధంగా మరోసారి మీడియా ముందుకు వెళ్లవద్దని కూడా జడ్జీలను ఆయన కోరారు. న్యాయమూర్తులు ప్రజలముందుకు వెళ్లి ఉండాల్సింది కాదని



అభిప్రాయపడ్డారు. ఏదైనా ఇబ్బందుంటే పరిష్కరించుకునేందుకు తగిన యంత్రాంగం న్యాయవ్యవస్థ పరిధిలోనే ఉందని, ఆ స్ఫూర్తితో చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. మరోసారి ఇలాంటి వాటికి అవకాశమివ్వద్దని కౌన్సిల్ తరఫున మనన్ కుమార్ మిశ్రా విజ్ఞప్తి చేశారు.

మొదటి పేజీ తరువాయి

పట్నం ఊరెళ్లింది!

ప్రాంతాలకు వెళ్ళే రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్ - విజయవాడ, హైదరాబాద్-కర్నూల్, వరంగల్, అదిలాబాద్, కరీంనగర్ తదితర జాతీయరహదారిపై శనివారం వేకువజామున నుంచి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడింది. సుమారు రెండు కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. టోల్ ప్లాజా వద్ద పది గేట్లు తెరిచినా వాహనాల రద్దీ తగ్గలేదు.

కాగా హైదరాబాద్ ఖాళీ అవుతోంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరవాసులు పల్లెబాట పడుతున్నారు. దీంతో పండుగకు ఊరెళ్లే ప్రయాణికులతో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్లన్నీ బుకింగ్ అయ్యాయి. దూరప్రాంత రెగ్యులర్ రైళ్లలో రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు పూర్తవడంతో పాటు అదనవు ఛార్జీలతో నడిపే ప్రత్యేకరైళ్లలో సీట్లు నిండిపోయాయి. వీటిలో చాలారైళ్లలో వెయిటింగ్ లిస్ట్ పరిమితి కూడా దాటిపోయింది. బెర్తు, సీటు దొరక్కపోయినా.. నిల్చొనైనా వెళ్దామనుకున్నా టికెట్లు బుక్ చేసుకునే పరిస్థితి లేదు. దీంతో సంక్రాంతికి సొంతూరుకు వెళ్లడమెలా అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సికింద్రాబాద్ తోపాటు కాచిగూడ, నాంపల్లి స్టేషన్లు సంక్రాంతికి ఊళ్లకు వెళ్లే తెలుగు రాష్ట్రాల ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు పోటెత్తుతున్నారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పొడుగున వాహనాలే కన్పిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో టోల్ గేట్ల దగ్గర సంక్రాంతి రష్ పెరిగింది. ఇవాళ్టి నుంచి పండుగ సెలవులు కావడంతో.. సొంత వాహనాల్లో పల్లెటూర్లకు బయల్దేరారు పట్నం ప్రజలు. సొంతూళ్లకు వెళ్లే వాహనదారులతో.. పంతంగి.. కొర్లపహాడ్.. కీసర.. టోల్ గేట్ల దగ్గర భారీగా ట్రాఫిక్ జాం అవుతోంది. హైదరాబాద్ విజయవాడ హైవేపై కిలోమీటర్ల మేర



వాహనాలు బారులు తీరాయి. ఒక్కో టోల్ గేట్ దాటేందుకు అరగంటకు పైనే పడుతోందంటున్నారు వాహనదారులు. రద్దీ పెరగడంతో స్థానిక పోలీసులు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఐదుగంటల వ్యవధిలో ఒక్క కీసర టోల్ ప్లాజా వద్ద ఆరువేల వాహనాలు వచ్చినట్లు టోల్‌ప్లాజా ప్రతినిధులు తెలిపారు. రద్దీ మరింత పెరగనున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు పోలీసులు.

కొత్త పాస్ పుస్తకాల పంపిణీ

పూర్తి స్థాయి సంస్కరణలతో వస్తున్న కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని మార్చి 11 నుంచే అమలు చేస్తామని సిఎం ప్రకటించారు. అదే రోజు మండల రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. రెవెన్యూ శాఖ పరిధిలోనే ఇకపై భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని కాబట్టి రెండు శాఖల మధ్య మరింత సమన్వయం సాధించడానికి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గా కొనసాగుతున్న వాకాటి కరుణకే రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సిఎం చెప్పారు.

కొత్త పాస్‌పుస్తకాల జారీ, రిజిస్ట్రేషన్ విధానంలో సంస్కరణలపై ప్రగతి భవన్ లో దాదాపు 8 గంటల పాటు శనివారం సుదీర్ఘ సమీక్ష జరిగింది. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సిఎం ముఖ్య కార్యదర్శులు ఎస్. నర్సింగ్ రావు, శాంత కుమారి, కార్యదర్శి స్మితా సభర్వాల్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారి, మీ సేవా కమిషనర్ జిటి వెంకటేశ్వరరావు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నమెంట్ జిఎం డి.శ్రీధర్, సీనియర్ మేనేజర్ సుధీర్ గోలి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించిన సమగ్ర భూ ప్రక్షాళన ద్వారా వచ్చిన ఫలితాలను ఈ సమావేశంలో విశ్లేషించారు.

తెలంగాణ భూ భాగం వివరాలు :

★1,12,077 చదరపు కిలోమీటర్లు : తెలంగాణ రాష్ట్ర మొత్తం భూభాగం

★2.80 కోట్ల ఎకరాలు: తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం భూభాగం

★1.42 కోట్ల ఎకరాలు: ఎలాంటి వివాదాలు లేని వ్యవసాయ భూమి

★17.89 లక్షల ఎకరాలు: కోర్టు కేసులు, వివాదాలు, చిక్కులు కలిగిన భూములు

★11.95 లక్షల ఎకరాలు: రైతుల వద్ద ఉన్న వ్యవసాయేతర భూములు

★84.00 లక్షల ఎకరాలు: చెరువులు, కుంటలు, కాలువలు, రైల్వే లైన్లు, సబ్ స్టేషన్లు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల కింద భూములు, కోర్టు కేసుల్లోని అటవీభూములు.

★24 లక్షల ఎకరాలు: నగరాలు, పట్టణాలు, గ్రామాల నివాస ప్రాంతాలు, వివాదాలు లేని అటవీభూమి

పార్ట్ ఎ విజయవంతం, త్వరలో పార్ట్ బి :

తెలంగాణ వ్యాప్తంగా వందరోజుల పాటు నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన పార్ట్ ఎ విజయవంతమైందని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లోని దాదాపు 90 శాతానికి పైగా భూముల విషయంలో స్పష్టత వచ్చిందని, ఏ భూమికి ఎవరు యజమానో తేలిందని సిఎం చెప్పారు. ఈ వివరాల ఆధారంగానే కొత్త పాస్ పుస్తకాల జారీ, పంట పెట్టుబడి మద్దతు పథకం అమలు చేస్తామని సిఎం చెప్పారు. కోర్టు కేసులు, ఇతర వివాదాలు, అభ్యంతరాలు కలిగిన భూములను పార్ట్ బిలో పరిష్కరిస్తామన్నారు. పార్ట్ బి



చేపట్టడానికి వీలుగా ప్రభుత్వం కొన్ని విధాన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని, త్వరలోనే కేబినెట్ సమావేశం నిర్వహించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం పార్ట్ బి ప్రక్షాళన కూడా నిర్వహిస్తామన్నారు. పార్ట్ ఎ ద్వారా లెక్కతేలిన భూములకు సంబంధించిన వ్యవసాయ ఖాతాలు దాదావు 71 లక్షలున్నాయని, వారందరికీ కొత్త పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు.

కోర్ బ్యాంకింగ్ తరహాలో ధరణి నిర్వహణ

రాష్ట్రంలోని ప్రతీ ఎకరం భూభాగం వివరాలు పొందుపరుస్తూ, ఎప్పటికప్పుడు చోటు చేసుకునే మార్పులను కూడా నమోదు చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల వెబ్ సైట్ ధరణిని కోర్ బ్యాంకింగ్ తరహాలో నిర్వహించనున్నట్లు సిఎం వెల్లడించారు. దీనికోసం ప్రత్యేకంగా ఐటి విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలు, పేరు మార్పిడి వివరాలు అదే రోజు ఈ ధరణిలో నమోదు అవుతాయని, మండల కార్యాలయం నుంచి మొదలుకుని రాష్ట్ర స్థాయిలో అన్ని చోట్ల ఈ వెబ్ సైట్ నుంచి వివరాలు తీసుకోవచ్చన్నారు. విదేశాల్లో ఉన్న వారు కూడా ధరణి ద్వారా అందే సమాచారంతో క్రయ, విక్రయాలు జరుపుకోవచ్చని వెల్లడించారు.

ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు:

రైతులు, ఇతర ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా ప్రతీ మండల రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రాష్ట్రంలో మొత్తం 584 మండలాలున్నాయి. ప్రస్తుతం 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వాటిని యధావిధిగా కొనసాగిస్తారు. ఈ 141 సబ్ రిజిస్ట్రార్ల పరిధి వారి కార్యాలయమున్న మండలానికే పరిమితం అవుతుంది. మిగతా 443 చోట్ల ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగిస్తారు. ఎమ్మార్వోలు తామిచ్చిన అపాయింట్మెంట్ తేదీలకు అనుగుణంగా శని, ఆదివారాలు, ఇతర సెలవులు మినహాయించి వారానికి ఐదు రోజులు ఉదయం పూట రిజిస్ట్రేషన్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమ్మార్వోలు హాజరుకాలేకపోతే, ఆ బాధ్యతలను డిప్యూటీ తహసిల్దార్లకు అప్పగిస్తారు.

అవినీతి, నకిలీలు, ఇబ్బది తొలగించడమే లక్ష్యం:

భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల నిర్వహణలో వందకు వంద శాతం పారదర్శకత సాధించడం, అవినీతి నిరోధించడం, నకిలీ పాస్ పుస్తకాలను అరికట్టడం లాంటి లక్ష్యాలతో సంస్కరణలు తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. రైతులు, ఇతర ప్రజలు తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పాలి. కేవలం ఒకే సారి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి రావాలి. పాస్ పుస్తకం వారి ఇంటికే కొరియర్ ద్వారా చేరాలి. ఎవరి వద్దకూ వెళ్లకుండానే తమ పని ఒక్కరోజులో పూర్తికావాలి. అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేని విధంగా రిజిస్ట్రేషన్ల విధానం ఉండాలి. నూటికి నూరుశాతం పారదర్శకంగా పనులు జరగాలి. నకిలీ పాసుపుస్తకాలు, ఇతర డాక్యుమెంట్లు సృష్టించడం పరిపాటి అయింది. నకిలీ పాసుపుస్తకాల ద్వారా రుణాలు పొంది ప్రభుత్వాన్ని కూడా మోసం చేసిన దాఖలాలున్నాయి. ఇకపై అలా సాధ్యం కాదు. భూ రికార్డుల నిర్వహణను ప్రభుత్వం కట్టుదిట్టంగా చేస్తుంది. అందుకోసమే సంస్కరణలు తీసుకొస్తున్నాం. ప్రతీ విషయం ధరణిలో నమోదవుతుంది.

ప్రతిపాదిత నూతన రిజిస్ట్రేషన్ విధానం :

★అమ్మే వారు, కొనేవారు పరస్పర అంగీకారానికి వచ్చిన తర్వాత సబ్ రిజిస్ట్రార్ ను అపాయింట్మెంట్ టైమ్ అడగాలి.

(పాస్ పోర్టులు, వాహన రిజిస్ట్రేషన్ల మాదిరిగా)

★భూమి అమ్మకానికి సంబంధించిన డాక్యుమెంటు తయారు చేయడానికి లైసెన్సుడు డాక్యుమెంటు రైటర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉంచుతారు. వారు ఫీజు తీసుకుని రాసిన కాగితాలను అనుమతిస్తారు.

★అమ్మేవారు/కొనేవారు తామే స్వయంగా డాక్యుమెంటు రాసుకున్నా అనుమతిస్తారు. దీనికోసం వారికి సంబంధిత ఫారాలు/టెంప్లేట్స్ అందుబాటులో ఉంచుతారు.

★అపాయింట్మెంట్ ఇచ్చిన తేదీ/సమయానికి అమ్మేవారు, కొనేవారు ఇద్దరూ తమ పాసుపుస్తకాలతో సబ్ రిజిస్ట్రార్ ముందు హాజరు కావాలి.

★ రిజిస్ట్రార్ తొలగిస్తారు. అదే సమయంలో కొన్న వారి పాస్ పుస్తకంలో నమోదు చేస్తారు. సబ్ రిజిస్ట్రార్ ముద్ర వేసి, సంతకం చేస్తారు.

★భూమిని కొత్తగా కొంటున్న వారయితే, కొత్త పాస్ పుస్తకం ఇస్తారు.

ట్రంప్ తక్షణమే క్షమాపణలు చెప్పాలి



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆఫ్రికన్ దేశాలు ఏకగ్రీవంగా ఐక్య రాజ్యసమితిలో క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశాయి. శుక్రవారం ట్రంప్ హైతీ, ఆఫ్రికా వంటి చెత్తదేశాల నుండి వచ్చే ఇమ్మిగ్రేషన్స్ అమెరికాకు అవసరంలేదని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆఫ్రికన్ దేశాలకు చెందిన యు ఎన్ రాయబారి అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు ట్రంప్ చేసిన జాత్యాంహంకార , జెనోఫోబిక్ వ్యాఖ్యలను మీడియా విస్తృతంగా నివేదించిందని, వాటిని ఖండిస్తున్నామని, ఐరాస సాక్షిగా ట్రంప్ క్షమాపణలు చెప్పాలని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై 54 ఆఫ్రికన్ దేశాలు అత్యవసర సమావేశం నిర్వహించిన అనంతరం వారు ఆఫ్రికన్ దేశాలపై, జాతివివక్ష వ్యాఖ్యలు సరికావని, ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన వారికి కృతజ్ఞతలు కూడా తెలిపారు. సుమారు నాలుగు గంటల చర్చ అనంతరం సమావేశం ఏకగ్రీవంగా ముగిసినట్లు తెలుస్తుంది.

మొదటి పేజీ తరువాయి

చంద్రగిరిని మరచిన బాబు

ఉన్న వ్యక్తి ఇదే చంద్రగిరి నుంచి బరిలోకి దిగితే 17,500 ఓట్లతో ఓటమి పాలయ్యాడు. ఇదే చంద్రగిరి నియోజకవర్గాన్ని చూడండి. సొంతవూరికి ఏదైనా చేయాలని కాస్తోకూస్తో గొప్పగా సెటిల్ అయిన ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు. విదేశాల్లో ఉన్న ఎన్నారైలు కూడా సొంత గడ్డకు ఏదైనా చేయాలని తపన పడతారు. డబ్బు పంపించి అభివృద్ధికి పాటుపడతారు. అలాంటిది 13 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు సొంతవూరు ఉండాల్సిన స్థితి ఇదా. చిన్నవయసులో చంద్రబాబు నారావారిపల్లె పక్కన ఉన్న శేషాపురం స్కూల్‌లో చదువుకున్నారు. ఇవాళ్టికి కూడా ఈ స్కూల్‌కు పిల్లలు వెళ్తున్నారు. గట్టిగా తుమ్మితే పడిపోయే దుస్థితిలో పాఠశాల ఉంది. ముఖ్యమంత్రి చదువుకున్న స్కూల్ పరిస్థితి ఇలావుంటే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మిగతా స్కూళ్ల పరిస్థితి ఏంటి, వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు చంద్రగిరిలో వంద పడకల ఆసుపత్రి నిర్మించడం కోసం జీవోను జారీ చేశారు. ఆ తర్వాత దురదృష్టం వల్ల మన మధ్య నుంచి వెళ్లిపోయారు. ఇప్పటికీ జీవో ఉంది. కానీ, చంద్రబాబు దాన్ని పట్టించుకోరు. చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం 138 పంచాయితీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో డెబ్బై శాతం తాగునీరు కొరత ఉంది. దీన్నిబట్టి చంద్రబాబు పరిపాలన ఎలా ఉందో తెలుస్తుంది. ప్రతి ఏటా చంద్రగిరిలోని కొన్ని మండలాల్లో ఏనుగులు బీభత్సం చేస్తూ ఉంటాయి. కనీసం ఒక్కసారైనా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చంద్రబాబు దమ్మిడి సాయం చేశాడా.

ఒక వైపు వేలాదిగా నాతో కలసి అడుగులో అడుగులు వేస్తున్నారు. మరో వైపు భరోసా ఇచ్చేందుకు వచ్చిన నాకే భరోసా కల్పిస్తూ చాలా మంది అడుగులో అడుగులు వేస్తున్నారు. ఇలా నడిరోడ్డుపై నిలవాల్సిన అవసరం ఏ ఒక్కరికి లేదు. అయినా కూడా కిలోమీటర్ల మేర నాతో నడుస్తూ చిక్కటి చిరునవ్వులతో ఆప్యాయత పంచుతున్నారు. అందరికి ముందుగా చేతులు జోడించి శిరస్సు వంచి పేరు పేరున హృదయపూర్వకంగా కృతజ్ఞతలు. దాదాపుగా నాలుగు సంవత్సరాల చంద్రబాబు పాలనను చూశారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరుగబోతున్నాయని చంద్రబాబు తన కార్యకర్తలతో ఊదరగొడుతున్నారు. ఈ పాలన మీరంతా చూశారు. ఒక్కసారి మీ గుండెల మీద చేతులు వేసుకొని సంతోషంగా ఉన్నారో లేదో ఆలోచించండి. రాష్ట్రంలో ఇవాళ ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. రైతులు, అక్కాచెల్లెమ్మలు, అవ్వతాతలు, చదువుకుంటున్న పిల్లలు సంతోషంగా లేరు. ఇదే జిల్లాలో చెరకు పంట ఎక్కువ వేస్తారు. ఇవాళ చెరుకు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. జిల్లాలో రెండు చక్కెర ఫ్యాక్టరీలు సహకార రంగంలో ఉన్నాయి. ఇవి కాక నాలుగు ప్రైవేట్ ఫ్యాక్టరీలు ఇవే జిల్లాలో ఉన్నాయి. ఎప్పుడు చంద్రబాబు సీఎం అవుతారో అప్పుడు చెరకు పరిశ్రమలు మూత పడుతున్నాయి. తొమ్మిది ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఆ ఫ్యాక్టరీలు మూత పడితే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి డబ్బులు సాయం చేసి ఆ ఫ్యాక్టరీలు తెరిపించారు. మళ్లీ మన ఖర్మకొద్దీ బాబు సీఎం అయ్యారు. మళ్లీ రెండు చెరకు పరిశ్రమలు మూత పడ్డాయి. కోఆపరేటివ్ రంగంలోని పరిశ్రమలు రైతుల గురించి ఆలోచిస్తాయి. కానీ చంద్రబాబు ఈ రెండు ప్యాక్టరీలు మూయించారు. కానీ ప్రైవేట్ రంగంలోని నాలుగు పరిశ్రమలు లాభాల్లో నడుస్తున్నాయి. చెరకు పరిశ్రమలు మూత వేయించడమే కాదు బెల్లం తయారీ చేయకుండా ఆంక్షలు విధిస్తున్నారు. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల రుణాలన్నీ మాఫీ చేస్తానన్నాడు. కర్ణాటకలో రూ.7 తక్కువకు పెట్రోలు పోస్తున్నారు.

ముందస్తుకు మేం రెడీ

అభిప్రాయపడ్డారు. పంచాయతీరాజ్ చట్టం కోసం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశమయ్యే అవకాశం ఉందని మంత్రి కేటీఆర్ తెలిపారు. పీఆర్ చట్టం కోసం అఖిలపక్షం అవసరంలేదన్న ఆయన.. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు మాట్లాడొచ్చునని పేర్కొన్నారు. ఇటీవల గవర్నర్, కాంగ్రెస్ నేతల మధ్య జరిగిన సంవాదంపై స్పందించిన కేటీఆర్.. ఇసుక తవ్వకాలపై ప్రభుత్వం ముందే గవర్నర్‌కు నివేదించిందన్నారు. కలెక్టర్, ఎస్పీలను సంప్రదించి గవర్నర్ సమాచారం తీసుకున్నారని తెలిపారు. మూడేళ్లలో ఇసుక మైనింగ్‌లో రూ.1300కోట్ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

మేం కష్టాల్లో ఉన్నప్పుడు ఏపీ ఇవ్వలేదు

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తరువాత తెలంగాణ తీవ్ర విద్యుత్ కొరతను ఎదుర్కొందని మంత్రి కేటీఆర్ చెప్పారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఏపీ కరెంట్ ఇవ్వలేదని, ప్రత్యామ్నాయ ఒప్పందాలు చేసుకున్న తరువాత విద్యుత్ ఇస్తామంటూ ముందుకొస్తే తాము చేసేదేముంటుందని అన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా పథకాన్ని ఎంతో ఘనంగా ప్రారంభించింది. ఓవైపు ఈ పథకం విజయవంతం అయిందని అధికార పక్షం సంబరపడిపోతుండగా.. మరోవైపు విద్యుత్ కొనుగోలులో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రతిపక్ష నేతల ఆరోపణలపై స్పందించిన మంత్రి కేటీఆర్.. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే కాంగ్రెస్ నేతలు ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఏపీ విద్యుత్ ఇస్తామన్నా తెలంగాణ ప్రభుత్వం తీసుకోలేదంటూ కాంగ్రెస్ నేతలు పదే పదే చేస్తున్న ఆరోపణలను కూడా ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇవ్వకుండా.. అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక ఇస్తామంటే ఏం చేసుకోవాలని ప్రతిపక్షాలను ఎదురు ప్రశ్నించారు.

చిప్పకూడు తిన్నోడు అవినీతి గురించి మాట్లాడటమా?

జైలులో చిప్పకూడు తిన్నవారూ అవినీతి గురించి మాట్లాడితే స్పందించాల్సిన అవసరం తమకు లేదని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభమైన నాటి నుంచి టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. తాజాగా కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి విద్యుత్ రంగంలో అవినీతి చోటుచేసుకుందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దీనిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని, ప్రభుత్వం సిద్ధమా? అంటూ సవాళ్లు విసిరారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి కేటీఆర్.. అవినీతి నాయకుడి సవాళ్లకు తాము స్పందించాల్సిన అవసరం లేదన్నారు.



నిర్ణీత గడువులోగా రహదార్లు పూర్తి చేయాలి

ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి

విజయవాడ, సూర్య బ్యూరో : రాజధాని అమరావతిలో జరుగుతున్న రహదార్ల నిర్మాణాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని గుత్తేదారు సంస్థలు పనుల్లో మరింత వేగం పెంచాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) సీఎండీ డి.లక్ష్మీ పార్థసారథి ఆదేశించారు. ప్యాకేజీ13లో జరుగుతున్న రహదార్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. కృష్ణాయపాలెం నుంచి నెక్కల్లు వరకు 14 కి.మీ.ల దూరంలో జరుగుతున్న ఇ8 రహదారి నిర్మాణాన్ని పరిశీలించిన ఆమె పనులు మందకొడిగా సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రోడ్డు వెంబడి విట్, అమరావతి సెంట్రల్ పార్క్ నిర్మాణాలు జరుగుతున్నందున ప్రామాణికంగా తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కృష్ణా కరకట్ట నుంచి నిడమర్రు వరకు నిర్మిస్తున్న ఎన్10 తాళ్ళాయిపాలెం నుంచి నిడమర్రు వరకు నిర్మాణంలో వున్న ఎన్8 రహదార్లు, వాటి మధ్యలో జరుగుతున్న పలు ప్రధాన వంతెనల నిర్మాణాలకు కలుగుతున్న ఆటంకాలను గుత్తేదారులను అడిగి తెలుసుకున్నారు. వాటి నిర్మాణాలకు ఎక్కడా ఇబ్బందులు లేనందున పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని గుత్తేదారులు, అధికారులను ప్రశ్నించారు. ఫిబ్రవరిలోపు రహదార్ల నిర్మాణాలను నూరు శాతం పూర్తిచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో ఏడీసీ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎం.వి.సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నరసింహమూర్తి, డిఈఈలు వీరనారాయణ, ఎలెన్గోవను తదితరులున్నారు.

నిఘూలేక నిలువునా దగా

- తెలుగు రాష్ట్రాల ఖజానాకు 'చైనా'కన్నం
- అడ్డదారిలో ఎలక్ట్రానిక్ పరికరాల రవాణా

(హైదరాబాద్, క్రైం బ్యూరో)‌: చైనాలో ఉత్పత్తి అవుతున్న ఎలక్ట్రానిక్ పరికరాలు అడ్డదారుల్లో దేశ సరిహద్దులు దాటి తెలుగు రాష్ట్రాలకు చేరుతుండటంతో ప్రభుత్వాల ఖజానాకు గండిపడుతోంది. దీర్ఘకాలంగా రెండు రాష్ట్రాలలో చైనాకు చెందిన వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలు పెద్ద సంఖ్యలు చేరుతున్నాయి. గతంలో సెల్‌ఫోన్లు క్యాలిక్యులేటర్లు, సేవింగ్ టూల్స్ వంటివి వస్తుండగా తాజాగా పరిస్థితి మారింది. ట్యూబ్‌లైట్లు, ఐప్యాడ్స్, డివిడి, విసిడి, ఎల్‌సిడిలతో పాటు లక్షలాది రూపాయల విలువ చేసే కెమెరా లెన్స్ సైతం దర్శనమిస్తున్నాయి. ఇక సెల్‌ఫోన్ల విషయంలో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అత్యాధునిక టెక్నాలజీతో తయారైన పరికరాలు రాష్ట్రంలోని ఎలక్ట్రానిక్ మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. బ్రాండెడ్ పరికరాలతో పోలిస్తే ధరలో ఎంతో వ్యత్యాసం ఉండటం, సరికొత్త ఫ్యూచర్లు ఉండటంతో వినియోగదారులు వీటిపై మక్కువ చూపుతున్నారు. మన్నిక విషయం పక్కన పెడితే చైనా ఉత్పత్తుల పట్ల వినియోగ దారులు ఆకర్షితులవుతున్నారు. అయితే దీని వల్ల కోట్ల రూపాయలలో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. వీటిని నియంత్రించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతో భారీ స్థాయిలో అమ్మకాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల అమ్మకాలు జోరుగాసాగుతున్నాయి. తిరుపతి, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎక్కువగా చెన్నై మార్కెట్‌పై ఆధారపడుతుంటారు. ఏ ఎలక్ట్రానిక్ వస్తువైనా చెన్నైయ్‌లో సుమారు 30నుంచి 40శాతం వరకు తక్కువకు లభిస్తుంది. క్యాలుక్యులేటర్ నుంచి విసిడి, ఎల్‌సిడిల వరకు ఏ వస్తువైనా బిల్లు లేకుండా లభిస్తుంది. అదేవిధంగా సింగపూర్ తదితర ప్రాంతాలకు చెందిన వస్తువులు ఇక్కడ లభిస్తున్నాయి. నెల్లూరు, తిరుపతిల నుంచి రవాణా సౌకర్యాలు అధికంగా ఉండటంతో ఇక్కడి నుంచి సరుకులను తీసుకురావడంలో ఎటువంటి ఇబ్బందులు కలగడంలేదు. ఇక అనంతపురం, కర్నూలు, కడప తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు బెంగళూరుపై ఆధారపడుతుంటారు. ఎలక్ట్రానిక్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో అతితక్కువ ధరకు విదేశీ ఉత్పత్తులు లభ్యమౌతాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడికి తరచూ వస్తుండటంతో ఇక్కడి అమ్మకాలు జోరందుకుంటున్నాయి. ఇక్కడి నుంచి కడప,కర్నూలు ప్రాంతాలకు కూడా ఎలక్ట్రానిక్ పరికరాలు రవాణా అవుతుంటాయి. అలాగే విశాఖపట్నం, విజయవాడల్లో ఎలక్ట్రానిక్ వస్తువులకు ప్రత్యేక మార్కెట్ ఉంది. ఇక్కడి కస్టమ్స్ డ్యూటీ చెల్లించిన వస్తువులు



బహిరంగగానే విక్రయాలు సాగిస్తున్నారు. రాష్ట్రంలోని సుమారు పది జిల్లాల్లో ఈ రెండు జిల్లాలపై ఆధారపడి ఎలక్ట్రానిక్ వ్యాపారాన్ని సాగిస్తుంటాయి. అయితే ఇక్కడ విక్రయించే వస్తువుల్లో సగానికి పైగా నాన్ డ్యూటీ పెయిడ్ వస్తువులే ఉండటం గమనార్హం. హైదరాబాద్‌లోని కోఠి, అబిడ్స్ సమీపంలోని ఎలక్ట్రానిక్ బజార్‌లు స్మగుల్డ్ గూడ్స్‌కు అడ్డాగా ఉన్నాయనడం అతిశయోక్తికాదు. సికింద్రాబాద్ ప్రాంతంలో ఇటీవల కాలంలో పెద్ద మొత్తంలో ఈ తరహా వ స్తువుల విక్రయాలు సాగిస్తున్నారు. భారతదేశంలో లభించే బ్రాండెడ్ వస్తువుల కంటే సగం ధరకు అంతకంటే తక్కువ ధరకు పరికరాలు లభ్యమవుతున్నాయి. అలాగే ఫ్యూచర్ల విషయంలోని అధికంగా ఉన్నకారణంగా వినియోగదారులు ఎగబడి కొంటున్నారు. ప్రస్తుతం కంపెనీ ఐపాడ్ కొనాలంటే 20నుంచి 35వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే నాన్‌డ్యూటీ పెయిడ్ టాబ్లెట్లు కేవలం 13నుంచి 15వేల రూపాయలకు లభ్యమవుతున్నాయి. ఫ్యూచర్స్‌లోనూ బ్రాండెడ్ వస్తువుల కంటే ఒక అడుగు ముందే ఉంటున్నాయి. కొత్త ఫ్యూచర్లు ఇందులో దర్శనమిస్తున్నాయి. అయితే మన్నిక విషయంలో ఎటువంటి గ్యారెంటీ ఉండదు. సాధారణంగా బ్రాండెడ్ వస్తువులు కూడా పాడైతే ఒక పట్టాన తిరిగి పూర్తిస్థాయిలో మరమ్మతుకు నోచుకోవు. అయితే సర్వీసు సెంటర్లు ఉండటంతో కొంత వినియోగ దారునికి భరోసా ఉంటుంది. అయితే చైనా ఉత్పత్తుల విషయంలో ఒకసారి పాడైన ఎలక్ట్రానిక్ వస్తువు పారేయడం కంటే వేరే దారి ఉండదు. అయితే పనిచేసినంతకాలం అద్భుతంగా సేవలందిస్తుంది. ఇక కెమరాలకు అధునికమైన, అత్యంత శక్తివంతమైన లెన్స్‌లను అమర్చుతుంటారు. మోడలింగ్, జర్నలిజం, చలనచిత్రం తదితర రంగాలకు చెందిన టెక్నీషియన్లు ఖరీదైన లెన్స్‌లను వాడక తప్పదు. కంపెనీవి కొనుగోలు చేయాలంటే లక్ష రూపాయల నుంచి 3లక్షల వరకు వీటి ధరలుంటాయి. అయితే స్మగుల్డ్ గూడ్స్‌పై ఆధారపడితే కేవలం 80వేల రూపాయల్లో సరిపోతుంది. దీంతో పలువురు కెమరామెన్‌లు, టెక్నీషియన్లు ఇటువంటి పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో నిత్యం కోట్లాది రూపాయల మేరకు అమ్మకాలు జరుగుతుండటంతో ప్రభుత్వ ఖజానా ఆదాయానికి భారీగా గండి పడుతోంది. కొన్ని సందర్భాల్లో సెంట్రల్ ఎక్సైజ్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నప్పటికీ వీటి మూలాలు మాత్రం పట్టుకోలేకపోతున్నారు. కేవలం సరుకును రవాణా చేసే వ్యక్తులు, చిల్లరగా విక్రయాలు సాగించే వర్తకులను వీరు అరెస్టు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని డిఆర్‌ఐ అధికారులు ఇదివరలో సుమారు కోటిన్నర రూపాయల విలువ కలిగిన కెమరా లెన్స్‌లను, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. అంతేకాని వీరి వెనుక ఉన్న ముఠాను పట్టుకోవడంలో ఏమాత్రం దృష్టిసారించలేదన్న ఆరోపణలు వెంటాడుతున్నాయి. పైగా ఈ విభాగంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో లోతైన దర్యాప్తు చేయకుండానే కేసు ముగించారు. చైనాలో ఆధునిక పరిజ్ఞానం కలిగిన ఎలక్ట్రానిక్ పరికరాలను అతి తక్కువ వ్యయంతో తయారు చేస్తున్నారు. ఇప్పటికే చైనా ఉత్పత్తులు ప్రపంచ దేశాల మార్కెట్‌కు సవాల్‌గా నిలిచాయి. ఏ వస్తువైనా అతితక్కువ ధరలకు ఉత్పత్తి చేస్తూ చైనా ఎప్పటికప్పుడు తన ఘనత చాటుకుంటూనే ఉంది. ఇదిలావుండగా చైనా ఉత్పత్తులకు ఇతర దేశాల్లో సైతం మార్కెట్ ఉండటం, అడ్డదారుల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు తరలించడం వల్ల ఇతర దేశాలకు భారీ మొత్తంలో సుంకాలు చెల్లించే అవసరం లేకపోవడంతో అక్కడి ఉత్పత్తు తరలింపునకు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. చైనా నుంచి నేపాల్ మీదుగా భారతదేశానికి పెద్ద సంఖ్యలో చైనా ఉత్పత్తులు చేరిపోతున్నాయి. కొందరు స్మగ్లర్లు కేవలం ఈ అక్రమ రవాణాపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నేపాల్ నుంచి భారత దేశంలోకి వ చ్చే పౌరులు సుమారు 25వేల రూపాయల పరికరాలను తీసుకు రావచ్చు. ఈ నిబంధనను అడ్డుపెట్టుకుని స్మగ్లర్లు తమ ఉత్పత్తులను ప్రయాణీకుల ద్వారా ఇక్కడకు చేరవేస్తున్నారు. మరోపక్క సముద్ర మార్గం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పోర్టులకు విదేశీ వస్తువులు దిగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా నెల్లూరు చెన్నయ్ మార్గంలో తడ వద్ద చక్‌పోస్టు ఉన్నప్పటికీ అది కాస్త అవినీతి కూపంలో కూరకుపోయిన కారణంగా అక్రమరవాణాకు రహదారిగా మారింది. ఈ అక్రమ వ్యాపారం కారణంగా ఒకపక్క ప్రభుత్వ ఖజానాకు గండిపడటమే కాకుండా మరోపక్క దేశీయ ఉత్పత్తి సంస్థలు సంక్షభాన్ని తాళలేక మూతకు గురవుతున్నాయి. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలకు చెందిన సంబంధిత అధికారులు చైనా వస్తువుల తరలింపుపై నిఘా సారించాలని పలువురు కోరుతున్నారు.

అన్ని నియోజకవర్గాల్లో బూత్ కమిటీలు



సూర్య జనరల్ బ్యూరో అమరావతి: గుంటూరు జిల్లాలో ఉన్న అన్ని నియోజక వర్గాల్లో బూత్ కమిటీలు నియమించడం జరిగింది. మా అధి నాయకుడి నిర్ణయం మేరకు ప్రతి జిల్లాలో పక్క ప్రణాళిక రూపొందిస్తున్నాం జన్మభూమి కార్యక్రమంలో పెన్షన్స్ ఇస్తున్నాం ఇల్లు మంజూరు చేస్తున్నాం ఊక దంపుడు ప్రసంగాలు చేస్తున్నారు. పేద వర్గాలకు న్యాయం జరగడం లేదు. ఇప్పటికే సుమారుగా 10లక్షల దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. మరలా ఇప్పుడు 5 లక్షల పక్క గ హ నిర్మాణం చేస్తున్నాం అని చెప్తూ ప్రజలను మభ్య పెడుతున్నారు. ప్రజలు చిదరించుకుంటున్న ఇంకా దరఖాస్తులు స్వీకరిస్తూనే ఉన్నారు. కల్తీ వ్యాపారంని కేరాఫ్ గుంటూరుగా మార్చిన ఘనత మంత్రులదే నని ఆయన ఆరోపించారు దాని వెనక ప్రతి దానిలో వమ్యుల హస్తం ఉండే దౌర్భాగ్యం రోజు పేపర్ లో చూస్తూనే ఉన్నాం గుంటూరు అడ్డాగా పేదరికం పై కూడా వ్యాపారం చేస్తున్నారు సాక్షాత్తూ కిడ్నీ లు అమ్ముకునే స్థాయికి ఈ ప్రభుత్వం తీసుకెళుతుందని అన్నారు. చంద్రబాబు హయాంలోనే కిడ్నీలు అమ్ముకునే పరిస్థితి దాపురించింది. ఈ విధంగా మధ్య తరగతి వారిపై ఈ ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఈ కిడ్నీ రాకెట్ పై విచారణ చేసి దీనికి సంబంధించిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శాసనమండలి ప్రతిపక్షం నేత శ్రీ **ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మీడియా పాయింట్స్**

జన్మభూమి కార్యక్రమాలు పేరుతో ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ముఖ్యమంత్రి అధికారం లోకి రాగానే అన్ని సంబంధిత అధికారులకు చెప్పిన విధంగా టిడిపి నాయకుల వస్తే ఏపని అయిన చేసి పెట్టండి అన్నట్లుగా జన్మభూమి కార్యక్రమం సాగుతుంది. బిటి విత్తనాల వేసి రైతులు నష్టపోతుంటే ప్రభుత్వం ఎందుకు బిటి విత్తనాల యాజమాన్యాల పై చర్యలు తీసుకోలేక పోతుందనే విషయం అర్థం కావట్లేదు

ఒకపక్క రైతులు నష్టపోతూ ఇబ్బంది పడతావుంటే వారికి సమస్యల పై ద ష్టి పెట్టకుండా వారిని ధనవంతులు చేస్తామని చెప్తూ మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు కోన రఘుపతి,%ఎం% ముస్తఫా, గుంటూరు, నరసరావుపేట, బాపట్ల పార్లమెంటరీ అధ్యక్షులు రావి వెంకటరమణ,అంబటి రాంబాబు, మోపిదేవి వెంకటరమణ, గుంటూరు పార్లిమెంటరీ ఇంచార్జి లావు శ్రీకృష్ణదేవరాయలు, సమన్వయకర్తలు మరి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డి, అన్నబత్తుని శివకుమార్,బొల్లా బ్రహ్మనాయుడు, కావాటి మనోహర నాయుడు , కత్తెర హెని క్రిస్టినా,మెరుగు నాగార్జున,కాసు మహేష్ రెడ్డి,కీలరి రోశయ్య,ఆతుకూరి ఆంజనేయులు, జంగా క ష్ణ, టీ. జి. వి.క ష్ణారెడ్డి చీవుపల్లి మోహన్ రావు,దోతబోయిన వేమరెడ్డి, మందపాటి శేషగిరి రావు, డైమండ్ బాబు, బండారు సాయిబాబు,ఆళ్ల పూర్ణచంద్ర రావు,షైక్ గులాం రసూల్,నజీర్ అహ్మద్,అంగడి శ్రీను, పోలూరి వెంకటరెడ్డి, బోనిగాల వేణు ప్రసాద్, మెట్టు వెంకటప్పరెడ్డి, కొలకలూరి కోటేశ్వరరావు,కొండ శివ ప్రసాద్ రెడ్డి,మాదిరెడ్డి శ్రీనివాస రెడ్డి,రఘాసి,షైక్ జీలని,కొండ,ఆనంద్ భాస్కర్,నూనె ఉమామహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఉనికి చాటుకున్న డ్రగ్ మాఫియా

రాజేంద్రనగర్, మేజర్‌న్యూస్ : డ్రగ్స్‌పై రాష్ట్ర ఎక్సైజ్, పోలీసు శాఖలు యుద్ధం ప్రకటిస్తే నగరంలో మాత్రం డ్రగ్స్ మాఫీయా మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లుతుంది. నగరాలు, జిల్లాలు దాటి ఏకంగా ఇతర రాష్ట్రాల నుంచే డ్రగ్స్ సరఫరా కావడం పోలీసులను దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. డ్రగ్స్ మాఫీయా దారులన్నీ మూసేశామని పోలీసులు తెలుపుతున్నప్పటికీ ఏదో ఒక మార్గంలో డ్రగ్స్‌ను నగరానికి రప్పించి విక్రయిస్తుండడంతో పోలీసులు నివ్వెరపోతున్నారు. తమ సాయశక్తులా డ్రగ్స్‌ను అరికట్టేందుకు యత్నిస్తున్నప్పటికీ తమ తెలివి తేటలు వినియోగించుకొని నగరానికి డ్రగ్స్ సరఫరా చేసి విక్రయిస్తున్నారంటే ఏ స్థాయిలో డ్రగ్స్ మహ మ్మారి నగరంలో పాతుకు పోయిందో ఇట్టే అర్థం అవుతుంది. నగరంలో డ్రగ్స్ కదలికలు కనమరుగవుతున్నాయని సామాన్య జీవి సంతోషం పడుతున్న నేపథ్యంలో శనివారం మరో డ్రగ్స్ మాఫీయా గుట్టు రట్టయ్యింది. శంషాబాద్, బాలానగర్ ఎస్‌వోటి పోలీసులు, రాజేంద్రనగర్, షాద్‌నగర్ పోలీసులు సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు. శనివారం రాజేంద్ర నగర్ ఏసీపీ కార్యాలయంలో శంషాబాద్ డీసీపీ పద్మజారెడ్డి, ఏసీపీ అశోక్‌లు వివరాలను వెల్లడించారు. కడప జిల్లా రాజంపేటకు చెందిన యెల్లంపల్లి లోకేష్(20), అనంతపూర్‌కు

చాపకింద నీరులా విస్తరించిన వ్యాపారం



ఆముదాలకుంటకు చెందిన కమ్మదూరి సురేష్‌రెడ్డి(20), అనంతపూర్ కల్యాణదుర్గం ప్రాంతానికి చెందిన రత్నాకాటం దినకర్ అలియాస్ అరుణ్ కుమార్(21) కడప జిల్లా రాయచోటి జిల్లాకు చెందిన గోర్లమండేటి నేతాజీ(22) లు ఈజీ మనీకోసం గ్రూపులా ఏర్పడ్డారు. అనంతపూర్ యెల్లునూరుకు చెందిన దాసరిబాబు(38) తో కలిసి (జిహెచ్‌బీ) గామా హైడ్రాక్సీ బ్యూటరేట్ (నార్కోటిక్ డ్రగ్)ను నగరానికి గుట్టుచప్పుడు కాకుండా తీసుకువస్తున్నారు. నగరంలోని కొంత మందికి ప్రత్యేకంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగా శనివారం ఎస్‌వోటీ, పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1.810 కేజీల నార్కోటిక్ డ్రగ్, ఒక మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారు, టాటా ఇండికా విస్టా కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ విలువ రూ.14.50 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. వీరితో పాటు నలుగురు అనంతపూర్ జిల్లాకు చెందిన దాసరిబాబు(38), కడప జిల్లాకు చెందిన పెద్ద యెల్లప్పగిరి శ్రీధర్‌రెడ్డి(35), అదే ప్రాంతానికి చెందిన మల్లెపల్లి మహేందర్(29), రామగోని అమర్‌నాథ్(31)లను షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. దాసరి బాబుపై గతంలో తాడిపత్రి, ప్రొద్దుటూరు, అనంతపూర్, యెల్లనూర్ పోలీసుస్టేషన్లలో కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గౌడ సంఘం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది



భానుపురి,మేజర్‌న్యూస్: గౌడ సంఘం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, గౌడ సంఘ నాయకులు అంత ఏకంకావాలని జిల్లా సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాయిగౌతమి జూనియర్ కళశాలలో జరిగిన జిల్లా ప్రైవేట్ గౌడ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణలో ముఖ్యఅతిదిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాల వారికి కావలసిన విధంగా పథకాలు అందిస్తుందని గౌడ సంఘంలో సమస్యలను అందరు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకొవాలన్నారు. ఈకార్యక్రమంలో గొపగాని వెంకటనారాయణగౌడ్, మారిపెద్ది శ్రీనువాస్‌గౌడ్, శనగాని రాంబాబుగౌడ్, బైరు వెంకన్నగౌడ్, బి. యాదగిరిగౌడ్, కక్కిరేణి సత్యనారాయణ, గిరిగౌడ్, రాంమూర్తిగౌడ్, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కట్ట యాదగిరిగౌడ్, బిక్షపతిగౌడ్, అంజయ్యగౌడ్, నాగరాజుగౌడ్, మలేష్, నర్సయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భానుపురిలో ముగ్గుల సందడి

సూర్యాపేటటౌన్,మేజర్‌న్యూస్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు వార్డులలో ముగ్గుల పోటిలతో సందడి నెలకొన్నంది. స్థానిక 26వ వార్డులోని చంద్రన్నకుంటలో గాయత్రి నర్సింగ్‌హోం ఆద్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిలుగా వార్డుకౌన్సిలర్ పోలేబోయిన రాధికనర్సయ్యయాదవ్, డా,, రాంమూర్తి లు పాల్గొనారు. ఈసందర్బంగా ముగ్గులలో ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెల, మేకల పెంపకదారుల అధ్యక్షులు పోలేబోయిన నర్సయ్యయాదవ్, అనంతుల మురళి, సోమమ్మ, అడ్వకేట్స్ ఊర గాయత్రి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

29వ వార్డులో...

సంక్రాంతి పండగ సందర్బంగా వార్డు కౌన్సిలర్ షాహిన్‌బేగం ఆద్వర్యంలో తాళ్ళగడ్డలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పటేల్ రమేష్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అంజద్అలీ, షేఫి, కౌన్సిలర్ వల్దాస్ దేవేందర్, నాయకులు వెలుగు వెంకన్న, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీమాస్ ఆద్వర్యంలో...

స్థానిక 4వ వార్డులో టీమాస్ ఆద్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి టీమాస్ జిల్లా అధ్యక్షులు వసంత సత్యనారాయణపిళ్ళే



ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేసి పలువురిని అక ట్టుకున్నారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, పి. పెంటయ్య, కోట గోపి, వి. రవి, ఖాలేద్, యాకలక్ష్మి తదిత రులు పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా నిలవాలి

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి చినరాజప్ప



పెద్దాపురం,సూర్యబ్యూరో: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో యువత కృషి చేయాలని తద్వారా మిగిలిన వారందరికీ ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని గోరింట గ్రామంలో జీడీవె యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి పనులను శని వారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై యువతకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రూ.5లక్షల వ్యయంతో గ్రామానికి రెండు వైపుల ఏర్పాటు చేసిన మొక్కల ప్లాంటేషన్‌ను చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలను ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సమాజం పట్ల యువత బాధ్యత కలిగి ఉండాలని పేర్కొన్నారు.

రైలు కిందపడి హొంగార్డు కుటుంబం ఆత్మహత్య



ఖమ్మం,మేజర్‌న్యూస్ : ఖమ్మం జిల్లాలోని చర్చి కాంపౌండ్ వద్ద ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. అక్కడున్న రైలు పట్టాల వద్ద మృత దేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఈ ముగ్గురు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతులను కల్లూరు మండలానికి చెందిన కాశీవిశ్వనాథ్(40), ఆయన కుమారులు జయంత్(13), అజయ్ కుమార్(12)గా పోలీసులు గుర్తించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాశీనాథ్.. హోంగార్డుగా పని చేస్తున్నాడు. వీరి ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాశీనాథ్, ఆయన కుమారుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి



హైదరాబాద్,మేజర్‌న్యూస్: సికింద్రాబాద్ జేమ్స్ స్ట్రీట్ రైల్వే పట్టాలపై ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఉప్పల్‌కు చెందిన కృష్ణ వర్ధన్ రెడ్డి రామంతపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం నాడు తెల్లవారు జామున 3 గంటలకు ఆఫీస్ నుండి బయటకు వెళ్లిన కృష్ణ రైలు ప్టాల్పై విగతజీవుడై పడి ఉండటంపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.అయితే కృష్ణ వర్ధన్ రెడ్డి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడి సెల్‌ఫోన్ అమీర్‌పేటలో లభించడం.. రాత్రి స్నేహితుడిని డబ్బుల కోసం బ్యాగ్ అడగటం తదితర అంశాలు మిస్టరీగా మారాయి. తనకు తెలిసిన వారికి కృష్ణ చిన్న మొత్తంలో ఫైనాన్స్ ఇస్తున్నట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. కాగా మృతి చెందిన రోజు రాత్రి ఓ అమ్మాయి కృష్ణ ఇంట్లో ఉన్నాడా అని ఫోన్ చేసిందని మృతుడి తల్లి చెబుతున్నారు. అతడి మృతికి కారణం ప్రేమ వ్యవహారమా? లేదంటే ఆర్థిక వ్యవహారాలా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. తన కుమారుడిని ఎవరో హత్యచేసి రైలు పట్టాలపై పారేశారని మృతుడి తల్లి ఆరోపిస్తున్నారు.

హైటెక్ వ్యభిచార ముఠా గుట్టురట్టు

పోలీసులకు పట్టుబడ్డ రష్యా యువతి



హైదరాబాద్,మేజర్‌న్యూస్‌: వ్యభిచారం నిర్వహిస్తున్న స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి చెర నుంచి ఓ రష్యన్ యువతితో సహా మరో ఇద్దరిని విడిపించారు. పోలీసులు ప్రకారం చెన్నయ్ కోడంబాక్కం ప్రాంతానికి చెందిన కురియన్ తారాయి జాకబ్ అలియాస్ అలెక్స్ టోనీ 2001లో హైదరాబాద్‌కు చేరుకున్నాడు. ఆదాయం సరిపోక చెన్నయ్‌లో స్థిరపడ్డ అనంతపూర్ నివాసి రాఘవేంద్రరెడ్డి (30)తో కలిసి బంజారాహిల్స్‌లో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని బ్రోతల్ హౌజ్ నిర్వహించసాగారు. ఈ క్రమంలో 2011లో కురియన్ తారాయి ఓసారి బంజారాహిల్స్ పోలీసులకు చిక్కి జైలుకెళ్లొచ్చాడు.

అయినా తన ప్రవర్తన మార్చుకోకుండా ఈసారి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా మండపేట నివాసి యామల మెర్రి, బిహార్‌కు చెందిన పంకజ్ కుమార్ మండల్‌తో కలిసి బంజారాహిల్స్-రోడ్ నెంబర్ 12లో రెండు ఇళ్లు అద్దెకు తీసుకుని మళ్లీ వ్యాపారం ప్రారంభించాడు. ఒక్కో కస్టమర్ నుంచి కనీసం 10 వేల రూపాయల చొప్పున వసూలు చేసేవాడు. కురియన్ తారాయి ఢిల్లీ, ముంబై, కోల్‌కతాతోపాటు రష్యా దేశం నుంచి కూడా సెక్స్ వర్కర్లను రోజుకు 16 వేల రూపాయలు ఇస్తానని కాంట్రాక్టు మీద తీసుకొచ్చేవాడు. ఈ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆయా గృహాలపై దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులనూ అరెస్టు చేసి, రష్యన్ యువతితో సహా మరో ఇద్దరిని రక్షించారు. వారి నుంచి 40 వేల నగదు, రష్యన్ యువతి పాస్‌పోర్టు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు.

నిరంతర విద్యుత్ వల్ల రైతులకు నష్టం



సూర్యాపేటటౌన్,మేజర్‌న్యూస్: తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఉచిత 24గంటల విద్యుత్ వలన రైతులకు నష్ట తప్ప లాభంలేదని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి రాష్ట్రంలో మిగులు కరెంట్ ఉన్నదని 24 గంటల కరెంట్ ఇస్తామని రైతులను మభ్యపెడుతున్నార న్నారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడం వలన భూగర్భ జలాలు అడుగట్టుతాయని, రానున్న రోజులల్లో నీటి కష్టాలు తప్పవని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి 957 కోట్లతో విద్యుత్ డిస్కింలు కొనుగొలు చేస్తున్నారని ఈకొనుగొలు కుంభకొనంలో ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యుత్ మంత్రికి సంబంధాలు ఉన్నాయని, వీరిపై సిబిఐ దర్యాప్తు చేయాలన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 స్థానాలు గెలుస్తాయన్న మంత్రి జగదీష్‌రెడ్డి తక్షమే రాజీనామ చేసి గెలవాలని సవాలు విసిరారు. కలెక్టరేట్ నిర్మాణంలో 200 రూ. కోట్లు కుంభకోణం జరిగిందని, నియోజకవర్గానికి వచ్చిన 1400 కోట్లలలో 200 కోట్లు కమీషన్‌ద్వారా వచ్చిన డబ్బుతో యస్‌పౌండేషన్ ఏర్పాటు చేసి బ్యాట్లు, బుక్స్ పంపిణి అంటు ప్రజలను మభ్యపెడుతున్నరని విమర్శించారు. ప్రజలల్లో టిఆర్‌ఎస్ పార్టీపై ఆశలు సన్నగిల్లుతున్నయని 2019లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు యండి షపి, కౌన్సిలర్ వల్దాస్ దేవేందర్, నాయకులు వెలుగు వెంకన్న, ఖాలేద్ అహ్మద్, వట్టే కిష్ణ, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

‘మోడీ వికృత చేష్టలతోనే న్యాయ వ్యవస్థలో సంక్షోభం’

విజయవాడ, సూర్య బ్యూరో : ప్రధాని నరేంద్ర మోడీ వికృత చేష్టలే న్యాయ వ్యవస్థలో సంక్షోభానికి కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యవహారానికి మోడీ బాధ్యత వహించాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చేసిన ఆరోపణలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలను నారాయణ ప్రస్తావిస్తూ అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి కలిఖో వుల్ 2016లో ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. గిరిజనుడైన ఆయనను లంచం తీసుకోవాలని వత్తిడి తేవడమే కాకుండా వేధింపు లకు గురిచేయడంతో 62 పేజీల ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సీఎం హోదాలోఉన్న వ్యక్తికి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి స్వయంగా లంచాలు తీసుకోవాలని వత్తిడి చేయడంతో ఈ ఘటన చోటుచేసుకుందని లోకం కోడై కూస్తోందన్నారు. ప్రధాని కార్యాలయం చీఫ్ జస్టిస్‌పై, సుప్రీం కోర్టుపై ఆధిపత్యాన్ని చెలాయిస్తోందనేది నిరూపణ అవుతోందన్నారు. అనేక ఆరోపణలు, కుంభకోణాల్లో కూరుకుపోయిన వారు బీజేపీ పంచన చేరితే గంగిగోవులుగా ముద్రలు వేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అరుణాచల్‌ప్రదేశ్ సీఎం ఆత్మహత్య కేసు, సీబీఐ స్పెషల్ జడ్జి లోహియా కేసు, మెడికల్ కుంభకోణం కేసులను మళ్లీ తిరగతోడి ఉన్నత న్యాయ స్థానానికి అప్పగించాలని నారాయణ డిమాండ్ చేశారు. ప్రధాని మోడీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ వివరాలను ప్రధాని కార్యాలయం (పీఎంఓ) వెల్లడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఈ విషయమై సంక్రాంతి తర్వాత ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. మరోసారి కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమానికి శ్రీకారం చుడతామని రామకృష్ణ స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.



ఇంటింటా ఆనందం, ఊరంతా సంబురం

- 14న భోగి, 15న సంక్రాంతి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

అమరావతి సూర్యప్రతినిధి : అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, తెలుగులోగిళ్లలో ఏడాదంతా ప్రతి రోజూ ఆనందం వెల్లివిరియాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు దేశ,విదేశాల్లోని తెలుగువారికి ఆయన భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పేదవాళ్లు కూడా సంతోషంగా పెద్దపండుగ చేసుకోవాలన్న ఉద్దేశంతోనే ‘చంద్రన్న సంక్రాంతి కానుక’ను పంపిణీ చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

సంక్రాంతి ప్రధానంగా రైతుల పండుగ అని, పంట ఇంటికి చేరిన సందర్భంలో ప్రకృతికి కర్షకులు నివేదించే కృతజ్ఞతల పండుగ అని సీఎం చంద్రబాబు అభివర్ణించారు. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే పుణ్యకాలమని ముఖ్యమంత్రి అన్నారు సాగు వ్యయాన్ని తగ్గించడం, ప్రక తి వ్యవసాయానికి ప్రోత్సాహం, అనుబంధ రంగాలకు ప్రాధాన్యాన్నిస్తూ కోటి ఎకరాల్లో ఉద్యానపంటలు పండించడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటికి



చేరిన ధాన్యరాశులతో తెలుగు లోగిళ్లు కళకళలాడుతున్నాయని చెప్పారు. పట్టిసీమ ద్వారా 3 ఏళ్లలో కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాలలో రూ.18 వేల కోట్ల విలువైన పంట ఇంటికి చేరిందని గుర్తు చేశారు. జీవన సమరంలో ఎక్కడో దూరాన ఉంటూ పెద్ద పండుగ సందర్భాన జన్మభూమికి తరలివచ్చారని, మన కుటుంబ వ్యవస్థ గొప్పదని అన్నారు. ఇటీవల ముగిసిన ఐదో విడత ‘జన్మభూమి–మా ఊరు’ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసిన ప్రజానీకానికి, అధికారులు, సిబ్బందికి కతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయంలో వద్ధిరేటు జాతీయ స్థాయిలో 2.5 శాతం ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 20.6 శాతం నమోదవ్వడం విశేషమని, అదీ రాష్ట్రంలో గత ఏడాది 30 శాతం, ఈ సంవత్సరం 12.5 శాతం వర్షపాతం తక్కువగా ఉన్నా ఇలాంటి ఫలితాలు సాధించడం మరింత ఉత్తేజాన్ని అందిస్తోందని తెలిపారు. వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధరంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 45 శాతం వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆక్వాహబ్‌గా నిలవడం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. అరకోటి సంఖ్యతో దేశంలో మరే రాష్ట్రంలో ఇవ్వనన్ని సామాజిక భద్రత పెన్షన్లు ఇస్తున్నామని, రైతు సంక్షేమానికి నిబద్ధతతో పని చేస్తూ దశలవారీగా రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేశామని వివరించారు. రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా చేస్తామని మూడేళ్ల నాడు చెప్పిన మాటల్ని నిజం చేస్తున్నామని, కృష్ణా జలాలతో రాయలసీమలో చెరువులను నింపామని అన్నారు. అనంతపురం జిల్లాలో నిండిన చెరువులను చూస్తే సముద్రాన్ని చూసినంత సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. పట్టిసీమ పథకం విజయ స్ఫూర్తితో కృష్ణా–గోదావరి–పెన్నా నదుల అనుసంధానం చేస్తామని, మహాసంగ్రామాన్ని సృష్టిస్తామని చంద్రబాబు తెలిపారు.

నిరుద్యోగ ఉపాధి కల్పనకు అలీబాబా డాట్‌కామ్



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌లో ఇ–కామర్స్ ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అందించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అలీబాబా డాట్‌కామ్ కంపెనీ సహకారంతో ఏపీలో నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి కల్పించేందుకు త్వరలో ఒక ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ సందర్భంగా అలీబాబా కంపెనీ ప్రతినిధులతో ఏపీ పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్, పర్యాటక శాఖమంత్రి భూమా అఖిలప్రియ శనివారం హైదరాబాదులో చర్చలు జరిపారు. మరో వారం పది రోజుల్లో విజయవాడలో అలీబాబా కంపెనీ ప్రతినిధులతో ఎం.ఓ.యు. చేయనున్నామని మంత్రి అఖిలప్రియ తెలిపారు. అయితే ఇది కేవలం తమ శాఖకే పరిమితం కాకుండా ఏపీలోని నిరుద్యోగ యువత అందరికీ వర్తింపచేయాలని చైనా ప్రతినిధులను మంత్రి నారా లోకేష్ వద్దకు తీసుకెళ్ళారు. అలీబాబా కంపెనీ ఇండియా బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ వందర్ ఛాన్, టి.డి.ఐ. గ్లోబల్ హెడ్ సంజయ్ శర్మలతో చర్చించిన లోకేష్ ఏపీలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు ఇది సదవకాశమని పేర్కొన్నారు. త్వరలో నవ్యాంధ్ర రాజధానిలో అలీబాబా కంపెనీ ప్రతినిధులతో ఎం.ఓ.యు. చేస్తామని మంత్రి అఖిలప్రియ తెలిపారు.

స్టేడియం నిర్మాణం హామీని నెరవేర్చండి



విజయవాడ, సూర్య బ్యూరో : నియోజకవర్గానికి ఒక స్టేడియం నిర్మాణం అని ప్రకటించిన టీడీపీ ప్రభుత్వం వెంటనే ఆ హామీని పశ్చిమ నియోజకవర్గం నుండి అమలు చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యకర్త పోతిన వెంకట మహేష్ విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. సితార జంక్షన్ వద్ద వున్న స్టేడియం నిర్మాణం వెంటనే చేపట్టాలని అవసరమైన నిధులు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. పశ్చిమాన స్టేడియం నిర్మాణం శిలాఫలకానికే పరిమితమయ్యాయని నిర్మాణంకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమాన యువతకు, పిల్లలకు, పెద్దలకు, మహిళలకు, మానసిక ఉల్లాసం గురించి గానీ, ఆటలు, క్రీడలు గురించి గానీ ప్రత్యేకంగా ఎక్కడ ఆట స్థలం లేదని కనీసం చిన్నపాటి స్థలం కూడా అందుబాటులో లేకపోవడం వల్ల మానసిక ఉల్లాసం శారీరక దారుఢ్యాన్ని కోల్పోతున్నారని బాధను వ్యక్తం చేశారు. వెంటనే స్టేడియం నిర్మాణం చేపట్టాలని ప్రజలకు వీలైనంత తొందరగా స్టేడియంను అందుబాటులోకి రావాలని ప్రభుత్వాన్ని పోతిన వెంకటమహేష్ కోరుతున్నారు.

జల క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

జల వనరుల, క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ, సూర్యబ్యూరో : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జల క్రీడలకు ప్రాధాన్యతనిస్తుదని రాష్ట్ర న్యాయ, యువజన సంక్షేమం, క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం నాగాయలంకలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న క్రీడల అకాడమి భవన సముదాయానికి శంఖుస్థాపన గావించి అనంతరం నాగాయలంకలోని శ్రీరామ పాద క్షేత్రం వుష్కరఘాట్‌లో సంక్రాంతి సందర్భంగా దివిసీమ సాంప్రదాయ పడవల పోటీలను శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తదితరులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రానికి అపారమైన సముద్ర తీరం ఉందన్నారు. జలక్రీడలకు నాగాయలంక వేదిక కావడం శుభపరిణామమన్నారు. గత వుష్కరాల్లో ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, జల క్రీడలకు ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆసక్తి గల వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం జల క్రీడలను ప్రొత్సహిస్తూ కృష్ణా జిల్లాలో ఇబ్రహింపట్నం, నాగాయలంక, పశ్చిమ గోదావరి జిల్లాలో ఎర్రకాలువ వద్ద, విజయనగరం జిల్లాలో తాడివూడి వద్ద జల క్రీడల అకాడమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దీనిలో భాగంగా నాగాయలంకలో జల క్రీడల అకాడమికి శంఖుస్థాపన గావించామన్నారు. ఒలంపిక్స్ వంటి అంతర్జాతీయ ఈవెంట్స్‌తో జల క్రీడలకు సంబంధించి 58 పతకాలు ఉన్నాయని తెలిపారు. జల క్రీడల అకాడమిలో జల క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రెండు, మూడేళ్లల్లో ఇక్కడ శిక్షణ పొందిన వారు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో జల క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. పడవ పందాల్లో కేరళ అంతర్జాతీయ ఖ్యాతి గాంచిందని, యూత్రికులను విశేషంగా ఆకర్షిస్తుందన్నారు. నాగాయలంకలో జల క్రీడలకు అవకాశాలు ఉన్నాయని గుర్తించి గతేడాది నుండి ఇక్కడ పడవల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా నాగాయలంకను తీర్చిదిద్దడం ప్రభుత్వ ధ్యేయం అన్నారు. నాగాయలంక లైట హౌస్‌ను కేంద్రం సాగరమాల క్రింద గుర్తించిందన్నారు. ఇక్కడ హౌస్‌బోట్స్ ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో శ్రీకాకుళంలో తెలుగు భాషా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఘంటసాలలో శయన బుద్ధ విగ్రహాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పడవ పోటీల నిర్వహణలో స్వచ్ఛ నాగాయలంక సొసైటీ, గ్రామాభివద్ధి కమిటీ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ,



జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడల యువజన సర్వీసుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, శాప్ ఎండీ బంగారు రాజు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, టూరిజం కార్పొరేషన్ ఈడీ మల్లికార్జునరావు, ఏపీ పర్యాటక అభివద్ధి సంస్థ ఎండీ హిమాన్షు శుక్లా, ఎంపీపీ సజ్జా గోపాలకష్ణ, జెడ్పీటీసీ కన్న నాగరాజు, సర్పంచ్ చీలి రాము, ఎంపీటీసీ విజయలక్ష్మి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మండవ బాలవర్ధిరావు, స్వచ్ఛ నాగాయలంక కమిటీ అధ్యక్షుడు సుధీర్, సింహాద్రి కష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు చర్యలు



ఏలూరు, మేజర్‌న్యూస్ : దేశంలో విమానయాన రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి వూసపాటి అశోక్ గజపతి రాజు చెప్పారు. ఉండి గ్రామంలో 60 లక్షలతో నిర్మించిన ఉండి సహకార గ్రామీణ బ్యాంక్ భవనాన్ని శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో కేంద్ర మంరతి ఆయన మాట్లాడుతూ తగంలో కన్నా ప్రస్తుతం దేశంలో విమానయానరంగం అభివృద్ధి దిశగా పయనిస్తుందని, పౌర విమానయానరంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రోత్సాహక కార్యక్రమాల కారణంగా మనదేశం ప్రపంచం విమానయాన రంగంలో మూడవ స్థానానికి చేరుకుందన్నారు. దేశంలో ప్రయాణీకుల, కార్గో విమాన యానరంగానికి అనువైన పరిస్థితులున్నాయని, గత సంవత్సరం ఉడాన్ పథకం కింద 75 విమానాశ్రయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రాగా, అందులో 31 విమానాశ్రయాలు ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఈ సంవత్సరం 49 ప్రతిపా దనలు వచ్చాయన్నారు. ఇటీవల వైఏఫ్‌బిఎన్ జర్నీ వాటర్ ఎయిర్ క్రాఫ్ట్ (జల విమానాలు) ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని, ఈ విమానాలు ల్యాండింగ్ అయ్యేందుకు ఒక మీటరు లోతు, 300 మీటర్ల పొడవు వుంటే సరిపోతుందని, ఇవి నీటిలోను, నేల మీద కూడా ల్యాండ్గ అవుతాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు అంత అనుకూలమైన ప్రదేశం కాదని ఒక ప్రశ్నకు సమాధానంగా అశోక గజపతి రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి మాగంటి బాబు, స్థానిక శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు, శాసన మండలి సభ్యులు కె. సత్యనారాయణ రాజు, జడపిటిసి కడిమెళ్ళ వెంకట సత్యతులసి, మండలాధ్యక్షులు ధనియా లక్ష్మి, ఏఎంసి చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు గ్రామ సర్పంచ్ ముదునూరి విజయ, సొసైటీ అధ్యక్షులు చింతలపాటి సత్యానంద శ్రీ హరి రాజు తదితరులు పాల్గొన్నారు.

పందేల నిర్వాహకుల కళ్లలో నిరాశ



- పోలీసుల కఠిన చర్యలతో బెంబేలెత్తుతున్న పందెందారులు
- నిఘాను మరింత అప్రమత్తం చేసిన పోలీసులు

అన్నవరం (తూర్పు గోదావరి జిల్లా), మేజర్ న్యూస్ : ఏడాదికొక సారి వచ్చే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సాంప్రదాయబద్దంగా నిర్వహించుకునే కోడిపందేలు నిర్వహణకు ఈ ఏడాది న్యాయస్థానాలు ఎటువంటి అనుమతులు ఇవ్వకపోవడంతో పందేల నిర్వాహకుల కళ్లల్లో నిరాశే కనిపిస్తోంది. పండుగ మాసం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసే ప్రజల్లో కూడా పండుగ వాతావరణం కనిపించట్లేదు. కోడిపందేల నిర్వహణపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గతంలో కూడా ఇదే పంథాను కొనసాగించినప్పటికీ తెలుగుదేశం ప్రభుత్వం తమ ఉనికిని చాటుకునేందుకు పరోక్షంగా అనుమతులను ఇచ్చింది. దీంతో గతేడాది ప్రజలు కోడిపందేల నిర్వహణతో పాటు గుండాటలు, జూదాలు విచ్చలవిడిగా నిర్వహించారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులపై అత్యున్నత న్యాయస్థానాలు సీరియస్ అయ్యాయి. అందుకు బదులుగా వివరణలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితిని పోలీసులు కొనితెచ్చుకున్నట్లు అయ్యిందని అప్పట్లోనే బయట పడ్డాయి. కాగా ఈ ఏడాది కోడిపందేల నిర్వహణపై సుప్రీంకోర్టుతో పాటు హైకోర్టు కూడా సీరియస్‌గానే వ్యవహరిస్తుండడంతో పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్కడైనా కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపైనా నిర్వాహకులపైనా కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడడం లేదు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తీవ్రతరమైన నేపథ్యంలో ఎటూ అడుగు వేయలేని పరిస్థితి పోలీసులపై ఏర్పడుతోంది. చివరిలో కోర్టు ఉత్తర్వులతో పండుగ వాతావరణం కనిపిస్తుందనుకున్న ప్రజల కళ్లల్లో నిరాశే మిగిలింది. మారు మూల ప్రాంతాల్లో సైతం ప్రజాప్రతినిధుల అండదండలతో పోలీసుల కళ్లుగప్పి నిర్వహణ సాగించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై ఎస్సై పార్ధసారధిని వివరణ కోరగా కోర్టు ఉత్తర్వులను అనుసరించి పందేల నిర్వహణను విరమించుకుంటే నిర్వాహకు లకు మంచిదని లేనిపక్షంలో కేసులు నమోదుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

తిరుమంజన సేవలో మంత్రి శిద్దా కుటుంబం

- కె. అగ్రహారంలో వైభవంగా తిరుమంజన సేవ మహోత్సవం
- ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర మంత్రి శిద్దా దంపతులు, సుధీర్ దంపతులు

చీమకుర్తి, మేజర్‌న్యూస్ : మండలంలోని కె.అగ్రహారం (చిన్నతిరుమల)లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం తిరుమంజన సేవ కార్యక్రమాలల్లో రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు,ధర్మపత్ని లక్ష్మీపద్మావతి దంపతులు, తనయుడు యువ పారిశ్రామికవేత్త శిద్దా వీర వెంకట సుధీర్ కుమార్ దంపతులు ప్రతేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య దర్మకర్తలు కాందూరి రవి రామానుజాచార్యులు, కాండూరి సాయి కుమార్, ఆలయ అర్చకులు శేషాచార్యులు పాల్గొన్నారు. ‘తిరుమంజన సేవ’ కార్యక్రమాన్ని దర్శించుకొనేందుకు జిల్లా నలుమూల నుంచి వందలాది మంది భక్తులు హాజరైనారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, ఆలయ జీర్ణోద్ధరణ ప్రధాన కైంకర్య పోషకులు శిద్దా వెంకట్రావు ధర్మపత్ని హైమావతి,తనయులు శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా సూర్యప్రకాశరావు, శిద్దా హనుమంత రావులు పాల్గొన్నారు.


నేడు “గోదా తిరు కళ్యాణ” మహోత్సవం

కె.అగ్రహారంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాన్ని పురస్కరించుకొని నేడు ఆదివారం (భోగి పండుగ) సాయంత్రం 5 గంటలకు గోదా తిరు కళ్యాణ మహోత్సవం,సాయంత్రం జరిగే ‘స్వామివారి ఊంజలసేవ’లో ఆలయ నిర్వహకులు, ఆలయ జీర్ణోద్ధరణ ప్రదాన కైంకర్య పోషకులు శిద్దా వెంకట్రావు ధర్మపత్ని హైమావతి, తనయులు శిద్దా వెంకటేశ్వంరావు ధర్మపత్ని సూర్యకుమారి, సూర్యప్రకాశరావు దర్మపత్ని జయశ్రీ, హనుమంతరావు ధర్మపత్ని పుష్పలత, అల్లుళ్లు కొప్పరావూరి రామమూర్తి, ధర్మపత్ని పద్మావతి, పోలిశెట్టి ప్రభాకరరావు దర్మపత్ని విశాలక్ష్మి తదితరులు పాల్గొనన్నారు. ఆదివారం జరిగే గోదా తిరు కళ్యాణ మహోత్సవం, స్వామివారి ఊంజలసేవ కార్యక్రమాలల్లో భక్తులు భారీగా హాజరుకావాలని శిద్దా




వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

డ్రా లేకుండానే హజ్ యాత్రకు ఎంపిక



విజయవాడ, సూర్య బ్యూరో : 10 జిల్లాల్లో డ్రా (ఖురా) లేకుండానే దరఖాస్తు చేసుకున్న వారందరికీ హజ్ చేసుకునే అవకాశం దొరికింది. కేవలం అనంతవురం, విజయ నగరం, విశాఖపట్నం 3 జిల్లాలకు సంబంధించి డ్రా ద్వారా హజ్ యాత్రికుల్ని జనవరి 17న మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డ్రా నిర్వహిస్తున్నట్లు ఎపి స్టేట్ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ పత్రికా ప్రకటన విడుదలన చేశారు. 13 జిల్లాల నుంచి మొత్తం వచ్చిన దరఖాస్తులు 2736, 70+కోటా 107, కోటా 2637, మిగిలినవి 99. మొత్తం 2843 మంది దరఖాస్తులు ఎపి హజ్ కమిటీకి అందాయి. (ఇందులో 70+ కోటా 107 వుంది) ఎపికి వచ్చిన కోటా 2744. 10 జిల్లాల్లో డ్రా లేకుండానే దరఖాస్తు చేసుకున్న వారందరికీ హజ్ చేసుకునే అవకాశం దొరికింది. కేవలం అనంతవురం, విజయనగరం, విశాఖపట్నం మూడు జిల్లాలకు సంబంధించి డ్రా ద్వారా హజ్ యాత్రికుల్ని ఎంపిక చేస్తామని, సెంట్రల్ హజ్ కమిటీ కేటాయించిన కోటా కంటే 99 దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని ఎపి స్టేట్ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఇగ్నో రిజిస్ట్రార్‌గా ఏపీ నుంచి వేణుగోపాల్‌రెడ్డి



విజయవాడ, సూర్య బ్యూరో : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రాల విభాగానికి డైరెక్టర్‌గా 2015 నుంచి బాధ్యలు నిర్వహిస్తున్న తొలి తెలుగు వ్యక్తి డా.వీరవల్లి వేణుగోపాల్‌రెడ్డి ఇవ్వుడు స్టూడెంట్ ఎవాల్యూయేషన్ డివిజన్‌కి రిజిస్ట్రార్‌గా ఎంపిక య్యారు. ఒక తెలుగు వ్యక్తికి ఇంతటి గౌరవం లభించడం విశేషం. ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగుతారు. 2015 నుండి దేశంలోని 67 ప్రాంతీయ కేంద్రాలకు డైరెక్టర్‌గా నిర్వహిస్తూ విద్యార్ధి సేవలను పటిష్టపరిచిన వేణుగోపాల్‌రెడ్డి ఇకపై మూల్యాంకన విభాగానికి రిజిస్ట్రార్‌గా సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై పరీక్షల ఫలి తాలు విశ్వవిద్యాలయ నియ మనిబంధనలకు అనుగుణంగా 45 రోజులలో వెలువరించేలా చర్యలు తీసు కుంటామని, విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు ఇకపై సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. దూర విద్యా రంగానికి సంబంధించిన సేవ లను మెరుగుపరిచేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రీజనల్ డైరెక్టర్ డి.ఆర్.శర్మ, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఫిబ్రవరి 6 నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుమల, మేజర్‌న్యూస్ : తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 6 నుండి 15వ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఫిబ్రవరి 5వ తేదీ సోమవారం సాయంత్రం మూషిక వాహనం, రాత్ర అంకురా ర్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

రైళ్ళన్ని ఫుల్.. ఆర్టీసీ బస్సుల్లో సీట్లు నిల్

విజయవాడ, సూర్య బ్యూరో : సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో రైల్వేస్టేషన్, బస్టాండ్లలలో గురువారం ఒక మోస్తరుగా రద్దీ వుంటే, శుక్రవారం, శనివారం నుండి ప్రయాణీకులతో కిటకిటలాడాయి. రైళ్ళన్ని ఫుల్... ఆర్టీసీ బస్సుల్లో సీట్లు నిల్... ఈ పరిస్థితి గురువారం (11 నుండి స్కూల్స్, కాలేజీలకు సెలవులు కావడంతో) మొదలైందని రైల్వే, ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్, వైజాగ్, తిరుపతి, బెంగుళూరు తదితర ప్రాంతాలకు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైళ్ళన్ని భారీ వెయిటింగ్ లిస్ట్‌లతోనే విజయవాడ నుండి కదిలాయి. ఆర్టీసీ బస్టాండ్ల ప్రయాణీకులతో కిటకిటలాడింది. రద్దీకి అనుగుణంగా హైదరాబాద్, వైజాగ్‌కు ఆర్టీసీ అదనపు బస్సులు నడిపింది. అయినా ఎంతో మంది ప్రయాణీకులు ప్రైవేటు బస్సులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని



గమనించిన ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు టిక్కెట్టు ధరలను భారీగా పెంచేశారు. (ఉదాహరణకు హైదరాబాద్‌కు సుమారు 500 రూపాయలుండే టిక్కెట్టును 900 రూపాయల నుండి వెయ్యి రూపాయల వరకు, సుమారు 800 రూపాయలుండే ఏసీ బస్సు టిక్కెట్ ధర 1500 రూపాయల వరకు ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ప్రయాణీకులకు అమ్ముతున్నట్లు సమాచారం) ప్రయాణీకుల రద్దీని గమనించిన ప్రైవేటు ఆపరేటర్లు ఇదే అదనుగా టిక్కెట్టుపై రెండు రెట్లు, మూడు రెట్లు వారి అవసరాన్ని అనుగుణంగా వసూలు చేస్తున్నారు. ప్రయాణీకులు ఎప్పటిలానే వారి దోపిడికి గురవుతున్నారు. ఇటీవల జరుగుతున్న రోడ యాక్సిడెంట్లను గమనిస్తున్న ప్రయాణీకులు ప్రైవేటు బస్సులు కాక ఆర్టీసీనే ప్రయాణానికి శ్రేయస్కరమని తలచినా గత్యంతరం లేని పరిస్థితిలో ప్రైవేటు బస్సులపైనే ఆధారపడాల్సి వస్తుందనుకుంటున్నారు. ప్రైవేటు బస్సు లపై అటు రైల్వే కాని, ఆర్టీసీ ప్రతి ఏటా సంక్రాంతి సమయంలో రద్దీని గమనిస్తున్నా అందుకుతగ్గ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయక పోవడానికి ప్రభుత్వానిది కూడా బాధ్యతేనని పలువురు ప్రయాణీకులు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు. ప్రైవేట్ ఆపరేటర్ల సంక్షేమం కోసం ఇటువంటి పండుగ సమయాలలో ఆర్టీసీపై ప్రభుత్వమే ఒత్తిడి చేసి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కూడా వారు పేర్కొనటం గమనార్హం. స్పెషల్ బస్సులు పేరిట ఆర్టీసీ వేసిన బస్సులు కూడా సౌకర్యవంతంగా లేవనేది ప్రయాణీకుల మరొక సమస్య. అయితే ఇటువంటి సమయాలలో ప్రయాణీకులు ముందుగానే రిజర్వ్ చేసుకోవాలని, ప్రణాళికా బద్ధంగా సిద్ధం కావాలంటున్నారు. ప్రయాణీకుల సౌలభ్యానికి అన్నిరకాలుగా చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటున్నామని, తాము చేసేది ఏమీ లేదని, అలాగే రద్దీని గమనంలో వుంచుకొనే అందుకు అనుగుణంగా తాము ప్రకటనలు చేస్తున్నామని, అటు రైల్వే, ఇటు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.



రైతులకు మేలు జరగాలి : రఘువీరా



విజయవాడ, సూర్య బ్యూరో : తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎన్. రఘువీరా రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఏపిసిసి రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపు కోవడం మన సంస్కృతిలో భాగమైంది. రైతులకు మేలు జరగాలి. అనురాగం, స్నేహబంధం, సోదరభావా నికి పండుగ స్ఫూర్తి దాయకం కావాలి. ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖంగా జీవించాలని రఘువీరారెడ్డి ఆకాంక్షించారు.



చెడు వీడమనే సంకేతాలు

భోగి మంటలు

వ్యవసాయం జీవనం. కానీ నేడు ఆ జీవనం తక్కువే. శ్రమ జీవులు, వినోదాలు, అవసరాలు వ్యవసాయదారుని ఆశ్రయించుకుని అతని చుట్టూ తిరిగాయి. క్రమంగా స్థితిగతులు మారిపోయాయి. వ్యవసాయానికి నాగలి నుంచి కొడవలి దాకా ఎన్నో పనిముట్లు కావాలి. అందుకోసం వడ్రంగి, కమ్మరి ఉండి తీరాలి. పొలానికి ఇంటికి బానలు, బుంగలు, కడవలు, పిడతలు, చట్లు, మూకుళ్లు, ప్రమిదలు కావాలి. ఇవన్నీ కనిపించనంత దూరంగా జరిగిపోయాయి. కారణాలు ఏవైనా పల్లెలు మాత్రం ఛిద్రమ య్యాయి. ఊళ్ళకి కళ తప్పింది. అనేక జానపద కళారూపాలు, జానపద వాద్యా లు కనుమరు గయ్యాయి. బతుకు తెరువు కోసం వెళ్ళిపోయాయి. మొత్తం మీద ఒక గొప్ప పనితనాన్ని, సంస్కృతిని కోల్పోయిన మాట అయితే వాస్తవం. అగ్గిపెట్టిలో చీరను పెట్టిన చరిత్ర మనది. ఆ చీరకు నూలు తీసిన కళాకారుల హస్తవాసిని తిరిగి చూడగలమా? కొయ్యను బంగారం చేసే వడ్రంగి, ఇనుముని పుత్తడి చేయగల కమ్మరి, బంకమట్టిని సారెతో సువర్ణం చేసే కుమ్మరి మన కళ్లెదుట కనుమరుగైన కులవృత్తి బ్రహ్మలు. అరిశెలు, బెల్లపులడ్లు, కొమ్ము మిఠాయి, చకినాలు, చక్కలు సంక్రాంతి పిండి వంటలు. నాలుగిళ్ళ వారు చేరి సమష్టిగా ఇవన్నీ చేసుకుని బానలకు ఎత్తేవారు. కొత్త అల్లుళ్ల రావడం వేడుక. పాత అల్లుళ్ళు రావడం వాడుక. ఊరు మీద ఊరు వచ్చి పడినట్టుండేది. ఇప్పుడు సొంత ఊళ్ళలో అంతో ఇంతో మమకారం ఉన్న వాళ్లు నగరాల నుంచి పండక్కి వెళుతున్నారు. అలనాటి భోగి మంటల్లో ఇప్పుడు కొత్తగా ఆచరిస్తున్న స్వచ్ఛ భారత్ పోలికలు కనిపిస్తాయి. చెత్తా చెదారం తెచ్చి భోగిమంటలో వేసే వారు. అదొక ఉద్యమంలా ఉత్సవంలా నడిచేది.ఇప్పుడు గ్రామాలకు వెళితే వెతికి చూసినా శ్రమించే పశువులు కనిపించవు. అక్కడక్కడ మాత్రం పాలిచ్చే పశువులు కనిపిస్తాయి. ఒక ట్రాక్టర్ వంద ఎడ్లు చేసే పని చేస్తుంది. డీజిల్ తప్ప వేరే పోషణ భారం ఉండదు. రైతుకి ఇప్పుడు పూర్వం లాగా ఎడ్లకి, దున్నలకి కృతజ్ఞతలు చెప్పే పనిలేదు. కనుమపండుగకి ఇప్పుడు అర్థమే లేదు. మనకి సెంటిమెంట్లమీద భయం ఎక్కువ. అందుకని ఎక్కడున్నా పిల్లల తల మీద భోగిపళ్ళు పోసి ఊపిరి పీల్చుకుంటారు. బస్తీల్లో, నగరాల్లో బొమ్మల కొలువులు స్టేటస్ సింబల్ అయ్యాయి. ఇటాలియన్ మార్బుల్స్‌ని, యూరోపియన్ క్రిస్టల్స్‌ని గొప్పింటి పేరంటంలో చూడొచ్చు. సినిమాల్లో తరచుగా సంక్రాంతి సన్నివేశాలు కనిపిస్తూంటాయి. పూర్తిగా స్టూడియో సెట్టింగ్‌లతో, చిత్ర విచిత్రమైన వేషధారణలో నాయికా నాయకులతో పాటు ఇంకా కొందరు నృత్యాలు చేస్తూ పాటలు పాడుతుంటారు. దీన్ని నేటివిటీకి దర్పణంగా భావిస్తారు.

మన తెలుగు వారి పెద్ద పండుగ మొదటి రోజున వచ్చేది 'భోగి' పండుగ. మూడు రోజుల పాటు జరిగే పండుగలో మొదటి రోజు 'భోగి'. భోగి పండుగ అనే పదానికి 'తొలినాడు' అనే అర్థం ఉంది. అనగా పండుగ తొలినాడు అని అర్థం. భోగి రోజున ఇంటి ముందర మంట వేస్తే ఇంటిలో ఉండే దారిద్ర్య దేవతను తరిమి నట్లేనని హిందువుల విశ్వాసం. దక్షిణాయనంలో ప్రజలు తాము పడిన కష్టాలను, బాధలను అగ్ని దేవుడికి ఆహుతి చేస్తూ రాబోయే ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలు భోగి మంటలు. భోగి రోజు సాయంత్రం పిల్లలకు పోసే భోగి పళ్ళు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడి దివ్యమైన ఆశీస్సులు. ఈ పండుగ నాడు సంక్రాంతి సంబరమంతా పిల్లలదే. తెల్లవారు ఝామున భోగి మంట లు వేయటం, సాయంత్రం భోగి పండ్లు పోయించుకోవడంతో హుషారుగా ఉంటారు. 'భగ' అనే పదం నుంచి భోగి అన్నమాట పుట్టిందని చెబుతారు. 'భగ' అంటే 'మంటలు' లేదా 'వేడి'ని పుట్టించడం అని అర్థం. భోగం కలిగిం ది భోగి. భోగమంటే ఆనందాన్ని అనుభవించడమని అర్థం. భూమి తాను సంతృప్తిగా ధాన్యాన్ని ఇచ్చాననే ఆనందాన్ని అనుభవిస్తూ, వృషభం తన శ్రమకి ఫలితం లభిస్తుంది. ధాన్యం ఇబ్బడి ముబ్బడిగా గాదెలకు చేర్చగలిగాననే సంతోషంతో యజ మాని గాదెలన్నీ నిండాయనే ఆనందాన్ని అనుభవిస్తూ, పిచ్చుకలు- కంకులనిండా ఉన్న ధాన్యాన్ని తినగలుగుత న్నామనే తృప్తితో... ఇలా పశు, పక్షి, మానవ జీవరాశులన్నీ భోగంతో గడు పుకునే పండుగ కాబట్టి భోగి. నిజమైన భోగం ఆనందానుభవం ఎప్పుడంటే ఆకాశ వర్షం భూమికి చేరి పంట చేతికొచ్చినప్పుడే. అందుకే ధరణి నుంచి పుట్టిన గోదాదేవికి ఆకాశ రాజపుతడైన రంగ నాథునితో కల్యాణాన్ని చేస్తారు. పంచభూతాల్లో మొదటిదైన పృథివి ఆ చివరిదైన ఆకాశంతో సమన్వ యపడి ఉంటే ఇంక పంచ భూతాత్మక ప్రపంచానికి తిరుగేముంది? కాబట్టి భోగి. ఒక ఆంతర్యం. ప్రాతః కాలంలోనే తల్లులం దరూ తమ పిల్లల్ని నిద్రలేపి వాళ్ల మాడు న నువ్వులనూనె ని అద్దు తూ ఆశీర్వచనాలని హృదయ పూర్వ కంగా చేసి, ఎక్కడా ఏ రక్త నాళం లోనూ రక్తప్రసరణ మందంగా ఉండకుండా ఉండేలా బలంగా శరీరాన్ని మర్దించి నలుగుపెట్టి, శిరోజాల్లో క్రిమికీటకాలు చేరకుండా ఉండేలా కుంకు డు రసంతో రుద్ది, అభ్యంగస్నానాన్ని చేయించి వాళ్లకి సుఖనిద్ర కలిగేలా చేస్తారు. స్వేద రంధ్రాలన్నీ తెరుచు కున్న కారణంగా శరీరానికి ఆనందానుభవం కల్గిస్తుం ది ఈ పర్వ దినం. అందుకే ఇది భోగి. ఆరోగ్యపరమైన ఆంత ర్యం ఇది. ఏ విధమైన పరిశోధనా పరికరం లేకుండా ఖగోళంలో ఉన్న గ్రహగతు ల్నీ వాటిద్వారా వ్యక్తులకి కలిగే మేలు- కీడులని తెలియజేయడం కోసం ఈ నేలని ఆకాశంగా చేస్తూ గ్రహాలు తిరిగే మార్గా లని ముగ్గుగీతలుగా చేస్తూ, ఈ తీరుగ్రహ పరివర్తన కారణంగా వర్షం ఎంత పడుతుంది?

ఉత్తరాయణం రాబోతున్న రోజున గాలి వేగం ఎంతతో ఉందో, గాలి ఏ దిశగా వీస్తోందో, దానిలో తేమ ఎంత శాతముందో, దాన్ని బట్టి రాబోయే కాలంలో పంట దిగుబడిక్కావలసిన వర్షపాతాన్ని లెక్కించగలరు రైతులు. ఆ కారణంగా వాళ్లకి రాబోయే పంట సమాచారాన్ని తెలుసుకోగలిగామనే ఆనందానుభవం భోగి. భోగము అంటే పండుగ. అది కలిగినది భోగి అంటే పాము. ఆ కుండలిని శరీరానికి ఉత్తరంగా ఉండే శిరస్సులోనికి ప్రయాణం చేస్తూ మెల్లమెల్లగా సహస్రారంలో ఉండే దైవాన్ని దర్శించి ఆనందానుభవాన్ని పొందడం భోగి. ఇది యథార్థం కాబట్టే కార్తీక త్రయోదశి, చతుర్దశి, అమావాస్యలు కలిసిన అవమ తిథినాడు కురుక్షేత్రయుద్ధంలో పాల్గొన్న భీష్ముడు... మార్గశీర్ష శుద్ధ దశమినాడు అంపశయ్యని చేరే ఆనందానుభవం లభించే భోగిని దాటి, అష్టమీ తిథి రోహిణీ నక్షత్రంలో కృష్ణునిలో లీనమయ్యాడు. కేవలం యోగమార్గంలో ఆనందానుభవాన్ని పొందడమే ఆయన లక్ష్యమైనా అష్టమి, రోహిణి అనే రెంటికోసమే మరికొన్ని రోజులు తన శరీరాన్ని త్యజించకుండా ఆపాడు.తెలుగు జాతి పౌరుషాలకు ప్రతీకలుగా ఎర్రఎర్రని మిరపపళ్లు కోతకు వస్తాయి. పంటచేను దిబ్బల మీద వంగలు, బెండలు, చిక్కుళ్లు, సొరపాదులు విరగకాసి బరువెక్కేది ఇప్పుడే. కవిసమ్రాట్ విశ్వనాథ తన తెలుగు రుతువులు కావ్యంలో మంచి గుమ్మడి వువ్వులో నిలిచిన మంచు బిందువు, తట్టలో కూర్చున్న పెళ్ళి కూతురులా ఉందని వర్ణించారు. గుమ్మడి పచ్చపచ్చగా వూలు వూసేది... మంచుకురిసేది ఈ ధనుర్మాసంలోనే.

ఎంత దూరంలో పడుతుంది? ఆ స్థాయి వర్ష బలంతో ఏ పంట పండుతుంది? వ్యవసాయ దారులు నేలమీదే చూసి తెలుసుకుని ఆనందానుభూతితో గడువుకునేది భోగి. సాధా రణంగా అందరు చెప్పేది... ఇది చలి కాలం కనుక వెచ్చ దనం కోసం మంటలు వేస్తారని. కానీ నిజానికి భోగి మంటలు వెచ్చ దనం కోసం మాత్రమే కాదు... ఆరోగ్యం కోసం కూడా. ధనుర్మాసం నేలంతా ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే ఈ భోగి మంటలలో వాడుతారు. దేశి ఆవు పేడ పిడకలని కాల్చడం వల న గాలి శుద్ధి అవుతుంది. సుక్ష్మక్రిములు నశిస్తాయి. ప్రాణవాయువు గాలిలోకి అధికంగా విడుదల అవుతుంది. దాని గాలి పీల్చడం ఆరోగ్యానికి మంచిది. చలికాలంలో అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా శ్వాసకు సంబంధించిన అనేక రోగాలు పట్టి పీడిస్తాయి. వాటికి ఔషధంగా ఇది పని చేస్తుంది. భోగి మంటలు పెద్దవిగా రావడానికి రవి, మామిడి, మేడి మొదలైన ఔషధ చెట్ల బెరళ్లు వేస్తారు. అవి కాలడానికి ఆవు నెయ్యిని జోడిస్తారు. అగ్ని హోత్రంలో వేయబడిన ఆవు నెయ్యి నుంచి 1 టన్ను ప్రాణ వాయువు విడుదల అవుతుంది. ఈ ఔషధ మూలికలు ఆవు నెయ్యి, ఆవు పిడ కలని కలిపి కాల్చడం వలన విడుదలయ్యే గాలి అతి శక్తివంతమైంది. మన శరీరంలోని 72వేల నాడులలోకి ప్రవేశించి శరీరాన్ని శుభ్ర పరుస్తుంది. ఒకరికి రోగం వస్తే దానికి తగిన ఔషధం ఇవ్వ వచ్చు. అదే అందరికి వస్తే అందరికి ఔషధం సమకూర్చడం దాదావు అసాధ్యం. అందులో కొందరు వైద్యం చేయించు కొలేని పేదలు ఉంటారు. ఇదంతా ఆలోచించిన మన పెద్దలు భోగి మంటల్లో పాల్గొనే సంప్రదాయాన్ని తెచ్చారు. దాని నుంచి వచ్చే గాలి అందరికి ఆరోగ్యాన్ని ఇస్తుంది. కులాలకు అతీతంగా అందరు ఒక చోట చేరడం ప్రజల మధ్య అంత రాలను తగించి, ఐక్యమత్యాని పెంచుతుంది. అగ్నిదేవుడికి ఆరాధనా, మరో రకంగా గాలిని శుద్ధి చేస్తూ వాయుదేవునికి ఇచ్చే గౌరవం. కానీ సృజనాత్మకత పేరుతో రబ్బరు టైర్లను కాలుష్యాన్ని చేస్తూ మన ఆరోగ్యాన్ని పాడుచేసుకుం టున్నాం. పర్యావరణాన్ని నాశనం చేస్తుకొత్త రోగాలను కొని తెచ్చుకుంటున్నాం. ఇక భోగి మంటల్లో పనికిరాని వస్తువులను కాల్చండి అంటే రట్లో ఉండే ప్లాస్టిక్ కవర్లు, వైర్లు లాంటివి కావు. ఇక్కడ మనం చరిత్రకి సంబంధించిన ఒక విషయం గుర్తుకు తెచ్చుకోవాలి. నిజానికి భోగి మంటల్లో కాల్చాల్సింది పాత వస్తువులని కాదు... మనలోని పనికి రాని అలవాట్లు, చెడు లక్షణాలు. అప్పుడే మనకున్న పీడ పోయి మానసిక ఆరోగ్యం, విజయాలు వస్తాయి



భోగి పళ్లు :

భోగి రోజున భోగి పళ్లు పేరుతో రేగి పళ్లను పిల్లల మీద పో స్తారు. రేగి చెట్టుకు బదరీ వృక్షం అనే సంస్కృఎత నామం. రేగి చెట్లు, రాగి పండ్లు శ్రీమన్నారాయణ స్వామి ప్రతి రూపం. ఇది సూర్యునికి ప్రీతి పాత్రమైన ఫలం. సూర్యుని రూపం, రంగు, పేరు కలిగిన రేగుపళ్ళతో నాణే లను కలిపి పిల్లల తలపై పోస్తారు. వాటిని తలపై పోయడం వలన శ్రీ లక్ష్మి నారాయణుల అనుగ్రహం మన పిల్లలపై ఉంటుంది అని, పిల్లలకి ఉన్న దిష్టి తొలగిపోయి వారి ఎదుగుదలకు తోడ్పడుతుందని మన పెద్దల విశ్వాసం.మన బాహ్య నేత్రాలకి కనిపించని బ్రహ్మరంధ్రం మన తల పై భాగంలో ఉంటుంది. ఈ భోగి పండ్లను పోసి ఆ బ్రహ్మరంధ్రాన్ని ప్రేరేపితం చేస్తే, పిల్లలు జ్ఞానవంతులు అవుతారు. రేగు పండ్లు సూర్యకిరణలలోని ప్రాణశక్తిని అధికంగా గ్రహించి, నిల్వ ఉంచుకుంటాయి కనుక వీటిని తల మీద పోయడంతో... వీటిలోని విద్యుచ్ఛక్తి, శరీరం పై, ఆరోగ్యం పై ప్రభావాన్ని చూపించి మంచి ఫలితాలు ఇస్తాయి. అందువల్లే పిల్లలకి భోగి పండ్లు పోసి అశ్వీరదిస్తారు. మన ప్రతి సంప్రదాయం వెనుక అనేక అర్దాలు, అంతర్దాలు, రహస్యాలు ఉంటాయి. అవి తెలియకపోయినంత మాత్రం చేత ఆచార, సంప్రదాయాలను మూఢనమ్మకలు అనుకోవడం మూర్ఖత్వం. వాటి విలువలను తెలుసుకొని చేసుకుంటే అవి మనకి మార్గదర్శకులవుతాయి.







సూర్య సినిమా



హీరోగా రంజిత్ జువ్వలా దూసుకెళ్లాలి - చిరంజీవి

రంజిత్, పాలక్ లల్వానీ జంటగా 'దిక్కులు చూడకు రామయ్య' ఫేమ్ త్రికోటి పేట దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'జువ్వ'. ఎస్.వి. రమణ సమర్పణలో సోమి ఫిలింస్ పై డా. భరత్ సోమి నిర్మిస్తోన్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌ను శనివారం ఉదయం మెగాస్టార్ చిరంజీవి విడుదల చేశారు.

అనంతరం చిరంజీవి మాట్లాడుతూ– "అందరికి హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ రోజు 'జువ్వ' ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ విడుదల చేయడం హ్యాపీగా ఉంది. హీరో రంజిత్, ప్రొడ్యూసర్ భరత్ అన్నదమ్ములు. వీళ్ల నాన్నగారితో నాకు మంచి పరిచయం ఉంది. స్వతహాగా భరత్ డాక్టర్. సాధారణంగా యాక్టర్ కాబోయి డాక్టర్ అయ్యామనే మాటలు వింటుంటాం. కానీ, తమ్ముడి కోసం డాక్టర్ భరత్ ప్రొడ్యూసర్ అయ్యాడు. ఆ విధంగా అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా ఈ సినిమా నిలబడింది. టీజర్‌లో రంజిత్ డైనమిక్‌గా, హుషారుగా కనిపించాడు. క్యారెక్టర్ పరంగా పక్కా మాస్ అని అర్థమవుతోంది. హీరోయిన్ పాలక్ లల్వానీ రొమాంటిక్‌గా, అందంగా కనిపించింది. రాజమౌళి శిష్యుడు త్రికోటి దర్శకత్వం వహించిన ఈ సినిమాను వీళ్లిద్దరి కోసం తప్పకుండా చూస్తా. 'దిక్కులు చూడకు రామయ్య' తర్వాత దర్శకుడు త్రికోటి మరో హిట్ అందుకోవాలని కోరుకుంటున్నా" అన్నారు.

హీరో రంజిత్ మాట్లాడుతూ– "చిరంజీవిగారి నటన అంటే నాకెంతో ఇష్టం. హి ఈజ్ మై రోల్ మోడల్ అండ్ ఇన్‌స్పిరేషన్. ఆయనతో ఒక్క ఫోటో దిగితే చాలు అనుకునేవాడిని. ఈరోజు నేను హీరోగా పరిచయం అవుతున్న సినిమా టీజర్‌ను సార్ విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఐ లవ్ చిరంజీవి. నేను ఎప్పుడైనా లోన్లీగా ఫీల్ అయినప్పుడు యుట్యూబ్ లో చిరంజీవిగారి పాటలే చూస్తా" అన్నారు.

దర్శకుడు త్రికోటి మాట్లాడుతూ– "చిరంజీవిగారి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉంది. ప్రేమకథతో రూపొందిన సినిమా ఇది. చిన్న చిన్న థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి" అన్నారు.

ప్రొడ్యూసర్ భరత్ మాట్లాడుతూ– "ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ విడుదల చేసిన చిరంజీవిగారికి థాంక్స్. 2017లో మా సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ నెలాఖరున ఆడియో, ఫిబ్రవరిలో సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ సురేష్ పాల్గొన్నారు.



బొబ్బట్టు లాంటి భలే మంచి సినిమా - నాగార్జున

అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ రాజ్ తరుణ్ హీరోగా చిత్రా శుక్లా హీరోయిన్‌గా శ్రీరంజని దర్శకత్వంలో రూపొందిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రంగులరాట్నం'. ఈ చిత్రం జనవరి 14న సంక్రాంతి స్పెషల్‌గా వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగార్జున, హీరో రాజ్‌తరుణ్, హీరోయిన్ చిత్రా శుక్లా, ప్రముఖ నటి సితార, దర్శకురాలు శ్రీరంజని, నటుడు ప్రియదర్శి, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకల పాల్గొన్నారు.

అక్కినేని నాగార్జున మాట్లాడుతూ – "అందరికీ హ్యాపీ న్యూ ఇయర్. సంక్రాంతి శుభాకాంక్షలు. 'రంగుల రాట్నం' చిత్రాన్ని మా అన్నపూర్ణ వాళ్లు వడ్డించే సంక్రాంతి పొంగలి అని మేం అనుకుంటున్నాం. మా సినిమా ఇది. బొబ్బట్టులాగా ఉంటుంది. చాలా తీపిగా, చాలా బావుంటుంది. ఒక రియల్ ఫిల్మ్ ఇది. తల్లీకొడుకుల మధ్య ఎమోషన్స్, ఒక కుర్రాడికి, అతనికి కాబోయే భార్యకు మధ్య వచ్చే సన్నివేశాలను చూస్తుంటే నా కళ్ల ముందే పాత్రలన్నీ కదులుతున్నట్టు అనిపించింది. లక్కీగా నాకు సంక్రాంతికి డేట్ దొరికింది. ఫ్యామిలీస్ అందరూ కలిసి చూడదగ్గ సినిమా. నవ్వుకుంటూ, అప్పుడప్పుడూ కొంచెం కంటతడి పెడుతూ ప్రేక్షకులు చూస్తారు. నాకు ఈ సినిమా కథ ఏడాది క్రితం చెప్పారు. బావుంది ఈ కథ అని మా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సుప్రియకి చెప్పాను. చేయొచ్చు అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను. అయితే ఆ తర్వాత కథని మర్చిపోయాను. రీసెంట్‌గా సినిమాను ప్రేక్షకుడిగానే చూశాను. నాకు చాలా బాగా నచ్చింది. ప్రెజెంట్ సర్‌ప్రైజ్‌లాగా అనిపించింది. ఈ సినిమా ద్వారా మా సంస్థకు చాలా మంచి పేరు వస్తుంది. శ్రీరంజనికి దర్శకురాలిగా తొలి చిత్రమిది. ఎక్స్‌పీరియన్స్‌గల డైరక్టర్‌లా తెరకెక్కించింది. ఎమోషన్స్, మదర్ ఎమోషన్స్, అమ్మాయి ఎమోషన్స్‌ని ఓ అమ్మాయి పాయింట్ ఆఫ్ వ్యూ నుంచి చూపించింది. మేం రాజ్‌తరుణ్‌తో 'ఉయ్యాల జంపాల' చేశాం. తను నేచురల్ యాక్టర్. ఒక సీన్‌లో తల్లిని ప్రేమించే అబ్బాయిలాగా బిత్తరచూపులతో చేశాడు. అతని యాస ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. మా నాయిక చిత్ర సినిమాలోనూ చాలా అందంగా ఉంది. అందరికీ ఆల్ ది బెస్ట్. ప్రియదర్శి చాలా బాగా చేశాడు. తను ఈ సినిమాకు పెద్ద హైలైట్ అవుతాడు. సితారగారు తల్లి పాత్రలో చాలా బాగా చేశారు. సితారకు, రాజ్‌తరుణ్‌కి మధ్య ఉన్న తల్లీ కొడుకుల రిలేషన్ షిప్ చాలా బాగా పండింది. ఆమె చాలా చక్కగా డబ్బింగ్ కూడా చెప్పారు. ఆమె ఎక్స్‌ప్రెషన్స్‌కి డబ్బింగ్ చాలా బాగా కుదిరింది. ఈ సంక్రాంతికి స్వీట్ లవ్లీ ఫిల్మ్ అవుతుంది. 'రంగులరాట్నం'లాగా చక్కగా, హాయిగా చూడొచ్చు" అన్నారు.

17న టీఎస్సార్ కాకతీయ కళావైభవ మహోత్సవం



ఎప్పుడూ కళలను, కళాకారులను గౌరవిస్తూ, ప్రోత్సహించే మంచి మనసున్న మనిషి 'కళాబంధు' టి. సుబ్బరామిరెడ్డి. టీఎస్సార్ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, బెంగళూరు, విశాఖపట్టణం నగరాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. ఇప్పుడు కాకతీయుల వైభవాన్ని చాటి చెప్పే విధంగా 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' నిర్వహించనున్నట్టు తెలిపారు. టీఎస్సార్ కాకతీయ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాద్‌లో జరగనున్న ఈ వేడుక వివరాలు తెలియజేయడం కోసం శనివారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు.

టి. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ– "కాకతీయుల పరిపాలన స్వర్ణయుగం. 600 ఏళ్ల క్రితమే తెలుగు సంస్కృతి, నాగరికతలు ఘనంగా చాటారు. కళల్ని పోషించారు. ఎన్నో గొప్ప దేవాలయాలను శిల్పకళా నైపుణ్యం, చాతుర్యంతో నిర్మించారు. శ్రీకృష్ణదేవరాయల కంటే ముందు నుంచి తెలుగుజాతికి వారసత్వాన్ని అందించారు. వరంగల్ రాజధానిగా 300 ఏళ్లు తెలుగువారిని పరిపాలించారు. వాళ్ల పేరు మీద 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ నెల 17న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఈ వేడుక నిర్వహిస్తాం. మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు చేతుల మీదుగా వేడుక ప్రారంభమవుతుంది. ఈ వేడుకలోనే సుమారు 560 చిత్రాల్లో నటించి, చిత్రపరిశ్రమలో 42 ఏళ్లు పూర్తి చేసుకున్న మోహన్ బాబును 'విశ్వ నట సార్వభౌమ' బిరుదుతో సత్కరిస్తున్నాం. పలువురు ఆధ్యాత్మిక, రాజకీయ, సినీ, సాంస్కృతిక ప్రముఖులు ఈ మహోత్సవానికి హాజరు కానున్నారు. తర్వాత తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో రెండు మూడు నెలలకు ఒకసారి కాకతీయ సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహిస్తాం" అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ– "కళాకారులను, కళలను గౌరవించే వ్యక్తుల్లో టి. సుబ్బరామిరెడ్డిగారు ముందుంటారు. కాకతీయుల కళా వైభవాన్ని ప్రజలకు చాటి చెప్పాలనుకోవడం అభినందనీయం. ఇక, నాకు ఇవ్వనున్న 'విశ్వ నట సార్వభౌమ' బిరుదు గురించి ముందు చెప్పగానే... 'బిరుదులు నాకు ఎందుకు?' అన్నాను. వద్దని విశాఖలో చెప్పాను. మళ్లీ ఇప్పుడు ఇస్తున్నట్టు చెప్పారు. దాంతో ఆయన అభీష్టాన్ని కాదనలేకపోయా" అన్నారు.

ఈ కార్యక్రమంలో రచయిత–నటుడు పరుచూరి గోపాలకృష్ణ, 'లయన్ క్లబ్' సభ్యులు, 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, కూచిపూడి నృత్య కళాకారిణులు పద్మజ, సుజాతలు పాల్గొన్నారు.

బాలయ్య పెర్‌ఫార్మెన్స్‌కి బ్రహ్మాండమైన రెస్పాన్స్!



జై సింహా సినిమాకి వస్తున్న స్పందన చాలా సంతోషాన్నిస్తోందని అంటున్నారు చిత్ర దర్శకుడు కె.ఎస్. రవికుమార్. బాలకృష్ణ, నయన తార, హరిప్రియ, నటాషా, ప్రకాష్ రాజ్, మురళీ మోహన్, అశుతోష్ రాణా, బ్రహ్మానందం ముఖ్య తారాగణంగా రూపొందిన 'జై సింహా' జనవరి 12న విడుదలై విజయవంతంగా ప్రదర్శితం అవుతోంది. ఈ సందర్భంగా కె.ఎస్.రవికుమార్ మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు. బాలకృష్ణకు మాస్ ఫాలోయింగ్ ఎక్కువ. అలాంటిది నేను కేవలం క్లాస్ ప్రేక్షకుల్ని దృష్టిలో పెట్టుకుని సినిమా తీస్తే బాగుండదు. అందుకే మాస్ ఆడియన్స్ కోసం 'జై సింహా' వంటి కథే ఎంచుకున్నాను. తమిళంలో రజనీకాంత్ ఎలాగో ఇక్కడ బాలకృష్ణ అలాగ. ఆయనకు కమల్ హాసన్‌లా క్లాస్ కథలు రాస్తే సరిపోదు. మాస్ కథలే సరిగ్గా సరిపోతాయి. అందుకే ఆ కథను ఎంచుకున్నాం. అనుకున్నట్టే కథలోని ఎమోషన్, సెంటిమెంట్ మాస్ ఆడియన్స్‌కి కనెక్టయ్యాయి. బాలయ్య ఫ్యాన్స్‌తో పాటు అందరూ విపరీతంగా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రొడ్యూసర్ సి.కళ్యాణ్ ఎక్కడా రాజీ పడకుండా సినిమాని అద్భుతంగా వచ్చేందుకు ఎంతో కృషి చేశారు' అన్నారు.

విజయ్ దేవరకొండ వివాహం



బోల్డ్ ప్రేమ కథతో తెరకెక్కిన అర్జున్ రెడ్డి సినిమా టాలీవుడ్ పాత్ బ్రేకింగ్ మూవీగా రికార్డ్ కెక్కింది. కలక్షన్ల వర్షం కురిపించింది. ఈ చిత్రంతో విజయ్ దేవరకొండ స్టార్ హీరో అయిపోయాడు. సినిమాలోనే కాదు .. ఇతనికి రియల్ లైఫ్‌లోనూ మంచి ప్రేమకథ ఉందంట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా అభిమానులతో చెప్పారు. రీసెంట్‌గా హన్మకొండలో ఒక షోరూమ్ ప్రారంభించిన విజయ్ అక్కడ తన ప్రేమ గురించి బయటపెట్టారు. "నేను వరంగల్‌కు చెందిన అమ్మాయినే పెళ్లి చేసుకుంటాను" అని మీడియా ముఖంగా స్పష్టం చేశారు. దీంతో అతని లవ్ స్టోరీ లీకయింది. విజయ్ కాలేజీలో చదువుతున్న రోజులలోనే వరంగల్ అమ్మాయితో ప్రేమలో పడ్డారంట.

మంచు లక్ష్మి ముంగిట్లో సంక్రాంతి సందడి

ప్రముఖ సినీనటి, నిర్మాత మంచులక్ష్మి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో ఫిల్మ్ నగర్‌లోని తన నివాసంలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. టీచ్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జంటనగరంలో 38 ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 50 మంది విద్యార్థులు మంచు లక్ష్మి నివాసానికి చేరుకొని సందడి చేశారు. ప్రతిభాపాటవాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతోపాటు, టీచ్ ఫర్ చేంజ్ వాలంటీర్లకు మంచు లక్ష్మి సంక్రాంతి విందు భోజనాన్ని వడ్డించారు. ప్రతి సంవత్సరం పండుగల సందరేంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఫైవ్ స్టార్ హోటల్‌కు తీసుకెళ్లి వేడుక జరుపుకునేవారమని, ఈ సంక్రాంతికి తన నివాసంలో సంబరాలు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పేద, ధనిక అంతరాన్ని విద్యార్థుల్లో రానివ్వకుండా చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంచు లక్ష్మి తెలిపారు. తద్వారా పిల్లల్లో స్ఫూర్తి కలగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీచ్ ఫర్ చేంజ్ వ్యవస్థాపకుడు చైతన్యతోపాటు 25 మందికిపైగా వాలంటీర్లు పాల్గొన్నారు.



సరికొత్త పాత్రలో శ్రియ

శ్రీయ ముఖ్య పాత్రలో కొత్త చిత్రం ప్రారంభమైనది. సుజన దర్శకురాలిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని కంచె, గౌతమిపుత్ర శాతకర్ణి వంటి చిత్రాలకు ఛాయాగ్రాహకుడైన జ్ఞాన శేఖర్ వి.ఎస్. నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కటిక పేద కుటుంబానికి చెందిన అమాయకురాలైన యువతిగా శ్రీయ నటించనున్నారు. ఇదివరకు 'మిడ్‌నైట్ చిల్డ్రన్' అనే హాలీవుడ్ చిత్రంలో ఆమె ఈ తరహా పాత్రలో కనిపించారు. సంగీతం ప్రధానంగా సాగే ఈ చిత్రానికి లెజెండరీ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీతం అందిస్తారు. సాయి మాధవ్ బుర్రా ఈ చిత్రానికి మాటలు రాస్తుండటం మరో విశేషం. ప్రీ–ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం మార్చ్ నెలలో సెట్స్ పైకి వెళ్లనుంది.







ఐటీ అధికారుల తనిఖీలో లభ్యం

శశికళ గదిలో సీక్రెట్ లేఖ

చెన్నై: జయలలిత మరణం తర్వాత పోయెస్ గార్డెన్‌లోని ఆమె ఇంటికి చేరిన శశికళ ఓ గదిని ఆక్రమించుకున్నారు. అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు వెళ్లే వరకు అక్కడే ఉన్నారు. ఇప్పుడా గదిలో ప్రభుత్వానికి తాము రాసిన అత్యంత రహస్య లేఖ ఒకటి లభ్యమైనట్టు ఆదాయపన్ను అధికారులు మద్రాస్ హైకోర్టుకు తెలిపారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గుట్కా స్కామ్ నిందితులపై చర్యలు తీసుకోవాల్సిందిగా రాసిన రహస్య లేఖ ఆమె గదిలో లభ్యమైనట్టు కోర్టుకు తెలిపారు. గుట్కా కుంభకోణంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ డీఎంకే ఎమ్మెల్యే జె.అంబగళన్ కోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనికి స్పందిస్తూ ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ డైరెక్టర్ సుసీ బాబు వర్గీస్ కోర్టుకు దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఈ లేఖ విషయాన్ని వెల్లడించారు. గుట్కా స్కామ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలువురు అత్యున్నత స్థాయి అధికారులు, పోలీసుల పాత్ర ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో అప్పటి ఐటీ విభాగ ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆగస్టు 11, 2016న తమిళనాడు చీఫ్ సెక్రటరీ, డీజీకి లేఖ రాశారు. సీజ్ చేసిన గుట్కాలకు సంబంధించిన సమాచారం వారి వద్ద ఉన్నట్టు అందులో పేర్కొన్నారు. కాగా, ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సిందేనని ఆ లేఖలో ఉన్నట్టు తాజాగా కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నవంబరు 17, 2017న వేదనిలయంలోని శశికళ గదుల్లో నిర్వహించిన సోదాల్లో సెప్టెంబరు 2, 2016 తేదీతో అప్పటి డీజీపీ సంతకంతో అప్పటి ముఖ్యమంత్రి జయలలితకు పంపిన రహస్య ఐటీ లేఖ లభ్యమైంది.

సూర్య
హైదరాబాద్
ఆదివారం 14 జనవరి 2018

కాలిబాటన సరిహద్దుకు వెళ్లిన జవాన్లు

- సరిహద్దుల్లో మెరుగుపడని సౌకర్యాలు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న జవాన్లు
- చైనాలో పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నం
- బిషింగ్ గ్రామం వద్ద చైనా రోడ్డు నిర్మాణం



న్యూఢిల్లీ:ఈశాన్య ప్రాంతాల్లో ఇప్పటికీ అభివృద్ధి అంతంతమాత్రమే. ఇక సరిహద్దుల గురించైతే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటికే సరిహద్దు గ్రామాల్లో కనీసం రోడ్డు మార్గం కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల వల్ల అక్కడి ప్రజలతో పాటు దేశ రక్షణ కోసం అహర్నిశలు విధులు నిర్వహిస్తున్న జవాన్లు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిహద్దుకు వెళ్లాలంటే కాలినడక తప్ప మరో మార్గం లేకపోవడంతో గంటల పాటు నడుస్తున్నారు. మరోవైపు పొరుగుదేశం చైనాలో మాత్రం పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. చైనా బలగాలు సరిహద్దుల వద్దకు నేరుగా వాహనాల్లో వచ్చేందుకు అక్కడ మెరుగైన రోడ్డు సదుపాయాలున్నాయి. ఇటీవల ఇరు దేశాల మధ్య చోటుచేసుకున్న ఘటనే ఇందుకు నిదర్శనం. భారత్–చైనా మధ్య గతేడాది డోక్లాం వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. దాదాపు రెండున్నర నెలల పాటు నెలకొన్న ఆ ప్రతిష్టంభన గత ఆగస్టులో తొలగిపోయింది. అయితే డోక్లాం తర్వాత మరో ప్రాంతంలోనూ ఇలాంటి వివాదానికి తెరతీసే ప్రయత్నం చేసింది చైనా. అందుకోసం ఇరు దేశాల మధ్య ఎప్పటి నుంచో వివాదాస్పద ప్రాంతంగా ఉన్న అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాన్ని ఎంచుకుంది. ట్యూటింగ్ ప్రాంతంలోని బిషింగ్ గ్రామం వద్ద చైనా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రయత్నించింది. దీంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇరుదేశాల అధికారుల చొరవతో ఆ సమస్య పరిష్కారమైంది. ఇదిలా ఉండగా.. ఆ సందర్భంలో జవాన్లకు దుర్భర పరిస్థితులు తప్పలేదు. బిషింగ్ గ్రామం వద్ద ఉన్న సరిహద్దు వద్దకు చైనా తమ సామగ్రితో వాహనంలో చేరుకుంది. ఇది గుర్తించిన ఓ స్థానికుడు వెంటనే భారత సైన్యానికి సమాచారమిచ్చాడు. దీంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు వెనువెంటనే 120 మంది సిబ్బందిని ఆ ప్రాంతానికి వెళ్లమని ఆదేశించారు. నెలరోజుల పాటు అక్కడే ఉండేలా సరకులు కూడా తీసుకెళ్లమని చెప్పారు. అంతా బాగానే ఉంది కానీ.. మరి అక్కడకు వెళ్లడం ఎలా..? బిషింగ్ ఓ మారుమూల ప్రాంతం. అక్కడ జనాభా చాలా తక్కువ. రోడ్డు సదుపాయం కూడా లేదు. అక్కడికి చేరుకోవాలంటే ఎంతో ప్రయాస. కాలినడక తప్ప మరో మార్గం ఉండదు. చేసేదేం లేని పరిస్థితుల్లో భారత జవాన్లు నడకబాట పట్టారు. మరి సరుకుల పరిస్థితి? 120 మంది 30 రోజుల పాటు ఉండాలంటే చాలా సరకులు కావాలి. దీంతో పోర్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరు 10 నుంచి 15 కిలోల చొప్పున మోసుకుంటూ దాదాపు 300 మంది పోర్టర్లు సరిహద్దుకు వెళ్లారు. అలా దాదాపు 19 గంటల పాటు నడిచి సరిహద్దుకు చేరుకున్నారు. రక్షణశాఖ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారమే ఈ విషయాలన్నీ తెలిశాయి.

ముంబై తీరంలో కూలిన చాపర్



ముంబై: ఐదుగురు ఓఎన్‌జీసీ ఉద్యోగులు, ఇద్దరు పైలెట్లతో వెళ్తున్న హెలి కాప్టర్ ముంబై తీరంలో కూలింది. ఈ ఘటనలో నాలుగు మృతదేహాలను వెలికితీశారు. మిగతా ముగ్గురు కూడా చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. పవన్ హన్స్ హెలికాప్టర్ శనివారం ఉదయం 10:14కు జూహూ ఏర్రోడ్రోమ్ నుంచి బయల్దేరింది. పావు గంట ప్రయాణించిన తర్వాత ఏటీసీతో సంబంధాలు కోల్పోయింది. ముంబై సముద్రానికి తీరానికి 50 కి.మీ. దూరంలో ఇది కూలిపోయిందని గుర్తించారు. చాపర్ ఏటీసీతో సంబంధాలు కోల్పోవడంతో అప్రమత్తమైన కోస్ట్ గార్డ్ డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్, నౌకలతో గాలింపు చర్యలు ప్రారంభించింది. హెలికాప్టర్ కూలిపోయిందని భావిస్తోన్న చోట శకలాల లాంటివి లభించాయని రక్షణ శాఖ అధికార ప్రతినిధి తెలిపారు.

మహిళా టీచర్ల నిరసన



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో టీచర్లు పోరాట బాట పట్టారు. సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలంటూ అధ్యాపక్ అధికార్ యాత్రను నిర్వహిస్తున్నారు. బదిలీలు చేయడంలో సక్రమమైన విధానాన్ని అనుసరించాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపేందుకు వినూత్న మార్గాన్ని వీరు ఎంచుకున్నారు. తమ తలనీలాలను తీసేసి, గుండు చేయించుకుని నిరసన తెలుపుతున్నారు.

ట్రంప్ ఆరోగ్యం భేషుగ్గా ఉంది

- కొన్ని గంటల పాటు జరిగిన వైద్య పరీక్షలు
- డాక్టర్ రోనీ జాక్సన్ నేతృత్వంలో నిర్ధారణ
- ట్రంప్ ఆరోగ్యస్థితిపై 16న నివేదిక
- ట్రంప్ మరో లీల వెలుగులోకి!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం భేషుగ్గా ఉందని ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ అన్నారు. అధ్యక్షుడిగా ట్రంప్ ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో డాక్టర్ రోనీ జాక్సన్ నేతృత్వంలో కొన్ని గంటల పాటు ఈ పరీక్షలు జరిగాయి. బీపీ, కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్, గుండె స్పందన, బరువు వంటి పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం డాక్టర్ రోనీ జాక్సన్ కొద్ది సేపు మీడియాతో మాట్లాడారు. ట్రంప్ చక్కగా ఆరోగ్యంగా ఉన్నారని రోనీ అన్నారు. ట్రంప్ ఆరోగ్యస్థితిపై పూర్తి నివేదికను జనవరి 16న మీడియాకు వెల్లడించనున్నారు. గత మూడు ప్రభుత్వాల సమయంలోనూ డాక్టర్ రోనీనే అధ్యక్షుడికి ఫిజీషియన్‌గా ఉన్నారు. సాధారణంగా ప్రతి అధ్యక్షుడికి రొటీన్ హెల్త్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. అయితే ఇటీవల కొందరు ఆయన మానసికస్థితిపై అనుమానాలు వ్యక్తంచేశారు. ఆయన చేస్తున్న వ్యాఖ్యలు, ప్రవర్తిస్తున్న తీరును చూస్తుంటే ఆయన మానసికంగా ఫిట్‌గా లేరంటూ ఎద్దేవా చేశారు. దీంతో ఆగ్రహించిన ట్రంప్ తనను తాను చాలా తెలివైన వ్యక్తినని, స్మార్ట్ అని ట్విటర్‌లో పేర్కొన్నారు. అయితే వైద్య పరీక్షల్లో ట్రంప్ మెంటల్ ఫిట్‌నెస్ టెస్ట్ లేదని ఇప్పటికే వైట్‌హౌస్ వెల్లడించింది. ట్రంప్ అంటేనే వివాదాలకు మారుపేరుగా మారిపోయారు. నిత్యం ఏదో ఒక వివాదం అతణ్ని చుట్టుముడుతూనే ఉంది. అక్కడి మీడియా కొత్తగా ఒక విషయాన్ని బయటపెట్టింది. ఎన్నికల్లో తనకు అడ్డు రాకూడదని ఓ పోర్న్ తారకు డబ్బిచ్చి నోరుమూయించాడని వెల్లడించింది. 2006లో జరిగిన ఓ గోల్ఫ్ లీగ్ సమయంలో ట్రంప్‌కు స్టెఫానీ క్లిఫోర్డ్ అనే పోర్న్ తారతో పరిచయం ఏర్పడింది. తరవాత కూడా ట్రంప్ ఆమెను కలిశాడు. ఎన్నికల సమయంలో ఈ విషయాన్ని బయటపెట్టకూడదని తన లాయర్ ద్వారా స్టెఫానీకు 1,30,000 డాలర్లను ముట్టజెప్పాడని అక్కడి మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఈ వార్తలను వైట్‌హౌస్ కొట్టివేసింది. అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో చాలామంది మహిళలు ట్రంప్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.



సీఎంల వార్ ముదిరింది



లక్నో : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ ట్వీట్‌తో ఎదురు దాడి చేశారు. తాను హిందువునని సిద్ధ రామయ్య చెప్పుకోవడంపై యోగి స్పందిస్తూ ఒక నిమిషంపైగా నిడివిగల వీడియోను ఉత్తర ప్రదేశ్ బీజేపీ శాఖ ట్విటర్ ఖాతాలో పెట్టారు. ఈ వీడియోలో గత మూడేళ్ళలో కర్ణాటకలో మరణించిన హిందువుల ఫొటోలను పెట్టారు. యోగి అడిగినవుడు సిద్ధరామయ్య తాను హిందువునంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై కూడా యోగి ఈ వీడియోలో విరుచుకుపడ్డారు. గుజరాత్ ఎన్నికల సమయంలో అనేక దేవాలయాలను సందర్శించారని, హిందువునని ప్రకటించుకున్నారని పేర్కొన్నారు. దేశంలో చీలిక తెచ్చేందుకు మతాన్ని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ళలో మీరు కొంచెమైనా పని చేసి ఉంటే, కాంగ్రెస్ నేత రాజ్‌కున్వర్‌కు వంట చేయవలసిన అవసరం ఉండేది కాదన్నారు. కర్ణాటకలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,002 రైతు ఆత్మహత్యలు జరిగాయని పేర్కొన్నారు. సిద్ధరామయ్యపై అవినీతి కేసుల గురించి ప్రస్తావించారు.

రాహుల్ గాంధీతో సీఎం భేటీ



న్యూఢిల్లీ : కర్ణాటకలో కాంగ్రెస్ పరిస్థితిపై రాహుల్ గాంధీ చాలా సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేకత లేకపోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నిటినీ తన ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ఆయన నివాసంలో శనివారం ఉదయం సిద్ధరామయ్యతోపాటు మరికొందరు సీనియర్ కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. ఏప్రిల్–మే నెలల్లో కర్ణాటక శాసన సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల సిద్ధరామయ్య మాట్లాడుతూ బీజేపీ, ఆరెస్సెస్ హిందుత్వ అతివాదులని ఆరోపించిన సంగతి తెలిసిందే. కర్ణాటకలో హిందూ వ్యతిరేక ప్రభుత్వం ఉందని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆరోపించారు.

ఆ మగవాళ్లిద్దరూ ఇష్టపడ్డారు



ముంబై: యావత్మాల్‌లో స్వలింగ సంపర్క (గే) వివాహం జరిగింది. స్థానిక ప్రముఖ పుస్తక విక్రేత తనయుడు ఇండోనేషియ యువకుడితో ఇటీవల పెళ్లి చేసుకున్నాడు. మహారాష్ట్రలోని యావత్మాల్‌లోని ఓ విలాసవంతమైన హోటల్‌లో ఈ పెళ్లి తంతు జరిగింది. గత ఏడాది డిసెంబర్ 30వ తేదీని ఈ స్వలింగ సంపర్క వివాహం జరిగినట్లు తెలుస్తున్నది. ఈ విషయం బయట ఎక్కడ పొక్కకుండా ఎంతో జాగ్రత్త పడ్డారు. ఈ పెళ్లికి తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించడంతో కేవలం దగ్గరి బంధువులను మాత్రమే ఆహ్వానించారు. కాగా వారిని ఒప్పించి మరీ పెళ్లి చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. పెళ్లికి ముందు హిందు సంప్రదాయం ప్రకారం ఇరువురికి పసుపు రాయడం, ఇతర తంతు పూర్తి చేశారు. బయట వ్యక్తులెవరు లోపలికి రాకుండా, బంధువుల్లో కూడా ఎవరు ఫొటోలు, వీడియో తీయకుండా నిఘావేసినప్పటికీ ఓ ఫోటో వైరల్ కావడంతో బయట ప్రపంచానికి తెలిసింది. యావత్మాల్‌కు చెందిన 40 ఏళ్ల హృషి మోహన్‌కుమార్ సత్వానే అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంటున్నాడు. కుటుంబసభ్యులు, స్నేహితుల ఆశీస్సులతో అతను పెళ్లి చేసుకున్నాడు. ఇండోనేషియాకు చెందిన విన్‌ను తన భాగస్వామిగా మార్చుకున్నాడు. హృషి మోహన్‌కుమార్ బాంబే ఐఐటీ నుంచి బీటెక్ పూర్తి చేశాడు. ఇతను అమెరికాలో గ్రీన్ కార్డు హోల్డర్. మొదట్లో అతని పేరెంట్స్ గే మ్యారేజ్‌కు అంగీకరించలేదు. కానీ చివరకు పెళ్లికి ఓకే చెప్పేశారు.

ఓటు వేయలేదని అత్యాచారం.. హత్య

రాంచీ : జార్ఖండ్‌లో మరో దారుణం చోటు చేసుకుంది. ఎన్నికల్లో తన భార్యకు మద్దతు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఒక కుటుంబంపై పగ పెంచుకుని దాష్టీకానికి పాల్పడ్డాడు. ఆ కుటుంబంలోని 13 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడి.. కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. పాకూరు జిల్లా లిట్టిపారా గ్రామ పంచాయితీలో ముఖియా పదవి కోసం కొన్నాళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. ప్రేమ్‌లాల్ హంసద అనే వ్యక్తి భార్య ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ఆమెకు ఓటు వేయలేదు. దీంతో వారి మూలంగానే తన భార్య ఓడిపోయిందన్న కోపంతో ప్రేమ్‌లాల్ రగిలిపోయాడు. జనవరి 8న బహిర్భూమికని వెళ్లిన బాలికను తన సోదరుల సహకారంతో అపహరించాడు. ఆపై వారంతా కలిసి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడి, ప్రాణాలు తీశారు. చివరకు బాలిక మృతదేహాన్ని సమీపంలోని బ్లైవాన్ అటవీ ప్రాంతంలో పడేశారు. బాలిక కనిపించకుండా పోయే సరికి ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిచ్చిన సమాచారం మేరకు బాలిక శవాన్ని స్వాధీనపరుచుకున్నారు. ఆపై నిందితులపై తల్లిదండ్రుల ఫిర్యాదు చేయటంతో వారిని అరెస్ట్ చేశారు.

ఆర్మీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : జమ్మూ–కశ్మీరులో విద్యా విధానంపై ఇండియన్ ఆర్మీ చీఫ్ జనరల్ బీ పీ రావత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని సామాజిక మాధ్యమాలు, ప్రభుత్వ పాఠశాలలు భారీగా తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల యువత తీవ్రవాద ప్రేరేపితులవుతున్నట్లు తెలిపారు. మదరసాలు, మసీదులు కూడా దీనిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయన్నారు. వీటిపై నియంత్రణ అవసరమని తెలిపారు. రాష్ట్రంలో విద్యా విధానంపై పునఃసమీక్ష జరపాలన్నారు. కశ్మీరులోని ఏ పాఠశాలకు వెళ్ళినా, రెండు మ్యాపులు కనిపిస్తాయన్నారు. ఒకటి ఇండియా మ్యాప్ కాగా, మరొకటి జమ్మూ–కశ్మీరు మ్యాపు అని వివరించారు. జమ్మూ–కశ్మీరు మ్యాపు ప్రత్యేకంగా ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితుల్లో బాలలు తాము ఈ దేశంలో భాగమని ఓవైపు అనుకుంటూనే, మరోవైపు తనకు ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లు విశ్వసిస్తారన్నారు. ప్రాథమిక సమస్య క్షేత్రస్థాయి నుంచి ఇక్కడే ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అవినీతిమయమైందన్నారు.

సముద్రంలో బోటు బోల్తా

ముంబై: మహారాష్ట్రలో మరో ప్రమాదం సంభవించింది. 40 మంది విద్యార్థులతో ప్రయాణిస్తోన్న బోటు సముద్రంలో బోల్తా పడింది. ముంబై సమీపంలోని దహను బీచ్ వద్ద ఈ ప్రమాదం వాటిల్లిందని జరిగిందని న్యూస్ ఏజెన్సీ ఏఎన్ఐ తెలిపింది. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 35 మంది విద్యార్థులను కాపాడగలిగారు. మిగతా చిన్నారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. ప్రమాదం సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. కోస్ట్‌గార్డ్ షిప్‌లు, హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నారు. శనివారం ఉదయం 11:30 గంటల సమయంలో బోటు బోల్తా పడిందని ముంబై మిర్రర్ స్పష్టం చేసింది. ప్రమాదానికి గురైన చిన్నారులంతా వీరంతా కేఎల్ పొండా హైస్కూల్ విద్యార్థులని తెలుస్తోంది. పిక్నిక్ కోసం బీచ్‌కు వెళ్లగా ఈ ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకూ నలుగురు చిన్నారుల మృతదేహాలను వెలికితీసినట్లు తెలుస్తోంది.

ఉత్తర కొరియా అధీనంలో మరో దేశం..!

- సొరంగ యుద్ధానికి అమెరికా సైన్యం సిద్ధం
- వేగుల సమాచారం ఆధారంగా రూటు మార్చుకున్న వైనం
- ఉత్తర కొరియా సరిహద్దుల్లో 5 వేల సొరంగాలు
- వీటిలో శతఘ్నులు, అణు, జీవ, రసాయన ఆయుధాలు?



న్యూఢిల్లీ:ఉత్తరకొరియాతో యుద్ధానికి సిద్ధమవ్వాలంటే అమెరికా తలప్రాణం తోకకొస్తోంది. ఇప్పటి వరకు వైమానిక దాడులు చేస్తామన్నట్లు హడావుడి చేసిన అమెరికా.. తాజాగా అందిన వేగుల సమాచారం ఆధారంగా రూటు మార్చుకొంది. ఆకాశ యుద్ధం చేయడం వల్ల ఉత్తరకొరియా అణుబాంబులను భద్రపర్చిన ప్రదేశాలను గుర్తించలేమని నిపుణులు నివేదికలు ఇవ్వడంతో పదాతి దళంతో యుద్ధానికి దిగాలని నిర్ణయించుకుంది. కానీ, ఉత్తర కొరియా మొత్తం భారీగా సొరంగాలు ఉన్నాయని సైనిక నిఘా వర్గాలు ధ్రువీకరించుకున్నాయి. ఉత్తర కొరియా సరిహద్దుల్లోనే దాదాపు 5వేల సొరంగాలు ఉన్నట్లు అమెరికా సైనిక వర్గాలు గుర్తించాయి. దీంతో వేలసంఖ్యలో అమెరికా సైనికులకు ప్రత్యేక శిక్షణను ప్రారంభించారు. సొరంగాల్లో ఏ విధంగా యుద్ధం చేయాలో ఈ శిక్షణలో నేర్పిస్తున్నారు. దీనికోసం పెంటగాన్ పెద్ద ఎత్తున సైన్యానికి ఉపయోగపడే పరికరాలను కొనుగోలు చేసింది. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న సైనికులకు తోడు వాయుసేనలోని 101 ఎయిర్‌బార్న్ డివిజన్, 82వ ఎయిర్‌బార్న్ డివిజన్‌లకు కూడా ఈ శిక్షణ ఉండవచ్చని భావిస్తున్నారు. సాధారణంగా సొరంగ యుద్ధానికి ఒకటి లేదా రెండు డివిజన్లనే సిద్ధం చేస్తారు. కానీ, ఉత్తర కొరియాలోని పరిస్థితికారణంగాభారీ సంఖ్యలో సైనికులకు ఈ శిక్షణను ఇవ్వాల్సి వస్తోంది. ఉత్తర కొరియాలోని సొరంగాలు ప్రమాదకర ఆయుధాలకు అడ్డాలని అమెరికా నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. వీటిల్లో శతఘ్నులు, అణు, జీవ, రసాయన ఆయుధాలు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే ఉత్తరకొరియా వద్ద దాదాపు 5,000 టన్నుల జీవ, రసాయన ఆయుధ నిల్వలు పోగుబడి ఉన్నట్లు నిఘా సమాచారం. ఉత్తరకొరియా పాలకుడు కిమ్ –2 సంగ్ పాలనలోనే సొరంగాలకు శ్రీకారం చుట్టారు. దక్షిణ కొరియాపై దాడి చేయాలనే లక్ష్యంగా వీటిని నిర్మించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. గంటకు 30,000 మంది సైనికులు వీటిద్వారా వేగంగా దక్షిణ కొరియాలో చొరబడేలా చేయాలన్నది అప్పట్లో ఆయన లక్ష్యం. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. అప్పట్లో ఒక టన్నెల్‌ను ఏకంగా దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు 32మైళ్ల సమీపం వరకు తవ్వారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు రెజ్లర్లు మృతి



ముంబై: మహారాష్ట్రలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు రెజ్లర్లు సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. పశ్చిమ మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాలో శనివారం ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఔంద్‌లో జరిగిన స్థానిక పోటీల్లో పాల్గొని తిరిగి వస్తుండగా.. వారు ప్రయాణిస్తోన్న వాహనం ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. కడేగావ్–సంగ్లీ మార్గంలో జరిగిన ఈ ప్రమాదంలో ఏడుగురు గాయపడినట్లు తెలుస్తోంది. వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఎదురుగా వచ్చి కారును ఢీకొట్టడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పరారీలో ఉన్నాడు. గాయపడిన వారికి సంగ్లీలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన రెజ్లర్లు క్రాంతి కుస్తీ సంకుల్‌కు చెందిన వారని తెలుస్తోంది.

నమామి గంగే సవ్యంగా సాగేనా?

- గంగానదిని కలుషితం చేస్తున్న పలు పరిశ్రమలు
- ఈ జాబితాలో రామ్‌దేవ్ బాబా పతంజలి కంపెనీ
- సియాంగ్ నదీ జలాలు కూడా తీవ్ర స్థాయిలో కలుషితం
- గంగా నది ప్రక్షాళన నిధులు సైతం ఖర్చు కాలేదు: కాగ్



న్యూఢిల్లీ: ప్రభుత్వం 'నమామి గంగే' పేరుతో గంగానది పరిరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందుకోసం రూ.20,000 కోట్లను వెచ్చించి నదిని పరిశుభ్రపరచాలని నిర్ణయించారు. అయితే గంగానదిని కలుషితం చేస్తున్న పరిశ్రమల జాబితాలో యోగా గురు రాందేవ్ బాబా పతంజలి కంపెనీ సైతం ఉన్నట్టు ఇటీవల కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) రిపోర్టులో వెల్లడైంది. గంగానది శుద్ధి అంశం బీజేపీ 2014 లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ వ్యవహారంపై మోడీ సర్కారు చేస్తున్న ప్రకటనలకు, జరుగుతున్న పనులకు మధ్య పొంతన లేదని, గంగా నది ప్రక్షాళన కోసం విడుదల చేసిన నిధులు సైతం ఖర్చు కాలేదని కాగ్ రిపోర్టు బహిర్గతం చేసింది. కాగా సియాంగ్ నదీ జలాలు గత కొన్ని నెలలుగా తీవ్ర స్థాయిలో కలుషితమౌతున్నాయని, సియాంగ్ నుంచి నీటిని టిబెట్లోనే మళ్లించి షిన్జియాంగ్ ప్రావిన్స్ మీదుగా తక్లామకాన్ ఎడారికి తరలించేందుకు చైనా యత్నిస్తోందని, అందుకే జలాలు కలుషితమై రంగు మారి ప్రవహిస్తున్నాయని.. ప్రచారం ముమ్మరంగా సాగింది. ఇందులో ఉన్నవి లేనివీ యథాయక్తి తమ దేశభక్తి జోడించిన కార్పొరేట్ మీడియా తమ వంతు పాత్ర నిర్వహించింది. అయితే చైనా మాత్రం తాము సొరంగం నిర్మించడమే లేదని చెప్తోంది. ఈ ఆరోపణలను కొట్టిపారేసింది. నది నీరు రంగు మారడానికి, తమకు సంబంధం లేదని ప్రకటించింది. నదిలో మురికి నీరు ప్రవహించడానికి కారణమేంటో అంతుచిక్కడం లేదనీ, మళ్లీ నీరు సహజ రంగులో ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అరుణాచల్ తూర్పు లోక్‌సభ సభ్యుడు నినాంగ్ ఇరింగ్ (కాంగ్రెస్) ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ కూడా రాశారు. ఎందుకిలా జరుగుతుందో తేల్చడానికి ఓ అంతార్జాతీయ బృందాన్ని రప్పించాలని ఇరింగ్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే నదీ జలాలను ల్యాబు టెస్టుల నిమిత్తం పంపించారు. నదిలోని నీరు రంగు మారడానికి కారణం కొండచరియలు విరిగిపడిటమేనని సెంట్రల్ వాటర్ కమిషన్ అంటోంది. త్వరలోనే దీనికి సంబంధించిన ఓ స్పష్టమైన కారణాన్ని తెలియజేస్తాం అని కూడా కమిషన్ తెలిపింది. బెంగళూరుకు చెందిన ఎస్సీబీఎస్, ఏటీఆర్ఈఈ పరిశోధన నివేదిక ప్రకారం ఆయా ప్రాంతాల్లో మూడు వారాలుగా అక్కడ కొండ చరియలు విరిగి పడుతుండటంతో, నదీ జలాలు కలుషితమైనట్లు ఆ నివేదిక పేర్కొంది.

మళ్లీ కనిపించిన ఏలియన్లు!

మెక్సికో : మెక్సికో దేశంలోని బాజా రాష్ట్రంలో కనిపించిన మిస్టరీ వస్తువు ప్రజలను ఆందోళనకు గురి చేసింది. దీంతో ఆకాశంలో కనిపించింది ఏలియన్ సంబంధిత ఆకారమే అనే డిబేట్ సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున మొదలైంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియో వైరల్‌గా మారింది. ఇప్పటివరకూ డిస్క్(ఏలియన్ వాహక నౌకగా భావిస్తున్నాం) ఆకారంలో ఉన్న వస్తువును పలు మార్లు గుర్తించిన విషయం తెలిసిందే. తొలిసారి హ్యూమనాయిడ్ రూపంలో ఉన్న గుర్తు తెలియని వస్తువు ఆకాశంలో కనిపించింది. కాగా, 2018లో ఏలియన్లు భూమిపైకి వచ్చాయనే రిపోర్టు రావడం ఇదే తొలిసారి. దీనిపై మాట్లాడిన కాన్స్పిరసీ థియరిస్టు రమీరెజ్.. ఏలియన్లు మన చర్యలను ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నాయని చెప్పారు. అంతరిక్షంలోకి మనం చేస్తున్న ఉపగ్రహ ప్రయోగాలను కూడా అవి క్షుణ్ణంగా గమనిస్తున్నాయని తెలిపారు. మనం చేస్తున్న ప్రయోగాలను యుద్ధానికి సన్నాహకాలుగా అవి భావిస్తున్నాయని అన్నారు.

సూర్య
హైదరాబాద్
ఆదివారం
14 జనవరి 2018
12
సూర్య స్పోర్ట్స్

ధావన్‌ను ఎందుకు తీసుకోలేదు? : గవాస్కర్



సెంచూరియన్ : దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టుకి శిఖర్‌ధావన్‌ను ఎందుకు తీసుకోలేదని టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సెలక్షన్ కమిటీని ప్రశ్నించారు. మేనేజ్‌మెంట్ ధావన్‌ను బలిపశువును చేసిందని అభిప్రాయపడ్డారు. సెంచూరియన్‌లో శనివారం ప్రారంభమైన రెండో టెస్టులో ధావన్, సాహా, భువనేశ్వర్‌ను తప్పించి వారి స్థానంలో కేఎల్ రాహుల్, పార్థివ్ పటేల్, ఇషాంత్ శర్మను తుది జట్టుకు ఎంపిక చేయడం ఏంటని ప్రశ్నించారు. జట్టులో మార్పులు చేయాల్సి వచ్చినప్పుడల్లా మీకు ధావన్ పేరే ఎందుకు గుర్తొస్తుంది? భువనేశ్వర్ స్థానంలో ఇషాంత్‌ను తీసుకోవాల్సిన అవసరం ఏంటి? కేప్‌టౌన్‌లో మూడు వికెట్లు పడగొట్టిన వ్యక్తిని పక్కన పెట్టడం ఎంతవరకు సబబు అనే విషయం నాకర్థం కావట్లేదు? ఇషాంత్‌ను తీసుకోవాలని ఉంటే బూమ్రాపై వేటు వెయ్యచ్చు కదా!. టెస్టు విఫలమవ్వడానికి ఒకే వ్యక్తి ఎలా బాధ్యుడవుతారు? సాహాకి గాయం కారణంగా పార్థివ్‌ను జట్టుకులోకి తీసుకున్నామనడంలో పొంతన కుదరడం లేదు. అని గవాస్కర్ అన్నారు.

విరాట్‌పై ట్విటర్‌లో పేలుతున్న జోకులు

జట్టులో మార్పులపై అవాక్కవుతున్న మాజీలు



సెంచూరియన్ : టీమిండియా తుది జట్టు ఎంపికకు ప్రాతిపదిక ఏమిటో! అనూహ్య మార్పుల వెనక కోహ్లీ, రవిశాస్త్రి వ్యూహాలు ఏమిటో ఎవరికీ ఓ పట్టాన అంతుపట్టడం లేదు! ప్రస్తుత ఫామ్‌ను అనుసరించి టెస్టు స్పెషలిస్టు అజింక్య రహానె బదులు రోహిత్ శర్మను ఎంపిక చేశామని ఇంతకు ముందు కోహ్లీ ప్రకటించాడు. తొలి టెస్టు ముందు వరకు రహానె జట్టులోకి తీసుకుంటారని ఎవరూ ఊహించలేదని ఇప్పుడు అతడిని జట్టులోకి తీసుకోవాలని గొంతు చించుకుటున్నారని శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో తెలిపాడు. వారం రోజుల్లోనే పరిస్థితులు మారిపోయినందుకు తమాషాగా అనిపిస్తోందని అన్నాడు.

ఇప్పుడేమో అద్భుతమైన ఫామ్‌లో ఉండి కీలకంగా నిలిచిన పేసర్ భువనేశ్వర్‌ను తప్పించి రెండో టెస్టుకు ఇషాంత్‌శర్మను ఎంపిక చేశాడు. అదనపు బౌన్స్ లభించే సెంచూరియన్ పిచ్‌కు భువి బౌలింగ్ శైలి సరిపోదని పక్కన పెట్టినట్టు సమాచారం. తొలి టెస్టులో భువీనే అత్యంత కీలకంగా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన బౌలింగ్‌తో టాప్ బ్యాట్స్‌మన్ ఎల్గర్, మార్క్రమ్, హషీమ్ ఆమ్లాను 12 పరుగుల్లోపే పెవిలియన్‌కు పంపించాడు. ఫామ్‌లో ఉన్న డికాక్ (43)ను ఔట్ చేశాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లు వేస్తే అందులో 5 మెయిడిన్లు. కేశవ్ మహరాజ్, మోర్నీ మోర్కెల్ వికెట్లు తీశాడు. ఇక బ్యాటింగ్ పరంగానూ కీలకంగా నిలిచాడు. రెండు ఇన్నింగ్సుల్లో కలిపి 127 బంతులు ఆడాడు. ఆ మ్యాచ్‌లో అందరికన్నా ఎక్కువ బంతులు ఆడింది అతడే. ఫామ్ ఆధారంగా రహానె బదులు రోహిత్‌ను ఎంపిక చేశామని అంటున్న కోహ్లీ మరి అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న భువీని పక్కన పెట్టి ఇషాంత్‌ను ఎందుకు తీసుకున్నాడన్నదే అందరి ప్రశ్న ! అందుకే మాజీ క్రికెటర్ల నుంచి అభిమానుల వరకు ట్విటర్‌లో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని :

★ భువీ లేడు.. నన్ను ఆట పట్టిస్తున్నారా: అలన్ డొనాల్డ్
★ ఊహ (పర్సెప్షన్) ఎప్పుడూ వాస్తవం కాదు! కానీ ఇప్పుడు వాస్తవం కన్నా ఊహకే ఎక్కువ విలువున్నట్టుంది. అందుకే భువి తుది 11 మందిలో లేడు: ఆర్పీ సింగ్
★ తొలి టెస్టులో భువనేశ్వర్ చేసిన తప్పేమిటి: జైనబ్ అబ్బాస్
★ ఈ రోజుల్లో భువి ఫామ్ అనేది షరతులకు లోబడి ఉంటుందేమో! పిచ్ అదనపు బౌన్స్‌కు అనుకూలంగా ఉంటుందని ఇషాంత్ ఆడుతున్నాడేమో: ఆకాశ్ చోప్రా
★ భువి స్థానంలో ఇషాంత్.. అజింక్య బదులు మళ్లీ రోహిత్‌కు అవకాశం. బహుశా అనుష్క శర్మ తుది జట్టును ఎంపిక చేస్తుందేమో: ఓ అభిమాని
★ భువి బాగా బౌలింగ్ చేశాడు. బ్యాటింగ్ చేశాడు. జట్టులో స్థానం కోల్పోవాల్సిందే.
★ ధావన్ స్థానంలో కేఎల్ రాహుల్: ఈ సారి టీమిండియా 30-40 పరుగులు ఎక్కువ చేస్తుంది.
★ భువి స్థానంలో ఇషాంత్: ఈ సారి భారత్ కనీసం 100-200 పరుగులు ఎక్కువగా చేయాలి. అంటూ ట్విట్టర్‌లో జోకులు పేలుతున్నాయి.

ఆఖర్లో ఆశాజనకం

- రెండో టెస్టు తొలి రోజు దక్షిణాఫ్రికా 269/6
- ముందు మురిపించి... ఆ తరువాత ముదిరింది
- బౌలర్లు విజృంభించడంతో ఆఖర్లో పరిస్థితి మెరుగు
- మార్క్రమ్, ఆమ్లా అర్ధశతకాలు



సెంచూరియన్ : భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు ఆట ఆసక్తికరంగా సాగింది. తొలి రెండు సెషన్లలో ఆతిథ్య జట్టు ఆధిపత్యం చెలాయించగా చివరి సెషన్‌లో కోహ్లీసేన చెలరేగింది. వెంటవెంటనే వికెట్లు తీసి మ్యాచ్‌ను కీలక మలుపు తిప్పింది. నిలకడగా ఆడుతూ చక్కని షాట్లతో అలరించిన దక్షిణాఫ్రికా ఆటగాళ్లు అయిడెన్ మార్క్రమ్ (94; 150 బంతుల్లో 15 ఫోర్లు), హషీమ్ ఆమ్లా (82; 153 బంతుల్లో 14 ఫోర్లు) సెంచూరియన్‌లో సెంచరీలు చేయలేకపోయారు! త్రుటిలో పెవిలియన్‌కు చేరారు. ఆట సాగుతున్న కొద్దీ విభిన్నంగా ప్రవర్తించిన పిచ్‌పై భారత పేసర్లు ఏ మాత్రం రాణించలేకపోయారు. చివరికి సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 3/90 చక్కని ప్రదర్శన చేశాడు. 2000 సంవత్సరం తర్వాత ఆసియా అవల తొలి రోజు 31 ఓవర్లు వేసిన భారత తొలి స్పిన్నర్‌గా రికార్డు సృష్టించాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య తన సమయస్ఫూర్తితో చేసిన రనౌట్లు ఆటను భారత్ వైపు తిప్పేశాయి.

వికెట్ కోసం నిరీక్షణ

టాస్ గెలిచిన బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా చాలా చక్కని ఆటతీరును కనబర్చింది. ఓపెనర్లు మార్క్రమ్ (94), డీన్ ఎల్గర్ (31; 83 బంతుల్లో 4 ఫోర్లు) శుభారంభం అందించారు. వీరిద్దరూ భోజన విరామం వరకు నిలకడగా ఆడారు. ఎల్గర్ ఆచితూచి ఆడగా మార్క్రమ్ విజృంభించి ఆడాడు. షమి, బుమ్రా, ఇషాంత్, పాండ్యను లక్ష్యంగా చేసుకుని పరుగులు రాబట్టాడు. చూడచక్కని బౌండరీలు సాధించి విరామానికి ముందే అర్ధశతకం బాదేశాడు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం అందించారు. పసలేని పేస్ కారణంగా ఈ జోడీని విడదీయడానికి అశ్విన్ రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. 30వ ఓవర్ మూడో బంతికి ఎల్గర్‌ను ఔట్ చేశాడు. ఆ తర్వాత హషీమ్ ఆమ్లా (82)తో కలిసి మార్క్రమ్ శతకం వైపు సాగిపోయాడు. ఐతే అనూహ్యంగా జట్టు స్కోరు 148 వద్ద అతడిని అశ్విన్ ఓ చక్కని బంతికి పెవిలియన్‌కు పంపించాడు. దేహానికి దూరంగా ఆఫ్‌సైడ్ వెళ్తున్న బంతిని ఆడబోయి కీపర్ పార్థివ్ చేతికి చిక్కాడు.

సొంతగడ్డపై ఆమ్లా విజృంభణ

సెంచూరియన్ ఆమ్లా అడ్డా! ఇక్కడ అతడికి తిరుగులేని రికార్డు ఉంది. తనకు అచొచ్చిన సెంచూరియన్‌లో ఆమ్లా (82) చక్కగా ఆడాడు. ఈ వేదికలో 1284 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ఒకేఒక్క బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ఏబీ డివిలియర్స్ (20; 48 బంతుల్లో 2 ఫోర్లు)తో కలిసి స్కోర్ బోర్డు పరుగులు పెట్టించాడు. 199 పరుగుల వద్ద ఇషాంత్ బౌలింగ్‌లో ఏబీ ఇన్‌సైడ్ ఎడ్జ్‌గా వెనుదిరిగే లోపు 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ క్రమంలోనే డుప్లెసిస్ (24 బ్యాటింగ్; 77 బంతుల్లో 3 ఫోర్లు) అర్ధశతకం సాధించి శతకం వైపు పయనించాడు. దీంతో తేనీటి విరామానికి స్కోరు 182/2గా ఉంది.

రనౌట్ నుంచి మలుపు తిరిగింది

తికమక పడుతూ సహచరుడిని రనౌట్ చేయించడంలో నిష్ణాతుడైన డుప్లెసిస్ శతకం వైపు పయనిస్తున్న ఆమ్లా పాలిట శాపంగా మారాడు. పాండ్య వేసిన 80.5వ బంతిని ఆమ్లా ఆడాడు. బంతి షార్ట్ లెగ్‌లో పడింది. అవతలి వైపు నుంచి డుప్లెసిస్ పరుగుకు రావడంతో ఆమ్లా వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో బంతిని అందుకున్న పాండ్య అద్భుతమైన రీతిలో నాన్‌స్ట్రైకర్ వికెట్లవైపు బంతిని విసిరి ఆమ్లాను ఔట్ చేశాడు. అప్పుడు జట్టు స్కోరు 246. ఇదే మ్యాచ్‌ను కీలక మలుపు తిప్పింది. ఆ తర్వాత నాలుగు పరుగులకే అశ్విన్ వేసిన 81.1వ బంతికి డికాక్ (0) స్లిప్‌లో కోహ్లీకి చిక్కాడు. సొంతగడ్డపై అతడు డకౌట్ కావడం ఇదే తొలిసారి. మరో పరుగుకే ఫిలాండర్ (0) రనౌట్ అయ్యాడు. డుప్లెసిస్‌కు తోడుగా కేశవ్ మహరాజ్ (10 బ్యాటింగ్) నైట్‌వాచ్‌మన్‌గా బరిలోకి దిగాడు. తొలి రోజు ఆట ముగిసే సరికి దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది.

హార్దిక్ త్రో సూపర్

సెంచూరియన్ : దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా అద్భుతమైన ఫీల్డింగ్‌తో శభాష్ అనిపించాడు. మ్యాచ్‌పై సఫారీలు పట్టుబిగిస్తున్న వేళ హార్దిక్ ఒక అద్భుతమైన త్రో ద్వారా హాషీమ్ ఆమ్లా(82;153 బంతుల్లో 14 ఫోర్లు)ను రనౌట్ చేసి పెవిలియన్‌కు పంపాడు. ఇన్నింగ్స్ 81 ఓవర్‌ను అందుకున్న హార్దిక్.. ఐదో బంతికి ఆమ్లాకు షాకిచ్చాడు. ఆ బంతిని క్రీజ్ దగ్గరగానే డిఫెన్స్ ఆడిన ఆమ్లా పరుగు కోసం యత్నించాడు. అయితే అంతే వేగంగా అథ్లెట్‌ను తలపిస్తూ బంతిపైకి దూసుకొచ్చిన హార్దిక్.. బంతిని అందుకున్న మరుక్షణమే నాన్ స్టైకింగ్ ఎండ్ వైపు వికెట్లను నేలకూల్చాడు. అప్పటికి ఇంకా క్రీజ్‌లో చేరుకోలేని ఆమ్లా భారంగా పెవిలియన్ చేరాల్సి వచ్చింది. దీనిపై రివ్యూకు వెళ్లినా ఆమ్లాకు నిరాశ తప్పలేదు. దాంతో 246 పరుగుల వద్ద సఫారీలు నాల్గో వికెట్‌ను కోల్పోవాల్సి వచ్చింది. అటు తరువాత డీకాక్ డకౌట్‌గా పెవిలియన్ చేరాడు. రవి చంద్రన్ అశ్విన్ బౌలింగ్‌లో కోహ్లికి క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఆపై ఫిలిండర్ రనౌట్‌గా అవుట్ కావడంతో దక్షిణాఫ్రికా 251 పరుగుల వద్ద ఆరో వికెట్‌ను నష్టపోయింది. దక్షిణాఫ్రికా కోల్పోయిన ఆరు వికెట్లలో అశ్విన్ మూడు వికెట్లు సాధించగా, ఇషాంత్ ఒక వికెట్ తీశాడు. రెండు వికెట్లు రనౌట్ల రూపంలో వచ్చాయి.



హెచ్‌సీఏ అవినీతిపై విచారణ

జరపాలి : అజారుద్దీన్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)పై టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లోథా సిఫార్సులను హెచ్‌సీఏ అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. హెచ్‌సీఏ పాలకవర్గం ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని అజారుద్దీన్ విమర్శించారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నేను రాజకీయంగా ఉత్తరప్రదేశ్ నుంచి పోటీ చేశానని క్రికెటర్‌గా యూపీ నుంచి రిజిస్ట్రర్ ఎలా చేసుకుంటాను అని ప్రశ్నించారు. హెచ్‌సీఏ అందరిని పక్కదారి పట్టిస్తోంది. గ్రామీణ క్రీడాకారులకు అవకాశం ఇవ్వడం లేదు. జిల్లా, రూరల్ ప్రాంతాల నుంచి కూడా మంచి క్రీడాకారులు ఉన్నారు. హెచ్‌సీఏ నిర్వహించే టీ20 లీగ్ అంతా నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది. ఆ లీగ్‌కు వివేక్ తన తండ్రి పేరు పెట్టడంపై అందరి ఆమోదం తీసుకోలేదు. హెచ్‌సీఏ లోగోతో వివేక్ తండ్రి వెంకటస్వామి పేరుతో టీ20 లీగ్ నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమే. ఇక బీసీసీఐ నుంచి నాకు క్లియరెన్స్ రాలేదని ఆరోపించారు. కానీ నాకు హైకోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. దీనిపై నేను బీసీసీఐకి నివేదిక పంపాను. కోర్టు ఆదేశాలను బయటకు రానీయకుండా హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ తప్పు చేశారు. చదువుకున్న వ్యక్తులు ఇలా ప్రవర్తించడం బాధాకరం. దీనిపై నేను చట్టపరంగా ముందుకు వెళతా. నాకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌తో ఎలాంటి సంబంధం లేదు. అయితే నన్ను ఓ సెలబ్రెటీగా అందరూ ఆహ్వానిస్తారని అజారుద్దీన్ తెలిపారు.

ఐపీఎల్‌కు భలే గిరాకి

వేలానికి దరఖాస్తు చేసుకున్న1122 మంది క్రికెటర్లు

న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-2018 వేలానికి సిద్ధమవుతోంది. ఇందుకోసం క్రిస్‌గేల్, యువరాజ్ సింగ్, జాయ్ రూట్, షేన్ వాట్సన్‌తో పాటు దాదాపు 1122 మంది క్రికెటర్లు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. ఈ విషయాన్ని శనివారం బీసీసీఐ అధికారికంగా వెల్లడించింది. బెంగళూరు వేదికగా జనవరి 27, 28 తేదీలో ఐపీఎల్ వేలం జరుగుతుంది. ఈ వేలంలో భారత క్రికెటర్లు గౌతమ్ గంభీర్, అశ్విన్, అజింక్య రహానే, స్పిన్ మాంత్రికుడు కుల్దీప్ యాదవ్, ఓపెనర్లు కేఎల్ రాహుల్, ఎం.విజయ్‌ను ఎవరు కొనుగోలు చేస్తారా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు గంభీర్‌ను అట్టి పెట్టుకోకుండా వదిలేసింది. దీంతో గౌతీని ప్రస్తుతం ఎవరు కొనుగోలు చేస్తారనేదీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆటగాళ్ల జాబితాను ఎనిమిది ఐపీఎల్ ఫ్రాంచైజీలకు పంపించారు. వీరిలో 281 మంది క్యాప్‌డ్ ప్లేయర్లు, 838 మంది అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు. వీరిలో 778 మంది భారతీయులు, అసోసియేట్ దేశాలకు చెందిన ముగ్గురు ఆటగాళ్లు ఉన్నట్లు బీసీసీఐ వెల్లడించింది. ఆస్ట్రేలియా (58), దక్షిణాఫ్రికా (57), శ్రీలంక (39), వెస్టిండీస్ (39), న్యూజిలాండ్ (30), ఇంగ్లాండ్ (26)కు చెందిన ఆటగాళ్లు ఐపీఎల్ వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఐపీఎల్ పదో సీజన్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తరవున రెండు శతకాలను నమోదు చేసిన హసీమ్ ఆమ్లా... తన దేశానికే చెందిన డుప్లెసిస్, డీకాక్, డేవిడ్ మిల్లర్, మోర్నె మోర్కెల్, రబాడాతో పోటీగా ఈ వేలంలో అత్యధిక ధర పొందే అవకాశం ఉంది. ఈ ఏడాది ఐపీఎల్-11వ సీజన్ ఏప్రిల్ 4న ప్రారంభమై మే 31తో ముగియనుంది. ఏ ఆటగాళ్లు ఏ జట్టులో ఆడతారో, కొత్త ఆటగాళ్లు ఎవరు వస్తారో.. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో ఎవరు అత్యధిక ధర పలుకుతారో తెలియాలంటో మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

48 బంతుల్లో సెంచరీ



విజయనగరం : సయ్యద్ ముస్తాక్ అలీ టీ 20 ట్రోఫీలో కర్ణాటక ఆటగాడు కరుణ్ నాయర్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. శుక్రవారం తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో కరుణ్ నాయర్ విశ్వరూపం ప్రదర్శించాడు. బౌండరీలే లక్ష్యంగా విరుచుకుపడిన నాయర్ 48 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో ఎనిమిది ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో చెలరేగిన నాయర్ 111 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అవుటయ్యాడు. అంతకముందు హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో నాయర్ సత్తాచాటిన సంగతి తెలిసిందే. 42 బంతుల్లో 77 పరుగులు సాధించి విజయంలో కీలక పాత్ర పోషించాడు. అదే ఊపును తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో కూడా కొనసాగించిన నాయర్ శతకంతో మెరిశాడు. తద్వారా తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. ఆపై భారీ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన తమిళనాడు 16.3 ఓవర్లలో 101 పరుగులకే ఆలౌటై పరాజయాన్ని మూటగట్టుకుంది.

లంబూ ఉద్రేకపరుడు... అందుకే విఫలమవుతాడు!



ముంబై : టీమిండియాలో అనుభవజ్ఞుడైన పేసర్ ఇషాంత్ శర్మ చాలా ఉద్రేకపరుడని అందుకే జట్టు పేస్ బౌలింగ్ దళానికి నాయకత్వం వహించడంలో విఫలమవుతాడని మాజీ పేసర్ రాజు కుల్‌కర్ణి అన్నారు. అతడు (ఇషాంత్) 78 టెస్టులు ఆడాడు. అన్ని మ్యాచ్‌లు ఆడటమంటే అద్భుతమే. అయితే, జట్టు బౌలింగ్ విభాగాన్ని ముందుండి నడిపించినట్టు నాకెప్పుడూ అనిపించలేదు. అదే సమస్య. అతడు చాలా ఉద్రేకపరుడు. ప్రతిసారీ కొత్త కొత్త టెక్నిక్‌లు, వ్యూహాలతో వస్తాడు. అమలు చేయడంలో తికమకపడతాడు. గత రెండు సిరీసుల్లో అతడి ప్రవర్తన తీరు సరిగా లేదు. ప్రతి సందర్భానికి అసహ్యంగా ప్రవర్తించాడు. ప్రతిసారీ విభిన్నంగా ప్రయత్నించాలని నిలకడ కోల్పోతాడు అని కుల్‌కర్ణి పేర్కొన్నారు. ప్రస్తుత భారత బౌలింగ్ విభాగం చాలా బాగుందని కుల్‌కర్ణి ప్రశంసించారు. ప్రస్తుత పేస్ బౌలింగ్ దళం అద్భుతంగా ఉంది. మనకిప్పుడు ఎక్కువ బౌలింగ్ వనరులు, ప్రతిభావంతులు ఉన్నారు. నాకు సమస్యగా అనిపిస్తుందల్లా వారి ఫిట్‌నెస్. నిరంతరం ఆడలేకపోతున్నారు. వరుసగా మూడు, నాలుగు మ్యాచ్‌లు ఆడితే చాలు ఆ తర్వాత మరో మ్యాచ్ ఆడలేకపోతున్నారు. దీని గురించి ఆలోచించాలి. ఇక దక్షిణాఫ్రికాపై తొలి మ్యాచ్‌లో ఓటమి సంగతి పక్కన పెడితే భువి సహా మిగతా బౌలర్లు తమ సత్తా ఏంటో చూపించారు. అలాంటి పిచ్‌లు దొరికొతే ఎలాంటి జట్టునైనా కుప్పకూల్చేయగలమని నిరూపించారు. రెండో ఇన్నింగ్స్‌లో అయితే మరిచిపోలేని బౌలింగ్ చేశారు అని కుల్‌కర్ణి అన్నారు. భారత క్రికెట్ క్లబ్ వద్ద లెజెండ్స్ క్లబ్ నిర్వహించిన కార్యక్రమంలో రాజు కుల్‌కర్ణి మాట్లాడారు. బంగ్లాదేశ్‌పై 2007లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఆయన 79 మ్యాచుల్లో 226 వికెట్లు తీశారు. 80 వన్డేల్లో 115 వికెట్లు పడగొట్టారు.

'తొలి 25 ఓవర్లు నిలకడగా ఆడాలి'

ముంబై : సెంచూరియన్‌లోని సూపర్ స్పోర్ట్ పార్క్ మైదానంలో శనివారం భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ ప్రారంభమైంది. టెస్టు సీరీస్‌ను సొంతం చేసుకోవాలంటే భారత్ ఈ మ్యాచ్‌ను తప్పనిసరిగా గెలవాలి. ఈ నేపథ్యంలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ కోహ్లీ సేనకు పలు సూచనలు చేశారు. రెండోటెస్టులో గెలవడానికి భారత్‌కు మెరుగైన అవకాశాలున్నాయని... ఈ మ్యాచ్ విరాట్‌కు పరీక్షలాంటిదని సచిన్ అభిప్రాయపడ్డారు. కేప్‌టౌన్ టెస్టులో ఓటమి భారత ఆటగాళ్ల మానసిక స్థైర్యాన్ని కోల్పోయేలా చేస్తుందని నేను భావించను. ప్రస్తుతం భారత ఆటగాళ్లు మైదానంలో ఏ విధంగా ఆడతారన్నదే ప్రధానం. ఈ టెస్టు సిరీస్‌లో అశ్విన్ లాంటి స్పిన్నర్లు కచ్చితంగా ప్రధాన పాత్ర పోషిస్తారు. మొదటి టెస్టులో హార్దిక్ పాండ్య ఒక్కడే దక్షిణాఫ్రికా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. భారత ఆటగాళ్లు నిలకడైన భాగస్వామ్యాలు నెలకొల్పడంలో విఫలమయ్యారు. అని సచిన్ తెలిపారు. తొలి 25 ఓవర్లు నిలకడగా ఆడి ఉంటే మొదటి టెస్టు ఫలితం మరోలా ఉండేది. భారత్, దక్షిణాఫ్రికా పిచ్‌లు పూర్తి విరుద్ధ స్వభావాన్ని కలిగి ఉంటాయి. దక్షిణాఫ్రికాలో పిచ్‌లు తొలి 25 ఓవర్ల పాటు పేసర్లకు అనుకూలంగా ఉంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో భారత ఆటగాళ్లు స్వదేశంలో మాదిరిగా స్వేచ్ఛగా షాట్లు ఆడటం సాధ్యపడదు. అని లిటిల్ మాస్టర్ పేర్కొన్నారు. కేప్‌టౌన్‌లో భారత ఓపికతో ఆడి ఉంటే 50 నుంచి 80 ఓవర్ల మధ్య అత్యధిక పరుగులు వచ్చేవి. సెంచూరియన్ టెస్టు మ్యాచ్‌లోనైనా కొత్త బంతి వచ్చే వరకు ఓపెనర్లు బాధ్యతగా ఆడాలి. అని సూచించాడు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·